www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 16-12-2024 పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 241
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి మ. 12.27 తదుపరి విదియ; నక్షత్రం: ఆర్ద్ర రా. 1.13 తదుపరి పునర్వసు; వర్జ్యం: ఉ.10.20-11.52; దుర్ముహూర్తం: మ.12.32-1.16, మ.2.44-3.28; అమృతఘడియలు: మ.3.40-5.12; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.41; సూర్యాస్తమయం: 5.39 | హైదరాబాద్ సిటీ *
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రోజుకు 16 గంటల ఉపవాసంతో..
నత్తనడకన జుట్టు పెరుగుదల!



ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌పై తాజా అధ్యయనాల్లో వెల్లడి
ఎలుకలు, 49 మంది యువతీ యువకులపై పరిశీలన
మూడు గ్రూపులుగా విడగొట్టి పర్యవేక్షణ 2

స్లో స్పీడ్ కారిడార్!
ఔటర్ రింగ్ రోడ్‌పై టోల్ నిర్వహణ అస్తవ్యస్తం

టోల్‌బూత్‌లలో పనిచేయని బూమ్ బారియర్స్.. భారీగా నిలిచిపోతున్న వాహనాలు
ఎగ్జిట్ రోడ్లు నిండిపోయి ఓఆర్ఆర్ పైవరకు చేరిక.. 20 వాహనాలు దాటి ఆగితే ఉచితం
అయినప్పటికీ గేట్లు ఎత్తని సిబ్బంది.. 10 గేట్లకు ముగ్గురు నలుగురు సిబ్బందితోనే సరి
1, 2 లేన్లలోకి దూసుకొస్తున్న భారీ వాహనాలు.. జరిమానాల విధింపు మాటే లేని వైనం
'ఆంధ్రజ్యోతి' క్షేత్ర స్థాయి పరిశీలనలో స్పష్టం 12



నానక్‌రామ్‌గూడ వద్ద ఔటర్ రింగ్ రోడ్‌పై ఇదీ పరిస్థితి. వాహనాల రద్దీ ఉన్నప్పటికీ 11వ నంబరు లేన్‌ను మూసివేశారు. దీంతో మిగతా లేన్లలో వాహనాలు బారులు తీరాయి. ఒక లేన్‌లో 20 వాహనాలకు మించి ఉంటే రుసుము తీసుకోకుండానే వదలాలి. ఈ నిబంధన అమలుకు వంద మీటర్ల లోపే ఎల్లో లేన్లను గీశారు. కానీ, ఎవరూ పట్టించుకోవడం లేదు.

రాజేంద్రనగర్ నుంచి శంషాబాద్ వైపు వెళ్లే మార్గంలో.. 1, 2 లేన్లలోకి భారీ వాహనాలు దూసుకొస్తున్న దృశ్యం. ఔటర్‌పైకి వచ్చే భారీ వాహనాలకు నిర్దేశించిన 3, 4 లేన్లలో గరిష్ఠ వేగం 80 కిలోమీటర్లు. కానీ, గరిష్ఠ వేగ పరిమితి 120 కిలోమీటర్లు ఉన్న, కార్లు వెళ్లే 1, 2 లేన్లలోకి వచ్చేస్తున్నాయి. దీంతో కార్ల డ్రైవర్లు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు ఇలా రాకూడదంటూ టోల్‌బూత్‌ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయలేదు.



ధరణి ఇక భూమాత
కొత్త ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా సిద్ధం

గురు, శుక్రవారాల్లో అసెంబ్లీలో సవరణ బిల్లు!
నేడు క్యాబినెట్ భేటీలో ఆమోదించే అవకాశం
ధరణిలోని పలు అంశాల్లో మార్పులు చేర్పులు
భూ సమస్యలన్నింటినీ తీర్చేలా కొత్త చట్టం
ఏ మాడ్యూల్‌లో దరఖాస్తు చేసినా పరిష్కారం
రైతులు అప్పీలుకు వెళ్లేందుకు ట్రైబ్యునళ్లు
గ్రామకంఠం భూములకూ విలువ.. రుణాలూ
సాదా బైనామా భూములకూ పరిష్కారం
ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష


సర్దార్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు సురేఖ, పొంగులేటి

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకురావాలని నిర్ణయించిన ఆర్‌వోఆర్ చట్టానికి రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన చట్ట సవరణ బిల్లును గురు, లేదా శుక్రవారాల్లో అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ చట్టంలో భాగంగా ధరణి స్థానంలో 'భూమాత'ను తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మేరకు కొత్త ఆర్‌వోఆర్ చట్టం, అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లుపై ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నివాసంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ధరణిలోని లోపాలను సవరిస్తూ.. కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై ఇప్పటికే అధికారులు కసరత్తు పూర్తిచేశారు. ముసాయిదా బిల్లును కూడా సిద్ధం చేశారు. సోమవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ బిల్లుకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. అనంతరం అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిన తర్వాత గవర్నర్ ఆమోదం కోసం పంపించనున్నారు. గవర్నర్ ఆమోదం అనంతరం కొత్త చట్టం అమల్లోకి రానుంది. కాగా, కొత్త ఆర్‌వోఆర్ చట్టంలో భాగంగా ప్రస్తుతం ధరణిలో ఉన్న అనేక అంశాల్లో మార్పులు, చేర్పులు చేయనున్నారు. ప్రజలకు మరింత మేలు జరిగేలా దీనిని రూపొందిస్తున్నారు. రైతులకు తమ భూములకు సంబంధించి ఉన్న చాలా సమస్యలకు ప్రస్తుతం ధరణిలో పరిష్కారం లభించడం లేదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించేలా ఈ కొత్త చట్టాన్ని

మిగతా 13వ పేజీలో...

15 రోజుల్లో సర్వే పూర్తి..
ఇల్లు మంజూరు!

500లోపు దరఖాస్తులున్న గ్రామాల్లో అమలు
పరిశీలన త్వరితగతిన పూర్తయ్యేలా ప్రణాళిక
నెట్ సమస్య ఉన్న చోట్ల ఆఫ్‌లైన్‌లో సర్వే
ఆ తర్వాత యాప్‌లో నమోదుకు చర్యలు 13
అన్ని జిల్లాల కలెక్టర్లకు సర్కారు సూచనలు
లబ్ధిదారుల కోసం గ్రీవెన్స్ సెల్, టోల్ ఫ్రీ



వ్యవసాయ కూలీలకు ఏటా
రూ.12 వేలు

అర్థిక సాయం అందజేతకు 28న శ్రీకారం
ఆరు నెలలకోసారి రూ.6 వేలు పంపిణీ
అన్నదాతల కోసం రూ.50 వేల కోట్ల ఖర్చు
బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరు
గత ప్రభుత్వం చేసిన అప్పులపై అసెంబ్లీలో చర్చకు కేటీఆర్, హరీశ్‌లు సిద్ధమా?
నాటి అప్పులపై శ్వేతపత్రం విడుదల చేస్తాం
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఖమ్మం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థికసాయం అందించబోతున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఆరు నెలలకు రూ.6 వేల చొప్పున ఏడాదిలో రెండు విడతలుగా ఈ మొత్తాన్ని పంపిణీ చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినమైన డిసెంబరు 28న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు పేర్కొన్నారు. ఇక రైతులకు రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని వచ్చే సంక్రాంతి నుంచి అందజేస్తామన్నారు. కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మరని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల శ్వేతపత్రంపై అసెంబ్లీలో చర్చకు సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే కేటీఆర్, హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఆదివారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం విలేకరుల

మిగతా 13వ పేజీలో...



జాకీర్ హుస్సేన్ ఆరోగ్యం విషమం 2

హృద్రోగంతో అమెరికా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రఖ్యాత తబలా మ్యాస్ట్రో
ఆయన ఇక లేరంటూ వదంతులు
ఆ వార్తల్ని ఖండించిన కుటుంబసభ్యులు



ఈ వారమే జమిలి బిల్లు! 2

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్రం
నేటి బిల్లుల జాబితాలో లేకపోవడంతో..
ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్న ఊహాగానాలు
పునరాలోచన లేదన్న బీజేపీ వర్గాలు
పార్టీల మద్దతు కూడగట్టేందుకు యత్నాలు
ఎన్నికలు ఎప్పుడనే దానిపై అస్పష్టత


ఏపీ నుంచి తెలంగాణలోకి వస్తుండగా వల్లభిలో నిలిపేసిన ధాన్యం లారీలు

ఏపీ నుంచి సన్నాల
అక్రమ రవాణా

రూ.500 బోనస్ ఇస్తుండటంతో తరలింపు
కృష్ణా, గుంటూరులో కొనుగోలు
91 లారీల్లో ఖమ్మం జిల్లాలోని పలు మండలాలకు..
31 లారీలు వెనక్కి.. మరో 60 లారీలకు సెస్‌తో ఓకే
రేషన్ బియ్యం ఇతర రాష్ట్రాలకు.. రైళ్లలో రవాణా

ఖమ్మం/ముదిగొండ, నేలకొండపల్లి, మేడ్చల్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి తెలంగాణలోకి సన్న ధాన్యం అక్రమ రవాణా అవుతోంది. సన్నాలకు క్వింటాకు రూ.500 చొప్పున రాష్ట్ర సర్కారు బోనస్ ఇస్తుండటంతో దళారులు, వ్యాపారులు నకిలీ పత్రాలు సృష్టించి అడ్డదారుల్లో రాష్ట్రంలోకి తరలిస్తున్నారు. ఏపీలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సన్నధాన్యాన్ని కొనుగోలు చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైస్‌మిల్లుల పేరుతో ఫారం-10 ద్వారా ఏకంగా 91లారీల ధాన్యం ఖమ్మం జిల్లాలోని ముదిగొండ, నేలకొండపల్లి మండలాల

మిగతా 12వ పేజీలో...

మెగా బ్రదర్స్ ఇంటికి
అల్లు అర్జున్



అల్లుడూ ఎలా ఉన్నావ్ అని అడిగిన చిరు
సతీసమేతంగా చిరంజీవి వద్దకు అర్జున్ 10
అనంతరం నాగబాబు నివాసానికి కూడా..



తప్పు నాదే..
క్షమించండి

సారీ చెప్పడం తప్ప మాట్లాడలేని స్థితిలో ఉన్నా
జర్నలిస్టు రంజిత్‌తో మంచు మోహన్‌బాబు
విష్ణుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శ 10
కుటుంబానికి అండగా ఉంటానని హామీ
జర్నలిస్టు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

ఆదిలాబాద్ @ 4.7

- రాష్ట్రంలో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- ఆదిలాబాద్ జిల్లా భీమాపూర్‌లో 6.3 డిగ్రీలు
- పటాన్‌చెరులో 8.8 డిగ్రీలు, మరో 2 చోట్లా..
- తెలంగాణ అంతటా వణుకు పుట్టిస్తున్న చలిపులి


నిర్మల్‌లో..

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బారెడు పొద్దెక్కినా ఇంకాసేపు ముసుగు తన్ని పడుకుంటే బాగుణ్ను అనిపిస్తోంది! కప్పుకున్న దుప్పటి తీయబుద్ధేయడం లేదు.. మంచం దిగాలనిపించడం లేదు.. అంతా చలిపులి భయంతోనే! ఉదయం గడియారం తొమ్మిది గంటలు కొట్టినా.. ఒకింత ఎండ బాగానే వచ్చినా ఆ వణుకు పోవడం లేదు. మలిసంధ్యలోనూ అంతే. సాయంత్రం నాలుగున్నర నుంచే వణికిస్తున్న చలి.. చీకట్లు కమ్ముకున్నాక పంజా విసురుతోంది. స్వెట్టర్లు, మఫ్లర్లు, కంబళ్లతో ప్రతిఘటించినా చలి తీవ్రతపోతేనా? చలి కారణంగా పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామున కొన్నిచోట్ల దట్టమైన

మిగతా 13వ పేజీలో...

గ్రూప్-2కు 46% హాజరు

పేపర్-1తో పోలిస్తే పేపర్-2 తేలిక! 14
జనగామలో అధికారుల నిర్లక్ష్యంతో అవకాశం కోల్పోయిన గిరిజన అభ్యర్థిని
సెంటర్‌పై తప్పుడు సమాచారంతోనే..
నేటితో ముగియనున్న పరీక్షలు


పాలమూరులో స్క్రైబ్ సాయంతో పరీక్ష రాస్తున్న అంధుడు

అధ్యక్ష రేసులో లేను

రాష్ట్ర పార్టీలో నియామకాలపై చర్చ కూడా జరగలే
నాకు బాధ్యతలు అప్పగిస్తారనేది ఊహాగానాలే 3
మంత్రి పదవి రూపంలో పెద్ద బాధ్యతలో ఉన్నా..
తప్పుడు ప్రచారాలతో నాపై కుట్రలు పన్నుతున్నారు
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



సర్కారీ కార్పొరేట్ ఆస్పత్రి!

పీహెచ్‌సీ నుంచి బోధనాస్పత్రుల దాకా హంగులు 3
రోగులను సాదరంగా చేర్చుకుని.. చికిత్సకు చర్యలు
రిసెప్షన్, వైద్యుల గదులు, ల్యాబ్‌లు తెలిసేలా బోర్డులు
రోగులు గుర్తించేలా పీహెచ్‌సీ సబ్ సెంటర్లకు బ్రాండింగ్
పోర్టల్‌తో ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి.. ప్రైవేటులో అధ్యయనం



ఐసీయూలో జాకీర్ హుస్సేన్

న్యూయార్క్, డిసెంబరు 15: ప్రపంచ ప్రఖ్యాత తబలా విద్వాంసుడు.. పద్మవిభూషణ్ పురస్కారగ్రహీత.. ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ (73) ఆరోగ్యం విషమంగా ఉంది. అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయన రెండువారాలుగా అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఆయన పరిస్థితి విషమించిందని.. దీంతో వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్సచేస్తున్నారని జాకీర్‌హుస్సేన్ ఆప్తమిత్రుడు రాకేశ్ చౌరాసియా ఒక ప్రకటనలో తెలిపారు. అయితే.. జాకీర్ హుస్సేన్ ఇక లేరనే వదంతులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. కేంద్ర సమాచార, ప్రసారశాఖ సైతం.. జాకీర్ మృతిపట్ల సంతాపం తెలుపుతూ 'ఎక్స్'లో ట్వీట్ చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల నాయకులు కూడా 'ఎక్స్' వేదికగా ఆయనకు నివాళులర్పించారు. అయితే.. సోషల్ మీడియాలో వైరల్ అయిన జాకీర్ మృతి వార్తను నమ్మవద్దని.. ఆయన జీవించే ఉన్నారని, కాకపోతే ఆయన ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉందని ఆయన సోదరి ఖుర్షీద్ ఔలియా, మేనల్లుడు అమీర్ తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జాకీర్ హుస్సేన్ ఆరోగ్యం కోసం అభిమానులందరూ ప్రార్థన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. దీంతో కేంద్ర సమాచార, ప్రసార శాఖ తన ట్వీట్‌ను డిలీట్ చేసింది.


కుప్పకూలిన కాంగ్రెస్ మీడియా విభాగం!

- హరియాణ, మహారాష్ట్ర ఎన్నికల్లో కీలక నేతల మధ్య సమన్వయ లోపం
- జైరాం రమేశ్ తీరుపై విమర్శల వెల్లువ



న్యూఢిల్లీ, డిసెంబరు 15: కాంగ్రెస్ పార్టీలో కీలకమైన మీడియా కమ్యూనికేషన్ల విభాగం పూర్తిగా విఫలమైందా? ఈ విభాగంలో గందరగోళం నెలకొందా? ఈ కారణంగానే కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పాలైందా? అంటే.. ఔననే అంటున్నారు పార్టీ నేతలు. కాంగ్రెస్ పార్టీ కమ్యూనికేషన్ల విభాగం ప్రధాన కార్యదర్శిగా ఉన్న సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ చుట్టూ విమర్శలు ముసురుకున్నాయి. 2022, జూన్‌లో బాధ్యతలు చేపట్టిన జైరాం.. పార్టీ తరఫున బలమైన గళాన్ని వినిపించే అధికార ప్రతినిధులను నియమించకపోవడం, మీడియాలో చర్చలకు వెళ్లే ప్యానలిస్టులను ఎంపిక చేయడంలో విఫలమయ్యారన్న విమర్శలు వస్తున్నాయి. ఫలితంగా హరియాణ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన వాయిస్ వినిపించేవారు లేకుండా పోయారని నాయకులు చెబుతున్నారు. దీంతో నాయకుల మధ్య సమన్వయ లోపాలు కొట్టొచ్చినట్టు కనిపించాయని తెలిపారు. ఒకరకంగా పార్టీ కమ్యూనికేషన్ల వ్యవస్థ కుప్పకూలిందని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా జైరాం రమేశ్, పవన్ ఖేరాల మధ్య నెలకొన్న విభాదాలు పార్టీ మీడియా విభాగానికి తూట్లు పొడిచాయని పేర్కొంటున్నారు. ఏఐసీసీ నాయకత్వానికి కలుపుకొని పోవడంలో జైరాం రమేశ్ విఫలమయ్యారని అనేక మంది నాయకులు చెబుతున్నారు. అదేవిధంగా రాష్ట్రాల ఇన్‌చార్జులు, అధికార ప్రతినిధులతోనూ ఆయనకు సమన్వయం చేసుకోలేదని తెలిపారు. "పార్టీలో కీలకమైన యువగళాలను ప్రోత్సహించడంలో కమ్యూనికేషన్ల విభాగం నాయకత్వం విఫలమైంది" అని ఓ సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించారు.

లోకం తీరు



ఈవీఎంలపై నమ్మకం లేకపోతే..
ఎన్నికల్లో పోటీ చేయొద్దు: ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ, డిసెంబరు 15: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎం)లపై నమ్మకం లేకపోతే పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయొద్దని జమ్మూ- కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. గెలిచినప్పుడు సంబరాలు చేసుకుని ఓడిపోయినప్పుడు మాత్రం ఈవీఎంలను నిందించడం సరికాదని తమ మిత్ర పక్షమైన కాంగ్రెస్‌పై ఆయన పరోక్షంగా విమర్శలు చేశారు. ఈ మేరకు పీటీఐకి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. "ఈవీఎంల ద్వారా వంద మందికి పైగా మీ పార్టీ అభ్యర్థులు ఎంపీలుగా గెలిచినప్పుడు సంబరాలు చేసుకుని, కొన్ని నెలల తర్వాత మరో ఎన్నికల్లో మీరు ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోతే ఈవీఎంలను నిందించడం సరికాదు" అని అన్నారు. ఓటర్లు ఒక్కోసారి ఒక్కో వ్యక్తిని ఎన్నుకుంటారని, అందుకు తానే ఉదాహరణనని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తనను తిరస్కరించారని, కొన్ని నెలల తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించారని చెప్పారు. తాను మెషిన్‌లను ఎప్పుడూ తప్పుపట్టలేదని తెలిపారు.

మహా మంత్రివర్గ విస్తరణ..39 మంది ప్రమాణం

ముంబై, డిసెంబరు15: మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణ జరిగింది. బీజేపీ నుంచి 19, శివసేన నుంచి 11, ఎన్సీపీ నుంచి 9 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. 33 ఏళ్ల విరామం తర్వాత తొలిసారి రాష్ట్ర రెండో రాజధాని నాగ్‌పూర్‌లోని రాజ్‌భవన్‌లో మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. సీఎం ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ శిండే, అజిత్ పవార్‌ల సమక్షంలో గవర్నర్ రాధాకృష్ణన్ మంత్రులతో ప్రమాణం చేయించారు. కాగా, మంత్రి పదవి రాకపోవడంతో శివసేన ఎమ్మెల్యే నరేశ్ భొండేకర్ పార్టీకి రాజీనామా చేశారు. భండారా-పావని నియోజకవర్గం నుంచి గెలిచిన నరేశ్ విదర్భలో కీలక నేత. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రి పదవిపై తనకు మాట ఇచ్చి తప్పారని నరేశ్ ఆరోపించారు.

గోదావరి.. జలసిరి!

- 129.17 బీసీఎం నీటి లభ్యతతో టాప్-3లో
- 86.32 బీసీఎంతో ఏడో స్థానంలో కృష్ణానది

న్యూఢిల్లీ, డిసెంబరు 15: నీటి లభ్యత విషయంలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతం దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఈ నదిలో వార్షిక నీటి లభ్యత 129.17 బిలియన్ క్యూబిక్ మీటర్లని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) లెక్కలు వేసింది. 1985 నుంచి 2023 మధ్య దేశ సగటు వార్షిక నీటి లభ్యత 2,116.95 బీసీఎంగా ఉందని 'అసెస్‌మెంట్ ఆఫ్ వాటర్ రిసోర్సెస్ ఆఫ్ ఇండియా 2024' పేరుతో సీడబ్ల్యూసీ ఇటీవల చేపట్టిన అధ్యయనం వెల్లడించింది. ఈ జాబితాలో బ్రహ్మపుత్ర (592.32 బీసీఎం) మొదటి స్థానం, గంగా నది(581.75 బీసీఎం) రెండో స్థానంలో ఉన్నాయి. 86.32 బీసీఎంతో కృష్ణానది ఏడో స్థానంలో ఉంది. ఇక సబర్మతి (9.87 బీసీఎం), పెన్నా (10.42 బీసీఎం), మాహి (13.03 బీసీఎం) చివరి మూడు బేసిన్లుగా నిలిచాయి. సింధూ నదితో పాటు దాని ఉపనదులైన జీలం, చీనాబ్ మినహా దేశంలోని అన్ని నదీ పరీవాహక ప్రాంతాల్లో ఈ అధ్యయనం చేపట్టారు. 1985 నుంచి 2015 వరకూ దేశంలో నీటి లభ్యత 1,992.2 బీసీఎంగా గత సర్వే పేర్కొంది. 1901-03లో చేపట్టిన తొలి అంచనాల ప్రకారం ఇది 1,443.2 బీసీఎం మాత్రమే.

దేశంలోనే తొలి డయాబెటిస్ బయోబ్యాంక్

న్యూఢిల్లీ, డిసెంబరు 15: భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) దేశంలోనే తొలి డయాబెటిస్ బయోబ్యాంక్‌ను చెన్నైలో ఏర్పాటు చేసింది. శాస్త్రీయ పరిశోధనల నిమిత్తం మద్రాస్ డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్) సహకారంతో దీన్ని ప్రారంభించింది. శాస్త్రీయ అధ్యయనాలకు ఉపయోగపడే జీవ నమూనాలను సేకరించడం, వాటిని ప్రాసెస్ చేయడం, నిల్వ చేయడం, పంపిణీ చేయడం ఈ బయోబ్యాంక్ లక్ష్యం. మధుమేహానికి కారణాలు, భారతీయుల్లో ఎక్కువగా వచ్చే వైవిధ్యాలు, వాటి ద్వారా వచ్చే రుగ్మతలపై అధునాతన పరిశోధనలకు ఈ బయోబ్యాంక్ దోహదపడుతుందని వైద్యులు తెలిపారు. ఈ బయోబ్యాంకులో ఐసీఎంఆర్ నిధులతో నడిచే రెండు సంస్థలతోపాటు.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి శాంపిళ్లను సేకరించి వాటిపై పరిశోధనలు చేస్తారు.

దావూద్ అనుచరుడు డానిష్ మర్చెంట్ అరెస్టు

ముంబయి, డిసెంబరు 15: మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ దావూద్ ఇబ్రహీం అనుచరుడైన డానిష్ మర్చెంట్ అలియాస్ డానిష్ చిక్నాను ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. ముంబయిలోని డోంగ్రీ ప్రాంతంలో దావూద్ ఇబ్రహీంకు చెందిన మాదకద్రవ్యాల వ్యాపారాలను ఇతడే చూసుకుంటున్నాడు. నవంబరు 8న మెరైన్ లైన్స్ వద్ద 144 గ్రాముల మత్తు పదార్థాలను కలిగి ఉన్న మహమ్మద్ ఆషికుర్ సహిదూర్ రహ్మాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు రెహాన్ షకీల్ అన్సారీని అదుపులోకి తీసుకున్నారు. అన్సారీని విచారించగా తాను డ్రగ్స్‌ను డానిష్ మర్చెంట్, ఖాదిర్ నుంచి కొనుగోలు చేసినట్టు చెప్పాడు. దాని ఆధారంగా సోదాలు జరిపి డానిష్ మర్చెంట్‌ను అరెస్టు చేశారు.

అమెరికాలో యూఎఫ్‌వోల కలకలం



న్యూ జెర్సీలో శనివారం రాత్రి కనిపించిన అంతరిక్ష వాహనాలు

ట్రెన్టన్, డిసెంబరు 15: హాలీవుడ్ సినిమాల తరహాలో.. అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రంలో పలు కౌంటీల్లో పదే పదే కనిపిస్తున్న మానవ రహిత గగనతల వాహనాలు (యూఏవీ) స్థానికుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి! నవంబరు 18 నుంచి తరచుగా కనిపిస్తున్న ఈ యూఏవీలు.. అమెరికా సైన్యం పరీక్షిస్తున్న డ్రోన్లా? విమానాలా? లేక గ్రహాంతరవాసులకు చెందిన గుర్తుతెలియని ఎగిరే వస్తువులా(యూఎఫ్‌వో)?.. ఏ విషయం తెలియక ప్రజలు కంగారు పడుతున్నారు! తాజాగా ఓషన్ కౌంటీకి చెందిన ఒక అధికారి.. అట్లాంటిక్ మహా సముద్రం వైపు నుంచి 50 యూఏవీలు వస్తున్న విషయాన్ని గుర్తించి పై అధికారులను అప్రమత్తం చేశాడు. వెంటనే ఆ కౌంటీ షెరీఫ్ మైకేల్.. ఆ 50 డ్రోన్లలో ఒకదాన్ని అనుసరించడానికి 'ఇండస్ట్రియల్ గ్రేడ్' డ్రోన్‌ను ప్రయోగించారు. కానీ, ఆ యూఏవీ.. తాము పంపిన డ్రోన్‌ను చాలా సులభంగా, వేగంగా తప్పించుకుని వెళ్లిపోయిందని ఆయన తెలిపారు. ఈ యూఏవీలు ఏవీ సాధారణ డ్రోన్ల తరహాలో వేడిని విడుదల చేయట్లేదని ఆయన వివరించారు. అట్లాంటిక్ సముద్రం నుంచి వస్తున్న ఈ డ్రోన్ల గురించి ఆయన న్యూజెర్సీ రాష్ట్ర పోలీసులకు, ఎఫ్‌బీఐ అధికారులకు, తీర రక్షక దళానికి సమాచారం అందించగా.. 8 అడుగుల విస్తీర్ణం ఉన్న 13 డ్రోన్లు తమ నౌకల్లో ఒకదాన్ని అనుసరిస్తున్నట్టు తీర రక్షక దళం తెలిపింది. అయితే, ఆ ప్రాంతంలో పలు సైనిక స్థావరాలున్న నేపథ్యంలో.. అవి సైన్యం పరీక్షిస్తున్న గగనతల వాహనాలా? అనే సందేహం కూడా చాలా మందిలో ఉంది. ఒకవేళ ఈ యూఏవీలు అమెరికా సైన్యానికి చెందినవి కాకపోతే.. అది మరింత భయానకమైన విషయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవి ఇరాన్‌కు చెందిన మదర్ షిప్ నుంచి వస్తున్న డ్రోన్లని కొందరు.. చైనా డ్రోన్లని మరికొందరు.. సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అలాంటిదేమీ లేదని పెంటగాన్ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. ప్రజల భద్రతకు ఎలాంటి ప్రమాదమూ లేదని తెలిపింది. అవి సైన్యానికి చెందిన డ్రోన్లా కాదా అనే విషయం ఇప్పటికీ తేలకపోవడంతో.. దీనిపై సమాధానాలు కోరుతూ న్యూజెర్సీ గవర్నర్ బైడెన్‌కు లేఖ రాశారు.

ఢిల్లీపై సంఘ్ గురి

క్షేత్ర స్థాయిలో 50 వేల భేటీలు

- 'ఆప్' అవినీతిపై నేరుగా ప్రజల్లోకి
- ఢిల్లీ బీజేపీ శ్రేణుల్లో నూతనోత్తేజం





న్యూఢిల్లీ, డిసెంబరు 15: మహారాష్ట్రలో బీజేపీ-శిండే శివసేన-అజిత్‌పవార్ ఎన్సీపీతో కూడిన మహాయుతి కూటమి ఘనవిజయంలో కీలక భూమిక పోషించిన ఆర్ఎస్ఎస్ ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించింది. బీజేపీ శ్రేణులను ఉత్తేజపరిచేందుకు క్షేత్ర స్థాయిలో కనీసం 50 వేల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. గత నెల 23న మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు విడుదల కాగానే సంఘ్ శ్రేణులు ఢిల్లీలో దిగిపోయాయి. 70 స్థానాల అసెంబ్లీలో మొత్తం 13 వేల వరకు ఎన్నికల బూత్‌లు ఉన్నాయి. ప్రతి బూత్ స్థాయిలో ఆరెస్సెస్ శ్రేణులు చిన్న చిన్న గల్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాయి. పాలక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వ అవినీతి, కుంభకోణాలు, నీరు, కరెంటు సమస్యలు, బంగ్లాదేశ్ చొరబాటుదారులకు ఆప్ హయాంలో రేషన్ కార్డులు ఇవ్వడం వంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీపై అసంతృప్తితో ఆర్ఎస్ఎస్ దూరంగా ఉండడంతో మహాయుతి ఘోరంగా దెబ్బతింది. దరిమిలా అత్యున్నత స్థాయిలో చర్చలు జరిగి.. తిరిగి ఉభయపక్షాలూ చేతులు కలిపాయి. దీంతో, మహాయుతి భారీ విజయాన్ని సాధించింది. ఈ క్రమంలో ఈ సారి ఎలాగైనా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవడానికి సంఘ్ ఎత్తుగడలు వేస్తోంది. 1993 తర్వాత బీజేపీ ఇక్కడ గెలవలేదు. 1998, 2003, 09 ఎన్నికల్లో కాంగ్రెస్ వరుసగా నెగ్గింది. 2013 ఎన్నికల్లో 32 సీట్లతో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినా.. హంగ్ ఏర్పడింది. కాంగ్రెస్ మద్దతుతో ఆప్ అధికారంలోకి వచ్చింది. అయితే తాను తెచ్చిన లోక్‌పాల్ బిల్లును ఇతర పార్టీలు సమర్థించకపోవడంతో కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. తర్వాత కేంద్రం రాష్ట్రపతి పాలన విధించింది. 2015 ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ 70 స్థానాలకుగాను 67 చోట్ల గెలిచింది. బీజేపీ మూడు సీట్లతో సరిపెట్టుకుంది. కాంగ్రెస్‌కు ఒక్కటీ దక్కలేదు. 2020 ఎన్నికల్లో ఆప్ 62, బీజేపీ 8 చోట్ల విజయం సాధించాయి. వరుసగా ఆరు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బీజేపీ.. ఈ సారి పాగా వేయాలని చూస్తోంది.

న్యూఢిల్లీలో కేజ్రీవాల్‌తో సందీప్ దీక్షిత్ ఢీ

ఆప్ అధినేత కేజ్రీవాల్‌పై న్యూఢిల్లీ నియోజకవర్గంలో మరోసారి షీలా దీక్షిత్ కుటుంబం బరిలోకి దిగుతోంది. మూడుసార్లు వరుసగా ఢిల్లీలో కాంగ్రెస్‌ను విజయపథంలో నడిపిన ఆమెపై ఇదే స్థానంలో 2013లో కేజ్రీవాల్ 26,500 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ విజయమే ఆయన్ను కీలక నేతను చేసింది. ఈసారి ఆమె కుమారుడు, మాజీ ఎంపీ సందీప్ దీక్షిత్‌ను కాంగ్రెస్ ఆయనపై పోటీకి దించుతోంది. 15 ఏళ్లపాటు షీలాదీక్షిత్ ఢిల్లీలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఇంకా ప్రజలకు గుర్తున్నాయని.. కేజ్రీవాల్‌ను ఓడించే సత్తా సందీప్‌కు ఉందని కాంగ్రెస్ వర్గాలు ధీమాగా చెబుతున్నాయి. బీజేపీ ఇంకా తన అభ్యర్థిని ప్రకటించలేదు. మాజీ సీఎం సాహిబ్‌సింగ్ వర్మ కుమారుడు, మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ పేరు వినబడుతోంది. ఈ దఫా ఎన్నికల్లో అధిక శాతం ఓట్లు సాధించి పరువు నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది.

కల్కాజీ నుంచి సీఎం ఆతిశీ పోటీ

38 మందితో ఆప్ తుది జాబితా విడుదల

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఆప్ ఆదివారం 38 మంది అభ్యర్థులతో తుది జాబితాను విడుదల చేసింది. సీఎం ఆతిశీ మళ్లీ కల్కాజీ నుంచి బరిలోకి దిగుతుండగా.. సౌరభ్ భరద్వాజ్ గ్రేటర్ కైలాస్ నుంచి, గోపాల్‌రాయ్-బాబర్‌పూర్, అమానతుల్లా ఖాన్-ఓఖ్లా, సత్యేంద్ర జైన్-షాకూర్ బస్తీ, రఘువీందర్ షోకీన్-నంగ్లోయ్, ముకేశ్‌కుమార్ అహ్లావత్-సుల్తాన్‌పూర్ మజ్రా, సంజీవ్ ఝా-బురారీ, అజేశ్ యాదవ్-బద్లీ, దుర్గేశ్ పాఠక్ రాజేందర్‌నగర్ నుంచి పోటీచేస్తారని కేజ్రీవాల్ ప్రకటించారు. 20 మంది సిటింగ్ ఎమ్మెల్యేలకు ఆప్ సీట్లు నిరాకరించింది. కస్తూర్బా నగర్‌లో ఎమ్మెల్యే మదన్‌లాల్ స్థానంలో బీజేపీ నుంచి ఆదివారం ఆప్‌లో చేరిన రమేశ్ పెహల్వాన్‌కు టికెట్ ఇచ్చారు. కాగా.. పూర్తి ఆత్మవిశ్వాసంతో మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను నిలిపినట్లు కేజ్రీవాల్ 'ఎక్స్'లో తెలిపారు. బీజేపీకి సీఎం అభ్యర్థే లేరని ఎద్దేవాచేశారు. 'ఆ పార్టీకి ఒక టీమ్ లేదు.. ప్రణాళిక లేదు.. ఢిల్లీపై ఒక విజనే లేదు. కేజ్రీవాల్‌ను తొలగించాలన్నదే దాని ఏకైక మిషన్' అని విమర్శించారు.

ఆయుధాలు వీడండి

- మీ పునరావాసం బాధ్యత మాది
- మావోయిస్టులకు అమిత్ షా పిలుపు



జగ్దల్‌పూర్, రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్), డిసెంబరు 15 : ఆయుధాలు వీడి జన జీవన స్రవంతిలోకి రావాలని మావోయిస్టులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. జగ్దల్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన "బస్తర్ ఒలింపిక్స్" క్రీడల కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆయుధాలు వీడిన మావోయిస్టులకు పునరావాసం కల్పించే బాధ్యత తమదేనన్నారు. అంతకు ముందు రాయ్‌పూర్‌లోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్రపతి కలర్ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల సమస్యను 2026 మార్చి 31కల్లా నివారించేందుకు కట్టుబడి ఉన్నాయని చెప్పారు. ఆ రాష్ట్రంలో ఈ సమస్య నివారణ అయితే దేశమంతటా నివారణ అయినట్లేనన్నారు. మావోయిస్టు వ్యతిరేక పోరులో ఛత్తీస్‌గఢ్ పోలీసులు గడచిన ఏడాది కాలంగా గణనీయ విజయాలు సాధించారని పేర్కొన్నారు. 287 మంది మావోయిస్టులను నిర్మూలించారని, దాదాపు 1000 మందిని అరెస్టు చేశారని తెలిపారు. ఈ ఒక్క రాష్ట్రంలోనే 837 మంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. 14 మంది అగ్రనేతలు హతమయ్యారని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమాన్ని అదుపు చేశామన్నారు. కాగా లొంగిపోయిన ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, అసోం రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులతో అమిత్‌షా జగ్దల్‌పూర్‌లో సమావేశమయ్యారు. వారు హింసను వీడి జన జీవన స్రవంతిలో కలిసినందుకు ఆనందం వ్యక్తం చేశారు.



బెంగళూరు టెకీ అతుల్ భార్య అరెస్టు

- అత్త, బావమరిది కూడా..

బెంగళూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అతుల్ సుభాష్ ఆత్మహత్య కేసులో అతడి భార్య నిఖిత, అత్త నిశా, బావమరిది అనురాగ్‌ను బెంగళూరు మారతహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. అతుల్ సుభాష్ ఆత్మహత్యకు ప్రేరేపించారని వీరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వీరు... పోలీసులు వస్తారనే సమాచారంతో పరారై, వివిధ ప్రదేశాల్లో తలదాచుకోగా పోలీసులు గుర్తించారు. హర్యానాలోని గుర్‌గావ్‌లో నిఖితను, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అత్త, బావమరిదిని అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. మరోవైపు, నిఖిత దగ్గర ఉన్న తమ మనవడిని అప్పగించాలని అతుల్ తండ్రి విజ్ఞప్తి చేశారు.

గంజాయి కోసం జైలర్‌పై ఖైదీ దాడి

ప్రాణాపాయస్థితిలో జైలర్..బెళగావిలో ఘటన

బెంగళూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గంజాయి కోసం ఓ ఖైదీ ఏకంగా జైలర్‌పైనే దాడి చేశాడు. కర్ణాటకలోని బెళగావిలో గల హిండలగా సెంట్రల్ జైలులో నాలుగురోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 11వ తేదీన జైలులో బ్యారక్‌ల తనిఖీకి అసిస్టెంట్ జైలర్ జీఆర్ కాంబళె వెళ్లారు. ఆ సమయంలో విచారణ ఖైదీ షామిద్ ఖురేష్ బ్యారక్‌లో గంజాయి ప్యాకెట్ కనిపించింది. దానిని అసిస్టెంట్ జైలర్ స్వాధీనం చేసుకోగా ఖైదీ గొడవపడ్డాడు. జైలర్‌ను చితకబాదాడు. తీవ్రంగా గాయపడిన ఆయనకు రహస్యంగా చికిత్స అందించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఆస్పత్రికి తరలించారు.

ఈ వారమే జమిలి బిల్లు!

- పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కేంద్రం
- నేటి బిల్లుల జాబితాలో లేకపోవడంతో కేంద్రం వెనక్కి తగ్గిందని ఊహాగానాలు



న్యూఢిల్లీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంట్‌లో ఈ వారమే ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్ ఈ బిల్లును ప్రవేశ పెట్టనున్నట్లు కేంద్ర వర్గాల ద్వారా తెలిసింది. లోక్‌సభకు, దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులకు గత గురువారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కాగా, సోమవారమే జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెడతారనే ప్రచారం జరిగింది. కానీ, సోమవారం ప్రవేశ పెట్టనున్న బిల్లుల జాబితాలో జమిలి ఎన్నికల బిల్లు లేకపోవడంతో.. ఈ విషయంలో కేంద్రం వెనక్కి తగ్గిందనే ప్రచారం మొదలైంది. అయితే, ఈ ప్రచారాన్ని బీజేపీ వర్గాలు కొట్టిపారేశాయి. జమిలి ఎన్నికల విషయంలో వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేశాయి. మంగళవారం గానీ, ఈ వారంలో గానీ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. కాగా, జమిలి ఎన్నికలకు సంబంధించి రెండు బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో మొదటిది.. లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు కాగా, రెండోది శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాలకు ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన సాధారణ బిల్లు. ఉభయ సభల్లో ఈ బిల్లులను ప్రవేశపెట్టి, వెంటనే జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపనున్నట్టు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈసారి కేవలం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపైనే కేంద్రం దృష్టి సారించింది. పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల విషయంలో మాత్రం కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోలేదు. స్థానిక ఎన్నికలను తర్వాత దశలో పరిశీలించనున్నట్టు బీజేపీ వర్గాల ద్వారా తెలిసింది.

ప్రస్తుతానికి రెండు బిల్లులే..

జమిలి ఎన్నికల కోసం మొత్తం ఆరు బిల్లులు పెట్టాల్సి ఉండగా, ప్రస్తుతం రెండింటికే పరిమితం అవుతున్నారు. తొలి బిల్లులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 83 (పార్లమెంటు కాలపరిమితి), ఆర్టికల్ 172 (అసెంబ్లీ కాలపరిమితి)లను సవరిస్తారు. ఇందుకు ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. లోక్‌సభలో మూడింట రెండు వంతులు అంటే 361 మంది సభ్యుల మద్దతు కావాలి. కానీ, ఎన్డీయే కూటమి బలం 293 మాత్రమే. వైసీపీ, బీజేడీ, అన్నాడీఎంకే మద్దతు ఇచ్చినా 2/3 చేరుకోవడం అసాధ్యం. రాజ్యసభలోనూ 154 మంది ఎంపీల మద్దతు కావాలి. ఎన్డీయే బలం నామినేటెడ్ సభ్యులను కలుపుకొని 119 మాత్రమే. అంటే, ఉభయ సభల్లో బిల్లు నెగ్గడం అంత తేలికేమీ కాదు. అయితే, జమిలి బిల్లుపై వీలైనన్ని పార్టీల మద్దతు కూడగట్టుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. అలాగే, జమిలి ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే విషయంలోనూ స్పష్టత లేదు. కానీ, ఎప్పుడు ఎన్నికలు జరిగినా దేశమంతా ఒకేసారి నిర్వహించాలని కేంద్రం ప్రయత్నిస్తోంది.

రాష్ట్రాలకు రూ.71,889 కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం వివిధ పద్దుల కింద రాష్ట్రాలకు రూ.71,889 కోట్ల నిధులు విడుదల చేసింది. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు మంజూరు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ ఆదివారం పేర్కొంది. జాతీయ విపత్తు ఉపశమన నిధి (ఎన్డీఎంఎఫ్), పోస్ట్-డెవల్యూషన్ రెవెన్యూ లోటు (పీడీఆర్డీ) గ్రాంట్, స్థానిక సంస్థలకు గ్రాంట్లు, ఎస్డీఆర్ఎఫ్, ఎస్డీఎంఎఫ్‌లలో కేంద్రం వాటా, ఎన్డీఆర్ఎఫ్ అదనపు సాయంలో భాగంగా కేంద్రం ఈ నిధులు విడుదల చేసింది. రెవెన్యూ లోటు పూడ్చడానికి పీడీఆర్డీ గ్రాంటు కింద రూ.18,362.25 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.6,845 కోట్లు, గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.20,847.25 కోట్లు, ఆరోగ్య రంగం గ్రాంట్ కింద రూ.2,894.01 కోట్లు, ఎస్డీఆర్ఎఫ్, ఎస్డీఎంఎఫ్‌లలో కేంద్రం వాటా కింద వరుసగా రూ.15,823.20 కోట్లు, రూ.1,385.45 కోట్లను మంజూరు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది.

దుబాయ్‌లో 'బంగారం చాయ్'

విలువ రూ.1.14 లక్షలు


- కాఫీ అయితే రూ.1.09 లక్షలు
- ఆ హోటల్ భారతీయులదే



దుబాయ్, డిసెంబరు 15: 'లక్షాధికారైన లవణం, అన్నమెగానీ మెరుగు బంగారంబు మింగబోడు'.. ఇదో సత్తికాలం నాటి మాట. ఇప్పుడు దుబాయ్ వెళ్తే నిజంగానే బంగారం తినొచ్చు. బంగారం కాఫీ, బంగారం టీ కూడా తాగొచ్చు. 'గోల్డ్ కడక్ టీ' 5000 దిర్హామ్‌లు (రూ1.14 లక్షలు) పలుకుతోంది. ఎమిరేట్స్ ఫైనాన్షియల్ టవర్స్‌లో ఏర్పాటు చేసిన బోహో కేఫ్‌లో ఇవన్నీ దొరుకుతాయి. దీని యజమాని సుచేత శర్మ అనే భారతీయ మూలాలు ఉన్న మహిళే. ఇక్కడ గోల్డ్ చాయ్ ఆర్డర్ చేస్తే.. దానిపై 24 క్యారెట్ల మేలిమి బంగారం పొడి చల్లి, వెండి కప్పుల్లో ఇస్తారు. దీంతోపాటుగా 'క్రోయిస్సాంట్' అనే ఫ్రెంచ్ వంటకాన్ని కూడా వెండి పళ్లెంలో ఇస్తారు. దీని పైనా బంగారం పొడి చల్లుతారు. చివర్లో ఈ కప్పులు, పళ్లేలను వినియోగదారులు తీసుకెళ్లిపోవచ్చు. ఈ రాయల్ మెనూలో 'గోల్డ్ సావరిన్ కాఫీ' కూడా ఉంది. దీని ధర 4,761 దిర్హామ్‌లు (రూ.1,09 లక్షలు). దీన్ని కూడా వెండి కప్పుల్లో ఇస్తారు. ఆ కప్పులను కూడా ఇంటికి తీసుకెళ్లవచ్చు. ఇవి కాకుండా బంగారం ఐస్‌క్రీమ్‌లు, డ్రింకులు కూడా లభిస్తాయి. 'విలాసాలు కోరుకునే వారికి ఏదైనా అసాధారణమైనది చేయాలనుకున్నాం. అందుకే వీటిని అందిస్తున్నాం' అని సుచేత శర్మ చెప్పారు. వీటితో పాటుగా అందరికీ అందుబాటులో ఉండే భారతీయ స్ట్రీట్ ఫుడ్ కూడా తమ హోటల్‌లో దొరుకుతుందని తెలిపారు.

రోజుకు 16 గంటల ఉపవాసంతో..
నత్తనడకన జుత్తు పెరుగుదల!

ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌పై తాజా అధ్యయనాల్లో వెల్లడి



న్యూఢిల్లీ, డిసెంబరు 15: ఇటీవలికాలంలో చాలా మంది బరువు తగ్గడానికి అనుసరిస్తున్న విధానం.. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అంటే రోజుకు కేవలం 8 గంటలపాటు (సాధారణంగా మధ్యాహ్నం నుంచి రాత్రి దాకా) మాత్రమే ఏదైనా తిని, మిగతా 16 గంటలూ ఏమీ తినకుండా ఉండడం! ఈ తరహా ఉపవాసంతో శరీరంలో జీవక్రియల వేగం పెరిగి, బరువు తగ్గే మాట నిజమేగానీ.. జుత్తు పెరుగుదల వేగం కూడా తగ్గిపోతుందని రెండు తాజా అధ్యయనాల్లో వెల్లడైంది. చైనాకు చెందిన వెస్ట్‌లేక్ యూనివర్సిటీ శాస్త్రజ్ఞులు.. ఎలుకలపైన, 49 మంది ఆరోగ్యవంతులైన యువతీయువకులపై వేర్వేరుగా ఈ అధ్యయనాలు నిర్వహించారు. మొదటి అధ్యయనంలో భాగంగా వారు కొన్ని ఎలుకలను తీసుకుని వాటి శరీరంపై ఉన్న రోమాలను పూర్తిగా తొలగించారు. వాటిని మూడు గ్రూపులుగా విడగొట్టి కొన్నిటికి రోజులో 24 గంటలూ ఆహారం దొరికే ఏర్పాటు చేశారు. కొన్ని ఎలుకలకు మాత్రం రోజుకు 8 గంటలపాటు మాత్రమే ఆహారం ఇచ్చారు. మూడో గ్రూపునకు రోజు విడిచి రోజు తిండి పెట్టారు. వీటిలో మొదటి గ్రూపు ఎలుకలకు 30 రోజులకల్లా జుత్తు తిరిగి రాగా.. రెండు, మూడు గ్రూపుల్లోని ఎలుకలకు జుత్తు పాక్షికంగా తిరిగి రావడానికి 96 రోజులు పట్టింది. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ విధానాన్ని అనుసరించడం వల్ల కలిగే ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను 2, 3 రకం గ్రూపుల్లోని ఎలుకల రోమకూప మూలకణాలు (హెయిర్ ఫాలికల్ స్టెమ్‌సెల్స్) తట్టుకోలేకపోవడమే ఇందుకు కారణమని వారు విశ్లేషించారు. అలాగే, 49 మంది ఆరోగ్యవంతులైన యువతీయువకులపై కూడా వారు ఇదే తరహా ప్రయోగం చేశారు. వారిలో కొందరికి రోజులో 6 గంటలపాటు మాత్రమే ఆహారం ఇచ్చారు. 18 గంటల ఉపవాసం చేయించారు. మామూలుగా ఆహారం తీసుకునేవారితో పోలిస్తే.. వీరిలో జుత్తు పెరుగుదల వేగం 18 శాతం మందగించినట్టు వారి అధ్యయనంలో వెల్లడైంది. దీన్ని నిర్ధారించుకోవడానికి ఎక్కువ మందితో ట్రయల్స్ నిర్వహించాల్సి ఉందని వారు పేర్కొన్నారు. అయితే.. ఎలుకలతో పోలిస్తే మనుషుల్లో జీవక్రియల వేగం కొద్దిగా తక్కువగా ఉంటుందని, జుత్తు పెరిగే విధానం కూడా భిన్నంగా ఉంటుందని ఈ అధ్యయనంలో పాలుపంచుకున్న బింగ్ ఝూంగ్ తెలిపారు.



జగిత్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, కొప్పుల ఈశ్వర్

ప్రభుత్వ జీవోను ధిక్కరించి..

- జగిత్యాలలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు కవిత భూమిపూజ.. కేసులు పెట్టినా భయపడబోమని స్పష్టం

జగిత్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ తెలంగాణ తల్లిని, తల్లిలోని బతుకమ్మను కాపాడుకుంటామని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడిని గ్రామగ్రామాన ఎండగడతామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ జీవోను ధిక్కరించి జగిత్యాల జిల్లా కేంద్రంలో 22 అడుగుల ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు కవిత ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాడు ఉద్యమంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టుకున్నామని, ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తెలంగాణ తల్లి విగ్రహాన్ని, ఆమె చేతిలో ఉండే బతుకమ్మ కూడా వద్దంటోందని విమర్శించారు. ఉద్యమ తెలంగాణ తల్లిని గ్రామగ్రామాన ప్రతిష్ఠించుకుంటామని, కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. తమలో ధైర్యాన్ని, స్ఫూర్తిని నింపిన ఉద్యమ తెలంగాణ తల్లినే ఆరాధిస్తామని చెప్పారు. ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగిత్యాలలో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్.. పార్టీని వీడి ద్రోహం చేశారని విమర్శించారు. 'బతుకమ్మ తల్లి మాదిరా.. కాంగ్రెస్ తల్లి మీదిరా' అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ పాల్గొన్నారు. కాగా, జగిత్యాల జిల్లా సారంగపూర్ కస్తూర్బా పాఠశాలను కవిత సందర్శించారు. ఇటీవల పాఠశాల విద్యార్థులు ఆరుగురు చలి తీవ్రతతో అస్వస్థతకు గురై, ఆస్పత్రిలో చికిత్స అనంతరం కోలుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యం లో కవిత పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కనీస సౌకర్యాలు, బోధన తదితర అంశాలపై ఆరా తీశారు.

'తెలుగు' రాజకీయాలను శాసించేది కాపులే!

- పార్టీలు వేరైనా కాపులంతా కలిసికట్టుగా ఉండాలి
- ఏపీ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల రాజకీయాలను శాసించే శక్తి ఒక్క మున్నూరు కాపులకే ఉందని ఆంధ్రప్రదేశ్ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అమినాపురంలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఎంకే కన్వెన్షన్‌ను సంఘం అధ్యక్షుడు చందా గోపితో కలిసి గంటా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని కాపుల్లో రకరకాల పేర్లతో విభజించి ఐక్యతను దెబ్బతీయాలని చూస్తున్నారని, అన్ని రకాల కాపులు ఒక్కటేనని పేర్కొన్నారు. పార్టీలు వేరైనా మున్నూరుకాపులంతా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఇక్కడి కన్వెన్షన్ హాల్ ఇరు రాష్ట్రాల కాపులకు ఆదర్శంగా ఉందని, ఈ హాలుకు రూ.5 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, మాజీ ఎంపీ వి.హన్మంతరావు, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, దాస్యం వినయభాస్కర్, నన్నపనేని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఫలమేది?

- ఉద్యోగ విరమణ చేసి 5 నెలలు దాటినా అంగన్‌వాడీలకు అందని సాయం
- ఇప్పటికైనా హామీ నెరవేర్చాలని సర్కార్‌కు అంగన్‌వాడీల విజ్ఞప్తి

ఆసిఫాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లు, ఆయాలు ఉద్యోగ విరమణ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. 65 ఏళ్లు నిండిన వారిని తొలగించిన ప్రభుత్వం.. టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇస్తామన్న హామీ నెరవేర్చకపోవడంపై ఆవేదనకు గురవుతున్నారు. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిచడంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలదే ముఖ్య పాత్ర. గతంలో వీరికి ఉద్యోగ విరమణ గడువు ఉండేది కాదు. ఆరోగ్యం సహకరించే వరకు పని చేసే వారు. కానీ, ఈ ఏడాది జూలైలో 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీలను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా ఉద్యోగ విరమణ చేసిన టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇస్తామని మొదట్లో ప్రకటించింది. దీనిపై అంగన్‌వాడీ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అరకొర వేతనాలతో మూడు, నాలుగు దశాబ్దాలు పని చేశామని, ఇప్పుడు ఈ కొద్దిపాటి డబ్బుతో ఎలా బతకాలని ప్రశ్నించారు. దీంతో ఉద్యోగ విరమణ చేసిన టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున ఇస్తామని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క స్వయంగా ప్రకటించారు. దీంతోపాటు వృద్ధులకు ఇచ్చే ఆసరా పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ.. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఆ హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. ఒక్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే 640 మంది పదవీ విరమణ చేశారు.



ఆసిఫాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రం

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి



వయస్సు దాటిందని నన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. 40 ఏళ్లకు పైగా ఉద్యోగం చేసిన మమ్మల్ని ఉత్త చేతులతో పంపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

-లలితదేవి, ఆసిఫాబాద్

సర్కారీ కార్పొరేట్ ఆస్పత్రి!

పీహెచ్‌సీ నుంచి బోధనాస్పత్రుల దాకా అన్ని ఆస్పత్రుల్లో హంగులు

- రోగులను త్వరగా చేర్చుకొని.. చికిత్స చేసేలా చర్యలు
- ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆస్పత్రులన్నీ ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి
- ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు బ్రాండింగ్... ఒకేలా రంగులు

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)ల నుంచి బోధనాస్పత్రుల దాకా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని సర్కారు భావిస్తోంది. ఆస్పత్రులకు వచ్చే రోగుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వారిని రిసీవ్ చేసుకునే ప్రక్రియ నుంచి వైద్య చికిత్స పూర్తిచేసుకొని ఇంటికి పంపేదాకా అన్ని దశల్లోనూ మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని యోచిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వాస్పత్రులను పూర్తిగా ప్రక్షాళన చేయాలని భావిస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వసతుల కల్పనపై అధ్యయనం కోసం కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం ఓ కమిటీ వేసింది. ఈ కమిటీ... ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పరిస్థితులు, అక్కడ రోగులకు అందుతున్న సేవలు, వైద్య సిబ్బంది తీరుపై అధ్యయనం చేసింది. ఆ మేరకు నిమ్స్ ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులను పరిశీలించి.. ప్రైవేటు ఆస్పత్రుల్లో పరిస్థితులు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితులను వివరిస్తూ సర్కారుకు ఓ నివేదిక అందజేసింది. దీని ఆధారంగా సర్కారు ఆస్పత్రికి వచ్చిన రోగికి వైద్య పరీక్షలు, చికిత్సపై భరోసా కల్పించేలా వ్యవస్థను ప్రక్షాళన చేయాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆస్పత్రికి వచ్చే రోగులకు సమయం వృథా కాకుండా తక్షణమే వైద్య సేవలు అందేలా రిసెప్షన్ కౌంటర్లు, వైద్యుల గదులు, ల్యాబ్‌లు, క్యాంటీన్లు, అత్యవసర ద్వారాలను తేలిగ్గా గుర్తించేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలనుకుంటోంది. ఆస్పత్రికి వచ్చిన రోగుల్లో ఇన్‌పేషెంట్లుగా చేర్చుకునే వారు తక్షణమే అడ్మిట్ అయి, వెంటనే వైద్య చికిత్స అందేలా చర్యలు చేపట్టనుంది. ఇందుకు ప్రభుత్వ ఆస్పత్రులన్నింటినీ ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. సర్కారు దవాఖానాల్లో మౌలిక సదుపాయాలనూ మెరుగుపర్చాలని సర్కారు నిర్ణయించింది. కుర్చీలు మొదలు ఔషధాల వరకు అన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనుంది. అనారోగ్య సమస్యలొచ్చినప్పుడు నిరుపేద రోగులు తొలుత ఆశ్రయించేది సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల (సబ్ సెంటర్లు-ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)నే! ఈ సబ్ సెంటర్లను ప్రజలు తేలిగ్గా గుర్తించేలా వీటికి బ్రాండింగ్ చేయాలని సర్కారు నిర్ణయించింది. అంటే.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సబ్ సెంటర్లను ప్రభుత్వం ఒకే తరహాలో ఉండేలా తీర్చిదిద్దనున్నదన్నమాట! 'ఇది సర్కారు దవాఖానా' అని ప్రజలు గుర్తించేలా సబ్ సెంటర్లకు ఒకే తరహా రంగులు వేసి బ్రాండింగ్ చేయనున్నారు.

సిబ్బందిపై ఫిర్యాదుకు బాక్స్‌లు

కిందిస్థాయి ఉద్యోగుల తీరు వల్లే ప్రభుత్వాస్పత్రులపై చెడ్డపేరు వస్తోందనే అభిప్రాయం సర్కారులో ఉంది. వారి ప్రవర్తన సరిగా ఉండటం లేదనే ఫిర్యాదులు వచ్చాయి. రోగులను చీదరించుకోవడం, నిర్లక్ష్యంగా సమాధానమివ్వడం, అరవడంలాంటివి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కిందిస్థాయి ఉద్యోగుల ప్రవర్తనా తీరులో కూడా మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యశాఖ భావిస్తోంది. వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని యోచిస్తోంది. అలాగే బాధితులు నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు సదరు ఆస్పత్రిలో ఫిర్యాదు పెట్టెలతో పాటు టోల్ ఫ్రీ నంబరును కూడా అందుబాటులో ఉంచనుంది.

దుబారా వద్దు!

- అత్యవసరమైతేనే ఖర్చు పెట్టండి
- హెచ్‌వోడీలు, కలెక్టర్లకు సీఎస్ ఉత్తర్వులు

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలను ఆదేశించింది. రాబడుల్లో లీకేజీలను నియంత్రిస్తున్న సర్కారు.. తాజాగా కార్యాలయాల నిర్వహణ వ్యయాలపై దృష్టి సారించింది. అనవసర ఖర్చులు తగ్గించుకోవాలంటూ రాష్ట్రంలోని వివిధ శాఖల విభాగాధిపతుల(హెచ్‌వోడీ) కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ రాబడులైన వస్తు సేవల పన్ను(జీఎస్టీ), అమ్మకం పన్ను, ఎక్సైజ్ సుంకాలు, వాహనాల పన్నులు, రిజిస్ట్రేషన్ల ఫీజులు, గనులు, భూగర్భ ఖనిజాల సీనరేజీ చార్జీల్లో ఎలాంటి లీకేజీలు ఉండకూడదని ఇప్పటికే ప్రభుత్వం సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించింది. లీకేజీలకు కారకులైన అధికారులపై చర్యలు తీసుకుంటోంది. అలాగే. ఇప్పుడు కార్యాలయాల నిర్వహణ ఖర్చులపై దృష్టి సారించింది. సాధారణంగా హెచ్‌వోడీలు, కలెక్టరేట్లు, ఇతర రాష్ట్ర స్థాయి కార్యాలయాలు, వివిధ శాఖల జిల్లా అధికారుల కార్యాలయాల్లో అత్యవసర ఖర్చుల కోసం కొంత సొమ్మును ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కార్యాలయాల్లో ఏసీలు, ఫ్యాన్లు, ఫర్నిచర్, ఇతర సదుపాయాల కల్పనకు డబ్బు ఖర్చు చేస్తుంటారు. కొంతమంది హెచ్‌వోడీలు తమ చాంబర్ల ఆధునికీకరణ పేరిట దుబారా వ్యయం చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇలాంటి వ్యయాలపై నియంత్రణ పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎక్కువ మొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తే.. తప్పకుండా తమ శాఖల ముఖ్యకార్యదర్శులు, హెచ్‌వోడీల అనుమతి తీసుకోవాలని సూచించింది.

అధ్యక్ష రేసులో లేను

- నాకు బాధ్యతలు అప్పగిస్తారనేది ఊహాగానాలే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై బండి సంజయ్



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీ తెలంగాణ అధ్యక్ష పదవి రేసులో తాను లేనని ఆ పార్టీ నేత, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. పార్టీ నాయకత్వం తనకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవి రూపంలో పెద్ద బాధ్యత అప్పగించిందని, దానిని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. ఈ మేరకు కరీంనగర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బండి సంజయ్‌కు పార్టీ పగ్గాలు అప్పగిస్తారనే మాటలు ఊహాగానాలేనని తేల్చి చెప్పారు. పార్టీ అధినాయకత్వం రాష్ట్ర అధ్యక్ష పదవిపై అసలు దృష్టి సారించనేలేదన్నారు. పార్టీలో ప్రస్తుతం సంస్థాగత ఎన్నికలు జరుగుతున్నాయని, జిల్లా, రాష్ట్ర అధ్యక్ష నియామకాల అంశమే చర్చకు రాలేదని వివరించారు. పార్టీ అధ్యక్ష పదవి నియామకంపై హైకమాండ్‌దే తుది నిర్ణయమని వెల్లడించారు. తనపై అభిమానంతో కొందరు ప్రచారం చేస్తున్నారే తప్ప రాష్ట్ర అధ్యక్ష రేసులో తాను లేనని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రచారాలతో కొందరు తనకు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తనకు, పార్టీకీ నష్టం కలిగించే తప్పుడు వార్తలను ప్రచారం చేయవద్దని మీడియాను కోరారు.

కొత్త దళపతి.. సంక్రాంతికే!

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకం అప్పుడే.. రాష్ట్ర నేతల్లో ఉత్కంఠ

- మరోసారి నేతల నుంచి అభిప్రాయ సేకరణ పూర్తి
- బీసీ నేత, ఎంపీగా ఉన్న వ్యక్తికే అవకాశం!



హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఎవరన్న దానిపై పార్టీ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు త్వరలోనే తెరపడనుంది. పార్టీ జాతీయ నాయకత్వం.. సంక్రాంతి కల్లా రాష్ట్రానికి అధ్యక్షుడిని నియమించనున్నట్లు తెలుస్తోంది. అయితే అంతర్గత చర్చల్లో రోజుకో సీనియర్ నేత పేరు తెరపైకి వస్తున్నా.. ఎంపీగా ఉన్న బీసీ నేతకు ఎక్కువ అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ సమీకరణాలు మారితే మాత్రం అనూహ్యంగా కొత్త నేతకూ అవకాశం దక్కవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి. కానీ, తెలంగాణలో ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ జాతీయ నాయకత్వం మదిలో ఏముందో రాష్ట్రంలోని కీలక నేతలకు సైతం అంతు చిక్కడంలేదు. అధికార పీఠమే అంతిమ లక్ష్యమని, ఇందుకోసం అనుసరించే వ్యూహంలో వేసే ఎత్తుగడలు మాత్రం అనూహ్యంగా ఉండబోతున్నాయని బీజేపీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. "పార్టీలో కొంతమంది సీనియర్ నేతల మధ్య అంతర్గత విభేదాలున్న మాట వాస్తవం. రాష్ట్ర పార్టీ వ్యవహారాలు నాలుగు స్తంభాలాటగా మారాయన్న విషయం అధినాయకత్వం దృష్టికి కూడా వెళ్లింది. మేం అధికారంలోకి రావాలంటే ముందు పార్టీలో సమన్వయం అవసరం. పార్టీ కొత్త అధ్యక్షుడికి ఈ సమర్థత కీలకం. ఇదే అంశాన్ని మా అధినాయకత్వానికి నివేదించాం" అని కీలక నేత ఒకరు వెల్లడించారు. ఈ నేపథ్యంలో అన్ని సవాళ్లను ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగే నేతకే పట్టం కట్టబోతోందని చెప్పారు. కాగా, పోరాట పటిమ, సమన్వయం చేసుకునే సమర్థతతోపాటు వయసును కూడా ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఎక్కువగా ఉందని మరో ముఖ్యనేత పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు పలువురు సీనియర్ నేతల నుంచి అభిప్రాయాలు తీసుకున్న పార్టీ అధిష్ఠానం.. తాజాగా మరోసారి కొంతమంది ముఖ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకుందని పార్టీవర్గాలు వెల్లడించాయి.

ఓసీ నేతకూ చాన్స్!

బీసీ సీనియర్ నేతలకు కీలక పదవులు కట్టబెడుతున్న జాతీయ నాయకత్వం.. రాష్ట్ర అధ్యక్ష పదవిని ఓసీలకు కట్టబెట్టే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ, బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎంపీ.. బీసీ..అనే సంకేతాలు అధినాయకత్వం నుంచి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే వాస్తవమైతే.. ఈ కోటాలో ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ పేర్లు ప్రధానంగా చర్చకు రానున్నాయి. కాగా, తాను కూడా రేసులో ఉన్నట్లు అర్వింద్ రెండు రోజుల కిందట పరోక్షంగా సంకేతాలిచ్చారు. ఒకవేళ ఓసీలకు పట్టం గట్టాల్సివస్తే.. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, లేదా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్లు తెరపైకి రావచ్చని తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావుకు సారథ్య బాధ్యతలు కట్టబెట్టే అవకాశాలూ లేకపోలేదని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, అధ్యక్ష నియామకం జాప్యమయ్యే అవకాశ ముందని, సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఆలస్యమవుతుండడమే ఇందుకు కారణమని చెబుతున్నాయి. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం.. పోలింగ్ బూత్ నుంచి మండల, జిల్లా కమిటీల ఎన్నికలు ఈ నెల 25లోగా పూర్తికావాల్సి ఉంది. కానీ, సభ్యత్వ నమోదు ప్రక్రియే ఇంకా కొలిక్కి రాకపోవడంతో బూత్ కమిటీల ఎన్నికల్లో జాప్యం జరుగుతోంది. అవి పూర్తయితేనే మండల, జిల్లా కమిటీల ఎన్నికలు జరుగుతాయి.. రాష్ట్రవ్యాప్తంగా 50శాతం జిల్లాల కమిటీలు ఏర్పాటయితేనే రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక ఉంటుంది. అంటే, వచ్చేనెల రెండోవారంలోగా ఇది పూర్తికావొచ్చునని పార్టీ సీనియర్ నేత ఒకరు వివరించారు.

సింగరేణికి ఎనర్షియా ఫౌండేషన్ అవార్డు

- పర్యావరణహిత మైనింగ్, సోలార్ వినియోగంలో గుర్తింపు
- 20న విశాఖపట్నంలో ప్రదానం చేయనున్న నిర్వాహకులు

కొత్తగూడెం, జైపూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పర్యావరణహిత సుస్థిర మైనింగ్‌తో పాటు సంప్రదాయేతర విద్యుత్‌రంగంలో విశేషమైన సేవలు అందిస్తున్నందుకుగాను సింగరేణికి జాతీయస్థాయిలో మరోప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది. ఈ ఏడాది "ఇండియన్ బెస్ట్ అండ్ మోస్ట్ సస్టెయినబుల్ కోల్‌మైనింగ్ ఆపరేటర్ విత్ రెన్యూవబుల్ ఎనర్జీ అడాప్షన్" క్యాటగిరీలో సింగరేణిని 'ఎనర్షియా ఫౌండేషన్' అత్యుత్తమ సంస్థగా ఎంపిక చేసింది. ఈ నెల 20న విశాఖపట్నంలో ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ఒడిశాలో నైనీ బొగ్గుగనికి అనుబంధంగా పర్యావరణహితంగా 1600 మెగావాట్ల అత్యాధునిక సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్‌ను చేపట్టే ప్రతిపాదన, రామగుండంలో 500 మెగావాట్ల పంప్‌స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధం కావడం, భారీ జలాశయాల్లో ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండటం, కార్బన్ డైయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ తదితర చర్యలతో సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు అవార్డు కమిటీ జ్యూరీ కన్వీనర్ ఆర్. త్యాగరాజన్ అయ్యర్ తెలిపారు. సింగరేణి సంస్థ 6 కోట్లకు పైగా మొక్కలు నాటడమే కాక వాటిని వనాలుగా పెంచుతోందన్నారు.

సింగరేణి పర్యావరణహిత చర్యలకు గుర్తింపు

సింగరేణి సంస్థకు ప్రతిష్ఠాత్మక అవార్డు రావడం సంతోషకరమని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం తెలిపారు. కరీంనగర్ జిల్లా శ్రీరాంపూర్‌లోని థర్మల్ విద్యుత్‌కేంద్రంలో, మంచిర్యాల జిల్లా జైపూర్ ఎన్‌టీపీపీలో ఆయన మొక్కలు నాటారు. బలరాం ఇప్పటి వరకు ఆరు జిల్లాల్లోని 40 ప్రదేశాల్లో 18,500 మొక్కలు నాటి ప్రకృతి ప్రేమికుడిగా చరిత్ర సృష్టించారు.

వీసా లేకుండానే ఇక రష్యాకు

- త్వరలోనే అమల్లోకి నూతన విధానం

న్యూఢిల్లీ, డిసెంబరు 15: భారతీయులు ఇక వీసా అవసరం లేకుండానే రష్యాలో పర్యటించవచ్చు. రానున్న వసంత రుతువు నుంచే ఈ నూతన విధానం అమల్లోకి రానుంది. రష్యాలో పర్యటిస్తున్న భారతీయుల సంఖ్య పెరుగుతుండడంతో అక్కడి ప్రభుత్వం 'వీసా ఫ్రీ' సౌకర్యాన్ని కలిగించనుంది. బృందాలుగా వచ్చే భారతీయుల విషయంలో వీసా నిబంధనలను సడలించాలని జూన్ నెలలో భారత్-రష్యాలు ఒక అంగీకారానికి వచ్చాయి. రష్యాలో పర్యటించాలంటే ఏ పని మీద వచ్చారన్నదాన్ని గమనించి వీసా మంజూరు చేస్తారు. టూరిస్టు, బిజినెస్, మానవీయ కారణాలు, ప్రయివేటు, ఉద్యోగం, విద్యార్థి... ఇలా పలు రకాల వీసాలు ఉంటాయి. ఇది మంజూరుకు చాలా సమయం పడుతుంది. అయితే గత ఏడాది ఆగస్టు నుంచి భారతీయ పర్యాటకులకు ఏకీకృత ఈ-వీసా (యూనిఫైడ్ ఈ-వీసా..యూఈవీ)ని అమలు చేస్తున్నారు. వచ్చే పని ఏదన్నదానితో సంబంధం లేకుండా యూఈవీ ఉంటే అన్నింటికీ చెల్లుబాటు అయ్యేలా నిబంధనలు సరళీకరించారు. ఈ సౌకర్యాన్ని 55 దేశాలకు వర్తింపజేసింది. ఆ జాబితాలో ప్రస్తుతం భారత్ కూడా చేరింది. చైనా, ఇరాన్ దేశాల పౌరులకు వీసా-ఫ్రీ విధానాన్ని అమలు చేస్తుండగా ఇకపై భారత్‌కు కూడా అదే సౌకర్యం కలగనుంది. యూఈవీల కోసం రష్యా రాయబార, కాన్సులేట్ కార్యాలయాలకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. వ్యక్తిగత వివరాలు రిజిస్ట్రేషన్ సిస్టంతో ఉన్న సమాచారంతో సరిపోయినప్పుడే మాత్రమే వీసాలు మంజూరు చేస్తుంది. దీన్ని మంజూరు చేసేందుకు నాలుగు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. యూఈవీ ఉంటే రష్యాలో ఏ పనిమీదయినా పర్యటించడానికి వీలు కలుగుతుంది.

వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



వెన్నెల్లో ఒక అంతరంగ ప్రయాణం

గత రెండు దశాబ్దాలలో అత్యంత ప్రయోగాత్మకమైన కథలు రాసిన రచయితలలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన పేరు భగవంతం. అతను ఈ రెండు దశాబ్దాల కాలంలో లోతైన తాత్విక, అస్తిత్వ ప్రశ్నలను అన్వేషించే ప్రత్యేకమైన కథన రూపాన్ని సృష్టించుకున్నాడు. భావుకతకి, వాస్తవికతకి మధ్య విభజన రేఖలు చెరిపి, మానవ అనుభవానికి ఉండే అనేక పొరలను ఆవిష్కరించాడు. భగవంతం కథలు తరచుగా పాఠకులను వేరే ప్రపంచం లోకి తీసుకుపోతాయి. అక్కడ వాస్తవికతకు సంబంధించిన నియమాలకు విలువ లేదు. ఒక కొత్త మార్మిక వాస్తవికత పాఠకుల అనుభవంలోకి వస్తుంది. అతని కథలు తరచుగా స్పష్టమైన వ్యాఖ్యానానికి లొంగవు. పాఠకులను అస్పష్టతలో మిగుల్చుతాయి. కథలు క్లుప్తంగా ఉంటాయి, అయినప్పటికీ వాటిలో అనేక అర్థాల పొరలు నిండి ఉంటాయి.

భగవంతం పాత్రలు, ఎక్కువ సందర్భాలలో, విచిత్రమైన, అహేతుకమైన పరిస్థితులలో తమను తాము కనుగొంటాయి. ఈ పరిస్థితులు ఆధునిక ప్రపంచంలో జీవితం లోని దిక్కుతోచని, తరచుగా అర్థరహితమైన అంశాలను ప్రతిబింబిస్తాయి. సాహిత్యం, దృశ్య కళల మధ్య రేఖలను అస్పష్టం చేస్తూ తరచుగా తన రచనలో దృశ్యమాన అంశాలను చేర్చుతాడు. కొన్ని కథలు కొలాజ్ పెయింటింగ్స్‌లాగా ఉంటాయి. అతను మేధోపరంగా ఉత్తేజపరిచే, కళాత్మకంగా ఉల్లాసపరిచే, లోతుగా ప్రభావితం చేసే కథలను రాశాడు.

భగవంతం 'లోయ చివరి రహస్యం' కథా సంపుటిలో 'చంద్రుడు గీసిన బొమ్మలు' కథ జ్ఞాపకాలు, ఊహాశక్తి, వెన్నెల రాత్రుల సున్నితమైన ఆకర్షణను పెనవేసుకున్న అందమైన, ఉత్తేజకరమైన అనుభవాన్ని చిత్రిస్తుంది. భగవంతం కథలు తరచుగా కాల్పనికతకి, వాస్తవికతకు మధ్యన ఉండే సరిహద్దులు చెరిపేస్తాయి. కాల్పనిక సాహిత్య నిర్వచనాలనే సవాలు చేస్తాయి.

భగవంతం 'లోయ చివరి రహస్యం' కథా సంపుటిలో 'చంద్రుడు గీసిన బొమ్మలు' కథ జ్ఞాపకాలు, ఊహాశక్తి, వెన్నెల రాత్రుల సున్నితమైన ఆకర్షణను పెనవేసుకున్న అందమైన, ఉత్తేజకరమైన అనుభవాన్ని చిత్రిస్తుంది. పౌర్ణమి సృష్టించిన ప్రశాంతమైన, మార్మిక వాతావరణంలో లోతుగా లీనమైన కథకుడి ఆలోచనాత్మక ఏకాంతాన్ని ఇది అన్వేషిస్తుంది.

కథకుడు చాపపై పడుకుని, చంద్రుడిని చూస్తూ, తన చర్మంపై చల్లని గాలిని అనుభూతి చెందడంతో కథ మొదలవుతుంది. కథకుడి ఆలోచనలు జ్ఞాపకాల ద్వారా సాగిపోతున్నప్పుడు, ప్రశాంతమైన నేపథ్యం మిగిలిన కథకు టోన్ సెట్ చేస్తుంది. నెమ్మదిగా కదిలే, అందమైన అస్తిత్వంగా వర్ణించబడిన చంద్రుడు ఈ కథలో ప్రధాన పాత్రగా మారి, కథకుడి ఆలోచనలను, భావోద్వేగాలను ప్రభావితం చేస్తాడు.

కథకుడు బాల్యాన్ని గుర్తు చేసుకుంటుండగా, కథ విచిత్రమైన స్వరంతో సాగుతుంది. చంద్రకాంతిలో ఆట ఆడటం, పిల్లలు పేపర్‌పై ప్రశ్నలు రాసి ఆకుల కింద దాచి, వాటికి చంద్రుడు సమాధానం చెబుతాడనే ఆశతో ఎదురుచూడటం... ఆసక్తి, ఊహాశక్తితో నిండిన ఈ ఆట, కథకుడి వయస్సుకు సంబంధించిన దృక్పథానికి విరుద్ధంగా, కాలగమనాన్ని, అది తీసుకువచ్చే మార్పులను హైలైట్ చేస్తుంది.

ఈ కథ చంద్రుడిని గమనించిన మానవ అనుభవాన్ని స్పృశిస్తుంది. సోక్రటీస్, ప్లేటో, బుద్ధుడు, గాంధీ వంటి చారిత్రక వ్యక్తులను ప్రస్తావించి, వాళ్ళు ఒకే చంద్రుడిని చూస్తున్నప్పుడు వారి ఆలోచనలను ఊహిస్తాడు కథకుడు. ఈ ప్రతిఫలనం కొన్ని అనుభవాల, భావోద్వేగాల కాలాతీత స్వభావాన్ని నొక్కి చెబుతూ, వ్యక్తిగతాన్ని విశ్వజనీనానికి అనుసంధానిస్తుంది.



'చంద్రుడు గీసిన బొమ్మలు' అద్భుత నైపుణ్యంతో రూపొందించబడిన కథ. ఇది వెన్నెల రాత్రుల దివ్య సౌందర్యం, అది ప్రేరేపించే అంతర్మథనం, ఆంతరంగిక ప్రయాణాలను చిత్రిస్తుంది. బాల్యంలోని అమాయకత్వాన్ని, నిరాడంబరతను హైలైట్ చేస్తూ వర్తమానాన్ని గతంతో కనెక్ట్ చేసే అంశం ఈ కథకు కీలకం. నిరంతరం మారుతూ ఉన్న ప్రపంచంలో నిరంతరత్వానికి ప్రతీకగా చంద్రుడు కనిపిస్తాడు. చంద్రునితో కథకుడి గాఢమైన బంధం కూడా ప్రాకృత ప్రపంచంలో ఉపశమనం, ఓదార్పు, ప్రేరణను కోరుకునే మానవ స్వభావానికి ప్రతీక.

పైన చెప్పుకున్నట్టుగా సోక్రటీస్, ప్లేటో, బుద్ధుడు, గాంధీ వంటి చారిత్రక వ్యక్తులను ప్రస్తావించడం ద్వారా, ఈ కథ వ్యక్తిగత అనుభవాలను విశ్వజనీన స్థాయికి తీసుకువెళుతుంది. కొన్ని భావాలు, ఆలోచనలు కాలానికి, సంస్కృతికి అతీతం అనే భావనను ఇది నొక్కి చెబుతుంది. వెన్నెల రాత్రి, చల్లని గాలి, ఆకుల చేసే ధ్వని గురించి చేసిన వర్ణనలు ఉన్నతమైన అనుభవ వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఈ వాతావరణం పాఠకుడిని కథకుడి ప్రపంచంలో లీనం చేస్తుంది. కథకి భావోద్వేగాన్ని పెంచగలిగే శక్తినిస్తుంది.

కథలో కవి గాలి నాసరరెడ్డితో కథకుడు జరిపే సంభాషణలు కథకు లోతును జోడిస్తాయి. హైకూల గురించి, చంద్రుడిపై కవితల గురించి వాళ్ళ సంభాషణ పరస్పర సృజనాత్మక స్ఫూర్తిని, కళాత్మక ప్రేరణను తెలియజేస్తుంది. లోతైన ఆలోచనలు, అనుభూతులు సహజంగా, ప్రాకృతిక ప్రపంచ సౌందర్యంతో ప్రభావితమవుతాయనే భావనను ఇవి నొక్కి చెబుతాయి.

గతం, వర్తమానం, జ్ఞాపకాలు వాస్తవికతను నిరాటంకంగా అంటిపెట్టుకునే విధంగా కథను తీర్చిదిద్దాడు భగవంతం. కథ ఒక ప్రశాంత దృశ్యాన్ని వర్ణించటంతో మొదలై క్రమంగా నాస్టాల్జిక్ జ్ఞాపకంగా మారుతుంది. ఈ కథా నిర్మాణం కథకుడి ఆలోచనల ద్రవత్వానికి (fluidity) అద్దం పడుతుంది. వివిధ కాలాలు, అనుభవాల మధ్య కదులుతూ ఒక ఉత్తేజకరమైన కథనాన్ని సృష్టిస్తుంది. సారాంశంలో 'చంద్రుడు గీసిన బొమ్మలు' ఒక బహుళ పొరలు ఉన్న కథ (layered story). దాని భావోద్వేగ, తాత్విక లోతు, దాని వ్యక్తీకరణ దానిని ఆకర్షణీయమైన, ఆలోచింపజేసే కథగా చేస్తుంది.

భగవంతం కథలు తరచుగా కాల్పనికతకి, వాస్తవికతకు మధ్యన ఉండే సరిహద్దులు చెరిపేస్తాయి. కాల్పనిక సాహిత్య నిర్వచనాలనే సవాలు చేస్తాయి. సమకాలీన పాశ్చాత్య ఆధునికానంతరవాద కథకుల కథన పద్ధతికి దగ్గరగా ఉంటాయి. శకలాలుగా ఉండే, open-endedగా ఉండే, సమకాలీన సంక్షోభాన్ని ప్రతిఫలించే, బహుముఖీన మానవ స్వభావాన్ని ప్రతిఫలించే కథలను భగవంతం రాశాడు. తనకి కల్పన కేవలం వాస్తవికతను ప్రతిబింబించకూడదు, దాని నిర్మాణ స్వభావాన్ని బహిర్గతం చేసే విధంగా ఉండాలి. ఇంకొక రకంగా చెప్పాలంటే, కథ అనేది పూర్తయిన ఉత్పాదనగా కాకుండా, ఒక process గా ఉండాలి.

భగవంతం ప్లాట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన సాంప్రదాయిక విధానం నుంచి దూరంగా జరిగి తన కథనాన్ని స్పాంటేనియస్‌గా ఉండేటట్లు చూసుకుంటున్నాడు. నిర్మాణాత్మక కథాంశాన్ని అనుసరించే బదులు, అతని కథనం సహజంగా పరిణామం చెందుతుంది, అనూహ్యంగా ఉండే అతని కథన పద్ధతి పాఠకులకి గొప్ప అనుభవాన్ని ఇస్తుంది.

కథ అనేది రచయిత చైతన్యపు (consciousness) విస్తరణ అనే విధంగా భగవంతం కథలు ఉంటాయి. అతని కథల్లో రచయిత, కథకుడు మధ్య సరిహద్దు తరచుగా అస్పష్టంగా ఉంటుంది. కొన్ని చోట్ల రచయిత కథనం లోకి తనను తాను పాత్రగా చొప్పించుకున్నట్టుగా ఉంటుంది. కొన్నిచోట్ల రచయిత తన వైయక్తిక అనుభవాలను, ఆలోచనలను కథలోకి చొప్పించినట్లు అనిపిస్తుంది. తద్వారా, రచయిత కాల్పనిక సాహిత్యంలో వస్తుగతత్వం ఉంటుంది తప్ప, వైయక్తికాంశాలు కాదనే భావనను సవాలు చేస్తున్నట్టుగా అనిపిస్తుంది.

కథ లేక వాచకం యొక్క అర్థ నిర్మాణంలో పాఠకుడికి పాత్ర కల్పిస్తాడు భగవంతం. ఈ సందర్భంలో ప్రముఖ ఇటాలియన్ రచయిత ఉంబెర్తో ఎకో (Uberto Eco) మాటలు గమనించాలి: "A text is a machine for producing interpretations. The role of the reader is to decode and interpret the signs, to actively participate in the construction of meaning."

ఈ పద్ధతి పాఠకుడిని లోతైన స్థాయిలో కథనంలో నిమగ్నం చేయటం ద్వారా, కథ చెప్పే ప్రక్రియలో అంతర్భాగంగా చేస్తుంది.

వ్యక్తిగా భగవంతం ఆధునిక ప్రపంచ సంక్లిష్టతలను, అనిశ్చితులను లోతుగా గమనించాడు. అందువల్లనే వాటికి బలమైన కథారూపం ఇవ్వగలిగాడు. మారుతున్న సాంస్కృతిక సన్నివేశాలకు అతని కథలు ఒక దర్పణం. "The job of fiction is to find the truth inside the story's web of lies" అంటాడు స్టీఫెన్ కింగ్ తన రచన 'On Writing: A Memor of the Craft'లో. అంటే, కథ కనిపెట్టబడినది లేదా అబద్ధం అయినప్పటికీ, అది మానవ అనుభవం గురించి, వాస్తవికత గురించి లోతైన సత్యాలను తెలియజేస్తుంది. ఈపై లక్షణాలన్నీ భగవంతం కథల విశిష్టతని తెలియజేస్తాయి.

■ బి. తిరుపతిరావు

అక్షరాల రెప్పల మాటున..

అక్షరాల పోగుల్ని అలా
చెంగులోకెత్తుకుంటానా..
నా చేతుల నిండా వాగులు కట్టిన తూరుపులు
నా చుట్టూ సంకెళ్లెరుగని
బంగరుపొద్దులతీవెలు

పుస్తకాన్నలా తడిమి తడిమి తిరగేస్తుంటానా...
మనవనుకున్న మనసులు చేతులు చాచి
ఎదురొచ్చే లోకాల చిరునామా ఏదో
చెప్పిపోయినంత సంబరం

పేజీలోంచి పేజీలోకి తలుపులు
చాచుకుంటూ పోతుంటానా...
పచ్చనిగాలిని ప్రసవించే పైరు అంచులమీద
ఆంధ్రనాట్యంలా హొయలు పోతుంటాయ్ నా అడుగులు

గుండెమీద జోకొట్టుకున్న పసిపిల్లాడిలా
పుస్తకాన్నలా పరచుకుని
ఒకపరి రెప్పల్ని ముడేసుకుంటానా
తోరణాలు కట్టిన తారకల వెనుక
మిసమిసలన్నిటినీ
తలకెత్తుకున్న కొత్త వాక్యాల పుట్టనే ఇక నేను

+++

మనసుపడ్డ పదాలపొత్తిని మరోపరి
కావిలించుకున్న వేళల్లో
చూపులకింద అరిగిపోయిన
ఆ మొదటి మోహలేఖను
వదిలిపోయిన గుండెకొమ్మ మీద జీవజలంగా
ఇంకోపరి పొంగులెత్తించుకున్నట్టే

కొత్త రేలపూలవనం చేతిలో వాలిన ప్రతిసారీ
పసిబిడ్డను ఈ చంక నుంచి ఆ చంకకు
ఆ చంక నుంచి ఈ చంకకు మార్చుకునే అమ్మనే,
ఆమె చీర కుచ్చిళ్ళలో దాక్కుని దాక్కుని
ముగ్గులై పొగిలిపోయే నిండునవ్వునే

+++

ఎక్కడెక్కడినుంచో వలసపక్షులై వచ్చి వాలిన
ఎన్నెన్నో ప్రపంచాలు నాలుగు గోడల ద్వీపకల్పంలో
ఎంత ఒద్దికగా సర్దుకు కూర్చున్నాయో..
యుగాల కల్పాల నుంచి ఇప్పటిదాకా పండిన
కాలాలకు, జీవితాలకు నన్నే వారసుణ్ణి చేసేశాయవి

పచ్చని పొలాల్లో పూలగుట్టల్లా
చుట్టూ పోగులుపడ్డ దీపపురాశుల మధ్య
కాలుమీద కాలేసుకుని నేలమీదలా పడుకుని
నిర్వాణినై అనంతపుటంచుల్ని నిమురుతున్న
నన్ను మించిన పైడిదొరను పట్టితేగలరా ఎవరైనా

+++

ఒక పుస్తకం
నాలోకి నదిలా చొరబడితే చాలు–
ఊపిరితిత్తుల నిండుగా అడవిగాలి మత్తులో నేను,
తామరపూల రేకుల్లాంటి పసికందు అరికాళ్ళతో
నా కళ్లను దీవించుకుంటూ జాజిపూలలోకాల్లో నేను

ఎక్కడెక్కడి మనుషుల్ని, మట్టిపెళ్ళల్ని పెరుక్కొచ్చి
అది నన్నో నవ్యవ్యాకరణం చేసేస్తుంటే
అసలేమాత్రం మైలపడిపోకుండా నేను!

■ యార్లగడ్డ రాఘవేంద్రరావు

✆ 99854 11099



"వంద సందర్భాల నుంచి ఒక పాత్రను తీసుకుంటాను"

\- మహి బెజవాడ



కవిత్వం రాయకుండా కవులమని చెప్పుకునే వాళ్ళ మధ్య కవిత్వం రాసి కథలని నమ్మిస్తున్న రచయిత మహి బెజవాడ. అన్వీక్షికి పబ్లికేషన్ ద్వారా వెంకట్ శిద్దారెడ్డితో కలిసి అనేక పుస్తకాలు ప్రచురించినా, తన తొలి పుస్తకం 'గన్స్ & మాన్సూన్స్' కథా సంపుటిని మాత్రం నిమ్మళంగా తీసుకొస్తున్న ఈ రచయితతో ఈ సందర్భంగా సంభాషణ.

మీరు పబ్లిషర్ అయి ఉండి, ఎన్నో ఏళ్ళుగా కథలు రాసినా కూడా కథల పుస్తకం తీసుకురావటానికి ఇన్నాళ్ళు వెయిట్ చేయటానికి కారణం?

వెయిట్ చేయడం అన్నదేం లేదు. కథ రాయడమనేది అనిపిస్తే జరగాల్సిన ప్రక్రియ తప్పితే, ప్లాన్ చేసుకొని రేపొక కథ రాయాలీ ఎల్లుండి ఒక కథ రాయాలీ అని నాకు అనిపించదు. ఆ కథ నన్ను వెంటాడి, బలంగా చెప్పాలీ అనిపించినపుడు రాస్తాను. కథ ఎక్కువగా మగ్గాలి. ఆ కథలో చెప్పదల్చుకున్న దానికి తగ్గ కేరెక్టర్ దొరకాలి.

ఆ కేరెక్టర్ ఎక్కడ దొరుకుతుంది? పాత్రల్ని మీరు ఎక్కణ్ణుంచి తీసుకుంటారు?

కచ్చితంగా జీవితం నుంచే! నా కథల్లో పాత్రలేవీ నేను సృష్టించిన పాత్రలు కాదు, నా జీవితంలో ఉన్న పాత్రలే. వంద సందర్భాల నుంచి ఒక పాత్రను తీసుకుంటాను. వంద రకాల మనుషుల్ని స్టడీ చేసినప్పుడు వాళ్ళల్లో ఉండే ఒక్కొక్క క్వాలిటీ తీసుకొని కథలో పెట్టుకుంటాను. అప్పుడది నా పాత్ర అవుతుంది.

అంటే మీ కథల్లో పాత్రలన్నిటికీ ఆధారంగా నిజంగా మీకు తెలిసిన వ్యక్తులు ఉన్నారా?

వ్యక్తిగా ఒకరంటూ ఉండకపోవచ్చు. వేర్వేరు మనుషుల్లో వేర్వేరు క్వాలిటీలు తీసుకుని ఒక వ్యక్తిగా తయారు చేసుకుంటాను. ఖచ్చితంగా ఇవన్నీ జీవితం లోని సందర్భాల నుంచి తయారైన పాత్రలే కానీ, ఒక పాత్రకి ఒకరు ఆధారం అని చెప్పటానికి ఎవరూ ఉండరు.

మీ కథల్లో ఎక్కువమంది ఆర్టిస్టులే ప్రధాన పాత్రలుగా కనిపిస్తూ ఉంటారు ఎందుకు?

నా దృష్టిలో ఆర్టిస్ట్ అర్థం వేరు. చికెన్ షాపులో ముక్కలు కొట్టేవాళ్ళు, బేకరీలో కేక్ తయారు చేసేవాళ్ళు ప్రతి ఒక్కరూ ఆర్టిస్టులే. ఇంట్లో అమ్మ అన్నం వండుతుంది కదా, తనూ ఆర్టిస్టే. ప్రతి ఒక్కరిలో ఆర్టిస్ట్ ఉంటాడు. నేను ప్రతి ఒక్కరిలో కళాకారుడ్ని చూస్తాను. వాళ్ళే నా కథల్లోకి వచ్చారు. అంతేగానీ కవి గురించో, పెయింటర్ గురించో, నటుడి గురించో అనుకోని రాసింది లేదు.

ప్లాన్ చేసుకొని రేపొక కథ రాయాలీ ఎల్లుండి ఒక కథ రాయాలీ అని నాకు అనిపించదు. ఆ కథ నన్ను వెంటాడి, బలంగా చెప్పాలీ అనిపించినప్పుడు రాస్తాను. కథ ఎక్కువగా మగ్గాలి. ఆ కథలో చెప్పదల్చుకున్న దానికి తగ్గ కేరెక్టర్ దొరకాలి.

మీ ఒక్కో కథలో ఒక్కో జీవితం కనిపించే అంత స్పాన్ ఉంటుంది. ఈ కతల్ని ఆయా పాత్రల జీవిత చరిత్రలుగా చూడొచ్చా?

ఖచ్చితంగా చూడొచ్చు. డెఫినెట్‌గా నాకు ఆ స్పాన్‌లో రాయాలని ఉంది. అందుకే నేనెక్కువ లాంగ్ ప్రోజ్ రాస్తున్నానేమో. వి. చంద్రశేఖరరావు, జి. కళ్యాణ్ రావు లాంటి వాళ్ల రాసినవి చదివినప్పుడు ఆ స్పాన్‌లో రాద్దామని అనిపించింది.

'ద డెడ్ మూన్ ఈజ్ గోయింగ్ టు సింగ్', 'మెమొరీస్ ఆఫ్ మోనోలాగ్' కథల్లో ఆంగ్లో ఇండియన్స్‌నే ప్రధాన పాత్రలుగా తీసుకొని ఎందుకు రాయాలనిపించింది?

మార్జినలైజ్డ్ మనుషుల మీద ప్రేమ నాకు. ఆసక్తి కూడా. మెజార్టీ దేశంలో మైనార్టీ ఎలా ఆలోచిస్తుంది, వాళ్ళ అంతర్గత సంఘర్షణ ఎలా ఉంటుంది.. వీటిని క్యాప్చర్ చేయాలనుంటుంది.



ఈ కథల్లో ఆలోచనలు గమనిస్తే రచయిత లెఫ్టిస్ట్ అండ్ అంబేడ్కరిస్ట్ ఐడియాలజీతో ఉన్నట్టు అనిపిస్తుంది. మిమ్మల్ని పొలిటికల్ రైటర్‌గా భావించవచ్చా?

పొలిటిక్స్ అనేవి మన లైఫ్‌లో ఉంటాయి. పొలిటికల్ రైటర్స్ అంటూ ఉండరు. నేను పొలిటికల్ రైటరా అంటే, పొలిటికల్ రైటర్ కూడా! వెళ్ళి ధర్నాలు చేయకపోవచ్చు, భౌతికవాదాన్ని తీసుకొని రాయకపోవచ్చు. కానీ ఆ అంశాల మీద కథలు రాయాలని ఉంటుంది. అయితే నా శైలిలో నేను రాస్తాను.

ఇంటర్వ్యూ ■ గూండ్ల వెంకట నారాయణ



చిట్టి మాలక్ష్మికి కోటి దండాలు

చిట్టిది పాపాయిగా ఉన్నప్పుడు
బుల్లి పాదాలకు ఇష్టంగా చేయించిన
వెండి పట్టీలు
అవసరానికి ఆదుకునే దోస్తానం అవుతుందని
కలలో కూడా అనుకోలేదు.

వేళ కాని వేళకు
కష్టం సొమ్ము ఇంకా చేతికి అందనప్పుడు
ఇంట్లో
బియ్యపు గింజ కూడా కరువయినప్పుడు
మెతుకు కొరకు తల్లీ పిల్లల ఎదురుచూపు
పొయ్యి మీద మరుగుతున్న ఎసరయినప్పుడు
పేగులకుప్పకు నిప్పంటుకున్నట్టు
గుండె కింద ఆకలి సెగ
భగభగ మండుతున్నప్పుడు
పొగ చూరిన ఎలుక పిల్ల
కలుగులోంచి కాలు బయటపెట్టినట్టు
గడప దాటి అప్పు వేటకు బయలుదేరుతాను

తిరిగి తిరిగి కాళ్ళు అరిగిపోయి
ఒక్క కాసు కూడా దొరకని
గురి తప్పిన నిట్టూర్పు గీతం అయినప్పుడు
చిట్టి దాని పాదాల ముందు మోకరిల్లుతాను.

చుట్టం వచ్చినప్పుడు
పండుగ వచ్చినప్పుడు
గల్లాపెట్టె అలిగి కూర్చున్నప్పుడు
బుచ్చి పాదాల చిన్ని దేవత ముందు
దోసిలి పట్టి
ఆపద గట్టెక్కే వరములు పొందుతాను
లేత పాదాలు ఎదుగుతున్న కొద్దీ
వాళ్ళు చేసే చిట్టి దాని పట్టీల ముందు
తల వొంచుతాను

అడగ్గానే
కవచ కుండలాలు వొలిచి ఇచ్చినట్టు
చెవి కమ్మలు తీసి ఇచ్చిన
అమ్మ రొమ్ము పాలు తాగినందుకు
తల్లి గుణం నర నరాన పాకుతున్న
చిట్టి దాని ముందు ఇప్పటికీ చేయి చాపే
మొండి బిచ్చగాడిలా నేను.

■ గజ్జెల రామకృష్ణ
✆ 89774 12795

చిన్నయసూరి జీవితచరిత్రకారుడు

తెలుగు సాహిత్యంలో నన్నయ్య మొదలు సుమారు నాలుగు వందల మందికి పైగా కవులు, పండితుల జీవిత చరిత్రలు వెలుగు చూసాయి. బాలవ్యాకరణం, నీతిచంద్రికల రచయిత పరవస్తు చిన్నయసూరి జీవిత చరిత్ర మాత్రం వెలుగు చూడలేదు. చిన్నయసూరి చనిపోయిన తర్వాత వందేళ్ళు ఆలస్యంగానైనా ఆ చరిత్రను వెలుగు లోనికి తెచ్చింది వంగీపురం హరి నారాయణ దాసు. అయితే నేడు ఈ హరి నారాయణ దాసు ఎవరో కూడా చరిత్రకు అందని దాఖలా అయింది.

వంగీపురం హరి నారాయణ దాసు రాసిన చిన్నయసూరి జీవిత చరిత్రకు అందవలసిన ప్రాముఖ్యత, విశిష్టత తెలుగు సాహిత్యంలో లభించలేదు. ఈ గ్రంథ ప్రచురణ తర్వాత వంగీపురం హరి నారాయణ దాసు కూడా సాహిత్య చరిత్రలో నిలవలేదు. మానవల్లి రామకృష్ణ కవి, మధువాపంతుల సత్య నారాయణ శాస్త్రి, చిల్లర వెంకటేశ్వరకవి, వై. వెంకట రమణ కవి లాంటి అప్పటి పండితుల అభిమానం మాత్రం పొందగలిగారు.

చెన్నపట్నం సమీపంలోని పెరంబదూరులో చాత్తాద శ్రీవైష్ణవులు వెంకట రంగయ్య – శ్రీనివాసాంబ దంపతులకు జన్మించిన పరవస్తు చిన్నయ సూరిపై ఆయన శిష్యులు మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి కలిసి ప్రయత్నం చేసినా జీవిత రచన చేయలేకపోయారు. ఆ కార్యాన్ని వంగీపురం సాధించగలిగారు. సూరి జీవితాన్నే కాక వారి సాహిత్య కృషి, పాండిత్యం, ఆ కాలం నాటి పత్రికలు, ఆనాటి పరిస్థితులనుసైతం తన గ్రంథంలో వివరించడం వంగీపురం కృషికి నిదర్శనమని అప్పటి పండితులు సైతం అంగీకరించారు. 1862లో యాభై మూడేళ్ల చిన్న వయస్సులోనే చిన్నయ సూరి పరమపదించినా, ఆయనకు తెలిసిన పండితులు, మిత్రులను కలిసి, వారు రాసిన గ్రంథాలను పరిశోధించి చిన్నయసూరి జీవిత చరిత్రను వంగీపురం వెలుగులోకి తెచ్చారు. 1930లో ఆంధ్ర పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా పని చేస్తున్న చిన్నయ సూచి బంధువు ఒక్కపట్నం రామానుజయ్య లాంటి వారిని కలిశారు. నీతిచంద్రిక, బాలవ్యాకరణము, లక్షణగ్రంథములు, అనువాదములు, వ్యాసములు,



కథలు, నిఘంటువులు, ఆంధ్ర ధాతుమాల, ఆంధ్ర శబ్దశాసనము వంటి ఎన్నో గ్రంథాలను సేకరించగలిగారు. అచ్చుకాని గ్రంథాలు కూడా కొన్నిటిని సేకరించారు. 1862లో చిన్నయసూరి మరణించినా 1951 వరకు వీటిలో కొన్ని గ్రంథాల ముద్రణ జరగలేదు. వివాదమైన ధాతుమాలను చిన్నయసూరే రచించారని నిరూపించటానికి వంగీపురం కాకినాడ సాహిత్య పరిషత్తు ద్వారా విశేష కృషి చేశారు. 1952లో వంగీపురం సమీప బంధువు సత్యనారాయణరావు ఈ పుస్తకాన్ని ముద్రించి వంగీపురం హరి నారాయణ దాసును సాహిత్య లోకానికి పరిచయం చేశారు. ఆయన ద్వారానే వంగీపురం నెల్లూరు పట్టణానికి చెందిన వ్యక్తి అనీ, పురాతనమైన నాలుగు కాళ్ల మండపం సంతపేట నివాసి అని తెలిసింది. వంగీపురం పెద్దలు చెన్నపట్నం వలస వెళ్లారని తెలుస్తుంది. తెలుగు భాష మీద, సాహిత్యం మీద మక్కువతో వంగీపురం విశేష కృషి చేసి వెలుగులోకి తెచ్చిన చిన్నయ్య సూరి జీవిత చరిత్ర మరుగున పడటం దురదృష్టమే.

■ ఈతకోట సుబ్బారావు
✆ 94405 29785

దొస్తొయేవ్‌స్కీ నవల అనువాదం

దొస్తొయేవ్‌స్కీ 'ద ఇడియట్' నవలకు వై. వేణుగోపాల్ రెడ్డి అనువాదం ఆవిష్కరణ సభ డిసెంబర్ 18 సా.6గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత కుమార్ కూనపరాజు; ఆవిష్కర్త దాట్ల బాల వెంకటేశవర్మ; ముఖ్య అతిథి గోరటి వెంకన్న; వక్తలు ఎస్. కాత్యాయని, శ్రీనివాసమూర్తి, గుంటూరు లక్ష్మీనరసయ్య, హెచ్చార్కె.

గుర్రం సీతారాములు

ఎరుకల కథా సంపుటి 'ఏకలవ్య కాలనీ'

పర్‌స్పెక్టివ్స్ ప్రచురణగా వస్తున్న పలమనేరు బాలాజీ కథా సంపుటి 'ఏకలవ్య కాలనీ' ఆవిష్కరణ సభ డిసెంబర్ 17 సా.4 గంటలకు సాధి బుక్ స్టాల్, 9బి, బి బ్లాక్, 9th ఫ్లోర్, సామ్రాట్ కాంప్లెక్స్, సైఫాబాద్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్తలు– రాగాల వెంకట రాహుల్, ఎన్. వేణుగోపాల్. సభ నిర్వహణ ఎ.కె. ప్రభాకర్. సభలో ఆర్కె, కె. శివారెడ్డి, చిన వీరభద్రుడు, యాకూబ్ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 94409 95010.

పలమనేరు రచయితల సంఘం

శీలా వీర్రాజు తెలుగు ఫాంట్

శీలా వీర్రాజు చేతి రాత ఆధారంగా రూపొందించిన తెలుగు ఫాంట్ ఆవిష్కరణ డిసెంబరు 21 సా.5.30గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఇదే సభలో శీలా సుభద్రాదేవి కవితా సంపుటి 'మాట్లాడటానికో మనిషి కావాలి' ఆవిష్కరణ కూడా జరుగుతుంది. సభలో నందిని సిధారెడ్డి, సుధామ, అమృతలత, పుప్పాల శ్రీరామ్, శీలా సుభద్రాదేవి పాల్గొంటారు

శీలావీ సాహిత్య చిత్రకళావేదిక

కవులూ కళాకారులతో కరచాలనం

వారాల ఆనంద్ 'కవులూ కళాకారులతో కరచాలనం' పుస్తకం ఆవిష్కరణ సభ డిసెంబర్ 21న కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ పీజీ కాలేజీలో జరుగుతుంది. ఆవిష్కర్త పూర్వ ప్రిన్సిపాల్ బి. రాంచందర్ రావు, తొలి కాపీ స్వీకర్త ప్రస్తుత ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ.

వి. ఇందిరా రాణి

ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డుల ప్రదానం

ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డుల ప్రదానోత్సవం డిసెంబర్ 22 ఉ.10గంటలకు అనంతపురం లోని ఎన్‌జీవో హోమ్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి వాడ్రేవు చినవీరభద్రుడు. ఉమ్మడిశెట్టి అవార్డును బండి సత్యనారాయణ, ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ యువ పురస్కారాన్ని మానస చామర్తి గారు స్వీకరిస్తారు. ఈ సందర్భంగా రాధేయ కవిత్వం 'అజేయుడు' ఆవిష్కరణ ఉంటుంది.

ఉమ్మడిశెట్టి రాధేయ

పనుల్లో నిర్లక్ష్యం

- బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయకుండానే నిర్వహణ
- వాటర్‌బోర్డు నిబంధనలను పట్టించుకోని కాంట్రాక్టర్లు
- జాగ్రత్తలు తీసుకోకుండా తవ్వకాలు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న వాటర్‌బోర్డు పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సకాలంలో పూర్తిచేయడమేమో కానీ.. వాటర్‌బోర్డుకు కొత్త సమస్యలను సృష్టిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఆపరేషన్ మెయింటెనెన్స్ విభాగాల్లో సాగుతున్న పనుల్లో కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఆయా పనులను నిత్యం పర్యవేక్షించాల్సిన సేఫ్టీ ప్రొటోకాల్ టీమ్‌లు (ఎస్‌పీటీ) నామమాత్రంగా వ్యవహరిస్తున్నాయి.

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ పరిధిలో తాగునీటిని సరఫరా చేస్తూ.. మురుగునీటి నిర్వహణను వాటర్‌బోర్డు చేపడుతోంది. పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణలో సమస్యలు తలెత్తుతుంటాయి. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు సెక్షన్ల వారీగా పనులను యాన్యువల్ మెయింటెనెన్స్ స్కీమ్(ఏఎంసీ) ద్వారా కాంట్రాక్టర్లకు అధికారులు అప్పగించారు. వివిధ ప్రాంతాల్లో అత్యవసరంగా కూడా వాటర్‌బోర్డు పనులు చేపడుతోంది. నగరంలో పనులు నిర్వహించే ప్రాంతాల్లో బారికేడ్లను ఏర్పాటు చేసుకోవాలని వాటర్‌బోర్డు నిబంధనలు విధించింది. బారికేడ్లు ఏర్పాటు చేయకుండా తవ్వకాలు చేపడితే స్థానికులు ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయి. గతంలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో వాటర్‌బోర్డు పనుల్లో కనీస జాగ్రత్తలుగా బారికేడ్లను అమర్చుకోవాలని, చేసే పనుల వివరాలతో బోర్డులు, ఇతర పైపులైన్లకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేయాలని వాటర్‌బోర్డు నిబంధనల్లో పేర్కొంది.


వాటర్‌బోర్డు ఎండీ ఆదేశాల అనంతరం ఉప్పల్‌లోని రిజిస్ట్రేషన్ ఆఫీసు వీధిలో చేపట్టిన రక్షణ చర్యలు

బోర్డులు.. బారికేడ్లు లేవు

వాటర్‌బోర్డు పనుల్లో నిబంధనలను కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. జాగ్రత్తలు తీసుకోకుండా కాలనీలు, వీధుల్లో రోడ్లను తవ్వుతున్నారు. ఇరువైపుల బారికేడ్లు ఏర్పాటు చేయడం లేదు. పనులకు సంబంధించిన వివరాలను పొందుపరిచి ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలిసేవిధంగా బోర్డులు కూడా పెట్టడం లేదు. మురుగు, తాగునీటి నిర్వహణ పనులు చేపడితే ఇదీ వాటర్‌బోర్డు పని అని గుర్తుపట్టే పరిస్థితి ఉన్నది. ఇటీవల ఉప్పల్‌లోని రిజిస్ట్రేషన్ ఆఫీసు వీధిలో మురుగునీటి నిర్వహణ పనులు చేస్తున్నారు. ఆ వీధిలో రోడ్డును తవ్వారు. మ్యాన్‌హోళ్ల మూతలను కూడా ధ్వంసం చేశారు. పనులను చేపడుతున్న కాంట్రాక్టర్ జాగ్రత్తలు తీసుకోలేదనే విషయం వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి దృష్టికి వచ్చింది. పనులు జరిగే ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దాంతో కాంట్రాక్టర్ అప్పటికప్పుడు బారికేడ్లు ఏర్పాటు చేశాడు. ఎండీ, డైరెక్టర్ స్థాయి అధికారుల పరిశీలనకు వస్తే తప్ప.. కాంట్రాక్టర్లు పనులు జరిగేచోట బారికేడ్లు ఏర్పాటు చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.


తవ్వి వదిలేసిన రోడ్డు

సేఫ్టీ టీమ్‌ల పర్యవేక్షణ కరువు

పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలపై మరింత పర్యవేక్షణ కోసం ఆరు సర్కిళ్లకు ఆరు సేఫ్టీ ప్రొటోకాల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్‌లో ఇంజనీర్, కానిస్టేబుల్, హోంగార్డు కమ్ డ్రైవర్ ఉంటారు. ఈ టీమ్‌లకు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. వీరు నగరంలో వాటర్‌బోర్డు చేపట్టే వివిధ పనులు జరిగే ప్రదేశాల్లో భద్రతా చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తారు. పైపులైన్ విస్తరణ, సీవరేజ్, లీకేజీల నివారణ పనులు, మ్యాన్‌హోల్ మరమ్మతులు, ఇలా ప్రతి పని ప్రదేశంలో భద్రతా చర్యలు కచ్చితంగా పాటించేలా చూస్తారు. ఎక్కడైనా పని జరుగుతున్న ప్రదేశంలో రక్షణ పరికరాలు లేకపోయినా, బారికేడ్లు ఏర్పాటు చేయకపోయినా ఈ బృందాలే ఏర్పాటు చేస్తాయి. రాత్రివేళల్లో పనులు జరిగే ప్రాంతాల్లో లైటింగ్, రేడియం సూచికల ఏర్పాటు, భద్రతా చర్యలు పాటిస్తున్నారా.. లేదా..? అనేది ఈ టీమ్‌లు పర్యవేక్షిస్తాయి. పనులు జరుగుతున్న ప్రదేశాలను జియోట్యాగ్ ఆధారంగానే ఈ టీమ్‌లు పని ప్రదేశాలకు వెళ్లి తనిఖీలు చేస్తాయి. ఎస్పీటీ వాహనాలకు కెమెరా, టీమ్‌లోని

మిగతా 8వ పేజీలో..

ఇష్టానుసారంగా పనుల నిర్వహణ

రెడ్‌హిల్స్‌లో మురుగునీటి నిర్వహణ పనులను ఓ ప్రైవేటు ఎంటర్‌ప్రైజెస్ సంస్థ దక్కించుకొని చేపడుతోంది. సీవరేజ్ పనుల కోసం తవ్వకాలు జరిపే క్రమంలో ఇతర పైపులైన్లు ధ్వంసం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. స్థానికులు, అధికారులను ఆరా తీసి ఆయా ప్రాంతాల్లో తవ్వకాలు జరపాలి. శనివారం సాయంత్రం రెడ్‌హిల్స్‌లో మురుగునీటి నిర్వహణ పనులు జరిగే క్రమంలో ఇష్టానుసారంగా తవ్వకాలు జరిపారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేయడంతో 850ఎంఎం డయా పైపులైన్ దెబ్బతిన్నది. పెద్దఎత్తున తాగునీరు వృథాగా పోయింది. గండిపేట జలాశయం నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్‌కు, అక్కడ శుద్ధి చేసిన నీరు రెడ్‌హిల్స్ రిజర్వాయర్‌కు చేరుతుంది. ఆ నీరే నిలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రులతోపాటు సచివాలయం, పదికిపైగా ప్రాంతాలకు సరఫరా అవుతాయి. రెడ్‌హిల్స్ రిజర్వాయర్‌కు చేరే పైపులైన్ ధ్వంసం కావడంతో 12గంటల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆయా ప్రాంతాలవాసులు నీటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాటర్‌బోర్డు సీవరేజ్, తాగునీటి నిర్వహణ పనులను కాంట్రాక్టర్లు చేపట్టే క్రమంలో భూమిలో నుంచి ఉన్న వివిధ పైపులైన్లతో పాటు బీఎస్ఎన్ఎల్ తదితర నెట్‌వర్క్ సంస్థల కేబుల్స్ కూడా ధ్వంసం చేస్తున్నారు. తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.


పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

నీటి సరఫరా పునరుద్ధరణ

- రెడ్‌హిల్స్‌లో పూర్తయిన పైపులైన్ మరమ్మతు పనులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెడ్‌హిల్స్ వద్ద ధ్వంసమైన తాగునీటి పైపులైన్‌ను పునరుద్ధరించారు. శనివారం సాయంత్రం సీవరేజ్ పైపులైన్ల నిర్మాణ క్రమంలో పైపులైన్ ధ్వంసమైంది. దీంతో పెద్ద ఎత్తున నీరు వృథాగా పోయింది. అప్రమత్తమైన వాటర్‌బోర్డు అధికారులు నీటి సరఫరాను నిలిపివేసి ధ్వంసమైన పైపులైన్ మరమ్మతులు చేపట్టారు. ఆదివారం సాయంత్రం వరకు మరమ్మతు పనులను పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. రెడ్‌హిల్స్ రిజర్వాయర్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు యథావిధిగా నీటిని సరఫరా చేయనున్నారు. పనులను వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి పరిశీలించారు. పాడైన, తొలగించిన పైపులను అక్కడి నుంచి తొలగించాలని సిబ్బందికి సూచించారు. వాటర్‌బోర్డు చేపట్టే మరమ్మతులు, పైపులైన్ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు పునరుద్ధరణ పనులు నిర్వహించాలని ఆదేశించారు. సకాలంలో మరమ్మతు పనులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించిన అధికారులు, సిబ్బందిని ఎండీ అభినందించారు.


స్థానికులతో మాట్లాడుతున్న హెచ్ఏఎంఎల్ సిబ్బంది

వేగంగా పాతబస్తీ మెట్రో పనులు

- నెలాఖరులోగా 200 ఆస్తులకు పరిహారం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న 7.5 కిలోమీటర్ల పనుల్లో వేగం పుంజుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వీలైనంత త్వరగా పనులను పట్టాలెక్కించడంలో భాగంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు ముందుకు సాగుతున్నారు. పాతబస్తీలో పనుల నేపథ్యంలో 1100 ఆస్తులు ప్రభావితమవుతున్నట్లు హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఇప్పటివరకు 900 ఆస్తులకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. నోటిఫై చేసిన ఆస్తుల్లో 400 ఆస్తులకు ప్రిలిమినరీ డిక్లరేషన్‌ను ఇవ్వగా.. 200 ఆస్తులకు సంబంధించిన పరిహారానికి ఈ నెలాఖరులోగా అవార్డు ప్రకటిస్తామని పేర్కొన్నారు. మెట్రో రైల్ రాకతో పాతనగరం ఎంతో ఆకర్షణీయ ప్రాంతంగా రూపుదిద్దుకుంటుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని చెప్పారు.

ఇరుకు గదులతో ఇక్కట్లు ‖ 8 ‖ టీజీ ట్రాన్స్‌కోకు ఎల్‌డీసీ 'ఎక్సలెన్స్' అవార్డు

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో చోరీ



బంజారాహిల్స్ డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఇంట్లో రూ. 7.5 లక్షలు చోరీ అయ్యాయి. భరణి లే అవుట్‌లో నివసించే కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నాలుగు రోజుల క్రితం ఇంటికి రూ. 7.5 లక్షలు తీసుకువచ్చారు. వాటిని ఓ టేబుల్ మీద పెట్టి మరిచిపోయారు. ఈ నెల 14న డబ్బు కోసం వెతకగా కనిపించలేదు. దీంతో ఆయన ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

40 శాతమే హాజరు

24 మంది వెనక్కి

- ఉరుకులు, పరుగులతో కేంద్రాలకు వచ్చిన గ్రూప్-2 అభ్యర్థులు
- 144 సెక్షన్.. భారీ పోలీసు బందోబస్తు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు గ్రేటర్‌లో ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 40 శాతం మంది మాత్రమే పరీక్షకు హాజరు కావడం గమనార్హం. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్‌లో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సెషన్‌లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించారు. అత్యధిక మంది అభ్యర్థులు నిర్దేశిత సమయం కంటే గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకున్నారు. అధికారులు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. పరీక్ష ప్రారంభమయ్యే అరగంట ముందే కేంద్రాల గేట్లను మూసి వేయడంతో పలుచోట్ల కొందరు వెనుదిరగాల్సి వచ్చింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేసి సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. మొదటి రోజు ఆదివారం హైదరాబాద్ జిల్లాలో ఉదయం జరిగిన పేపర్-1 పరీక్షకు 48,012 అభ్యర్థులకు 19208 మంది (40.01 శాతం) హాజరుకాగా, 28,804 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పేపర్-2 పరీక్షకు 48,012 అభ్యర్థులకు 18,879 (39.32 శాతం)

మిగతా 6వ పేజీలో..


మెహిదీపట్నంలో సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కళాశాలలో ఓఎంఆర్ షీట్లను పరిశీలిస్తున్న కలెక్టర్


స్టాండ్ సహాయంతో పరీక్షా కేంద్రానికి వస్తున్న గాయపడిన వ్యక్తి



తనిఖీల్లేవ్

ప్రైవేట్ ఇంటర్ కాలేజీల పర్యవేక్షణను మరిచిన అధికారులు

- అనుమతిలేని వాటిని పట్టించుకోని పరిస్థితి
- అడ్మిషన్లు ఒకచోట.. నామినల్ రోల్స్ మరోచోట
- విద్యార్థుల నుంచి రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా చర్యలు శూన్యం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ప్రైవేట్ ఇంటర్మీడియట్ కాలేజీల దందా జోరుగా సాగుతోంది. ఇంటర్‌బోర్డు నుంచి ఒక కాలేజీకి అనుమతి తీసుకుని పదుల సంఖ్యలో బ్రాంచీలను ఏర్పాటు చేస్తున్నారు. కొందరు అనుమతి తీసుకోకుండానే హంగు, ఆర్భాటాలతో దర్జాగా కళాశాలలను ప్రారంభిస్తున్నారు. తమ వద్ద చేరుతున్న విద్యార్థుల నామినల్ రోల్స్‌ను గుర్తింపు పొందిన ఇతర కాలేజీల నుంచి పంపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. విద్యాసంస్థల పేరుతో కళ్లెదుటే కొంతమంది అక్రమాలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ జిల్లాలో 22 ప్రభుత్వ, 255 ప్రైవేట్ కాలేజీలున్నాయి. రంగారెడ్డిలో 18 ప్రభుత్వ, 218 ప్రైవేట్, మేడ్చల్‌లో 210 ప్రైవేట్, 5 ప్రభుత్వ కాలేజీలు నడుస్తున్నాయి. ఆయా జిల్లాల్లో నడుస్తున్న ప్రైవేట్ కాలేజీల్లో 40శాతం విద్యాసంస్థలు అనుమతులు లేకుండా కొనసాగుతున్నా.. వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. భారీ ప్రకటనలతో తల్లిదండ్రులను నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నా కాలేజీలపై కనీస చర్యలు తీసుకోని పరిస్థితి నెలకొంది.

అనుమతి ఒకటి.. బ్రాంచీలు అనేకం

ప్రైవేట్ ఇంటర్మీడియట్ విద్య కొంతమందికి కాసుల వర్షం కురిపిస్తోంది. రాష్ట్ర రాజధాని నగరంలో నాణ్యమైన విద్య లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్న తల్లిదండ్రులను ఏటా నిలువునా దోచుకుంటున్నారు. ప్రధానంగా ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఒక కాలేజీకి అనుమతి తీసుకుని.. దానికి అనుబంధంగా వేర్వేరు ప్రాంతాల్లో మూడు, నాలుగుకుపైగా ఏర్పాటు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఉదాహరణకు హిమాయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీ ఇతర రాష్ట్రం పేరుతో తరగతులను నిర్వహిస్తోంది. వాస్తవంగా ఈ కళాశాలకు

మిగతా 8వ పేజీలో..

అనుమతిలేని వాటిని మూసేయాలి

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ కాలేజీలను అరికట్టాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావిద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అనుమతి లేని కాలేజీలను వెంటనే మూసివేయకపోతే విద్యార్థి సంఘాల ఐక్యతతో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.


ఓ రెస్టారెంట్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు (ఫైల్)

అన్నీ కల్తీ

- తింటే రోగాలు రావడం ఖాయం
- ఇలా కనిపెట్టండి అని సూచిస్తున్న నిపుణులు


బాలానగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కల్తీ అనేది ఇపుడు సర్వాంతర్యామిగా మారింది. ఉదయం లేవగానే తాగే టీకి ఉపయోగించే పాలతోసహా నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు అన్నీ కల్తీ అవుతున్నాయి. కళ్లతో, నాలుక రుచితో కనిపెట్టని రీతిలో కల్తీ జరుగుతుందంటే ఈ మహమ్మారి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కల్తీ ఆహార పదార్థాలు తింటూ ప్రజలు అనారోగ్యంబారిన పడుతున్నారు. వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటే.. అనారోగ్యానికి కారణం కల్తీ అని వారు చెబుతుండడంతో కళ్లు తేలేయాల్సిన పరిస్థితి. కల్తీని కనిపెట్టేందుకు ప్రత్యేక విభాగం ఉన్నా.. ఆ పని సక్రమంగా జరగడం లేదు. ఈ నేపథ్యంలో ఏ పదార్థంలో ఏమి కలిపి కల్తీ చేస్తారు, ఎలా గుర్తించాలి అనే అంశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కారం పొడి



కలిపే పదార్థాలు: ఇటుక పొడి, రంపపుపొట్టు, రంగు కోసం అంగో రెడ్ కలర్
ఆరోగ్య సమస్య: క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.
కల్తీ అయినట్లు తెలుసుకునేదెలా: కల్తీ అయిన కారం పొడిని నీటిలో కలిపితే రంపపు పొట్టు పైకి తేలుతుంది, ఇటుక పొడి అడుగున చేరుతుంది. నీరు ఎరుపు రంగుగా మారుతుంది.

పసుపు



కలిపే పదార్థాలు: మెటానికల్ ఎల్లో రంగును కలుపుతారు.
ఆరోగ్య సమస్య: ఎక్కువ వాడితే పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది.
కల్తీ అయినట్లు తెలుసుకునేదెలా: పసుపును నీటిలో కలిపితే తెల్లనైన వర్ణం కనిపిస్తే కల్తీ లేనట్లు, ముదురు రంగు కనిపిస్తే కల్తీ జరిగినట్లు గుర్తించాలి.

కల్తీ పదార్థాలు తింటే అనారోగ్య సమస్యలు



కల్తీ ఆహారం తింటే అజీర్తి సమస్య తలెత్తుతుంది. విపరీతమైన కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, శరీరంలో అలసట ఏర్పడుతుంది. కల్తీ ఆహార పదార్థాలు ఒక్కోసారి క్యాన్సర్‌కు కూడా దారితీస్తాయి. కల్తీ ఆహార పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ వి. మమత, మెడికల్ ఆఫీసర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బాలానగర్

పంచదార

కలిపే పదార్థాలు: సుద్ద పొడి, యూరియా.
ఆరోగ్య సమస్య: వాంతులు
కల్తీ అయినట్లు తెలుసుకునేదెలా: పంచదారను నీటిలో కలిపితే సుద్దపొడి అడుగున చేరుతుంది. యూరియా నీటితో కలిసి రసాయనిక చర్య జరిపి అమ్మోనియా వాసన వస్తుంది.



తేనె



కలిపే పదార్థాలు: చక్కెర పాకం లేదా బెల్లం పాకం
ఆరోగ్య సమస్య: శరీరంలో చక్కెర శాతం పెరుగుతుంది
కల్తీ అయినట్లు తెలుసుకునేదెలా: దూదిని తేనెలో ముంచి కాల్చితే సరైనది మండుతుంది. చక్కెర పాకం కలిసి ఉంటే మండదు. ఒక వేళ మండినా శబ్దం వస్తుంది.

మిరియాలు



కలిపే పదార్థాలు: బొప్పాయి గింజలు
ఆరోగ్య సమస్య: జీర్ణకోశ సమస్యలు
కల్తీ అయినట్లు తెలుసుకునేదెలా: కల్తీ అయిన మిరియాల గింజలను నీటిలో వేస్తే బొప్పాయి గింజలు పైకి తేలతాయి. మిరియాలు అడుగున చేరతాయి.

గోధుమ పిండి



కలిపే పదార్థాలు: తవుడు
ఆరోగ్య సమస్య : మలబద్ధకం
కల్తీ అయినట్లు తెలుసుకునేదెలా: గోధుమ పిండిని నీటిలో కలిపితే తవుడు పైకి తేలుతుంది, గోధుమ పిండి నెమ్మదిగా అడుగున చేరుతుంది.

బెల్లం



కలిపే పదార్థాలు: సుద్దపొడి
ఆరోగ్య సమస్య: కడుపులో నొప్పి
కల్తీ అయినట్లు తెలుసుకునేదెలా: బెల్లంను నీటిలో కలిపితే కరుగుతుంది. సుద్ద పొడి నీటి అడుగు భాగాన చేరుతుంది.

6వ పేజీలో మరిన్ని వివరాలు

నకిలీ పత్రాలతో రూ.కోటి లోన్

- ఈఎంఐలు కట్టకపోవడంతో గుర్తించిన బ్యాంకు అధికారులు
- వేర్వేరు కేసుల్లో ఇద్దరిపై ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): ఇళ్లు కొంటున్నామని నకిలీపత్రాలు బ్యాంకులో చూపించి లోన్‌తీసుకుని టోకరా వేశారని బ్యాంకు అధికారులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ప్రాంతంలో నివసించే శ్రీదేవి మహ్మద్ కొండాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినని, అపార్ట్‌మెంట్‌లో ఇల్లు కొనుగోలు చేస్తున్నానని శ్రీనివాస్‌నగర్ వెస్ట్‌లోని సౌత్‌ఇండియన్ బ్యాంక్‌ను కలిసింది. ఆమెకు అతని భర్త మహ్మద్ జలాలుద్దీన్, మీడియేటర్ గణేష్ సాహు సహకరించారు. ఆమె అపాయింట్‌మెంట్ లెటర్, శాలరీ స్లిప్ తదితర అన్ని డాక్యుమెంట్‌లు సమర్పించి రూ.68లక్షలు లోన్ కావాలని దరఖాస్తు చేశారు. బ్యాంకు వారు రూ.67,88,324 లోన్ మంజూరు చేశారు. అదేవిధంగా కుల్లా రాజేశ్వరీ అనే మహిళ దుర్గారావు అనే మీడియేటర్ ద్వారా 'ఫ్లాట్ కొనుగోలు చేస్తున్నాను. రూ.46లక్షలు లోన్‌కావాలి' అని పత్రాలు సమర్పించింది. ఆమెకు బ్యాంకు వారు రూ.32,05,573 లోన్ మంజూరు చేశారు. అయితే ఈ రెండు కేసులు ఈఎంఐలు కట్టకపోవడంతో బ్యాంకు వారు ఎంక్వయిరీ చేయగా వారు సమర్పించినవి నకిలీ డాక్యుమెంట్‌లని తేలాయి. దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ క్రియేట్ చేసి వేధింపులు

పోలీసులను ఆశ్రయించిన మహిళ

యూసుఫ్‌గూడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'నా పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ ఓపెన్ చేసి అసభ్యంగా పోస్టులు పెడుతూ వేధిస్తున్నారు' అని ఓ మహిళ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే ఓ మహిళ పేరుతో గుర్తుతెలియని వ్యక్తి ఫేస్‌బుక్ అకౌంట్ క్రియేట్ చేసి ఆమె ఫొటోలతో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నాడు. దీంతో అతనికి ఫోన్ చేసినా నంబర్ బ్లాక్ చేశాడు. దీంతో ఆ మహిళ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ సత్యం, ధర్మంతో జీవించాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


సత్సంగ్ విహార్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

రాజేంద్రనగర్, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): సత్యం, ధర్మం, మంచి అలవాట్లు కలిగి జీవించడమే సత్సంగ్ అని, ఠాకూర్ అనుకూల్ చంద్ర స్థాపించిన సత్సంగ్ విహార్‌లలో ఇదే అంశాన్ని బోధిస్తూ ఆచరించడం సంతోషకరమైన విషయమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. యుగ పురుషోత్తమ్ పరమ్ ప్రేమామయ శ్రీఠాకూర్ అనుకూల్ చంద్ర 137వ జయంతోత్సవాలు, హైదరాబాద్ సత్సంగ్ విహార్ 14వ వార్షిక ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాజేంద్రనగర్‌లోని హైదరాబాద్ సత్సంగ్ విహార్‌లో వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరై శ్రీఠాకూర్ అనుకూల్ చంద్ర మహారాజ్ ను దర్శించుకున్నారు. అనంతరం సత్సంగ్ విహార్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మంచిని ఆచరించాలంటే గురువు సారథ్యంలో నేర్చుకోవాల్సి ఉంటుందని, అది సత్సంగ్ విహార్‌లలో సాధ్యమవుతుందన్నారు. స్వామి వివేకానంద లాంటి యుగపురుషులు వికసిత్ భారత్ సాధన దిశగా పనిచేశారన్నారు. ప్రజల జీవన విధానం, నాగరికత బాగుండాలని గుర్తుచేశారు. భారత్‌లో పుట్టిన గురువులు, మేధావులు ప్రజలందరూ కలిసిమెలిసి జీవించాలని కోరుకున్నారని, అదే నేడు ప్రధాని నరేంద్రమోదీ సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ అని అంటున్నారని గుర్తుచేశారు. ఠాకూర్ అనుకూల చంద్ర మహారాజ్ సేవలు, సామాజిక కార్యక్రమాల్లో సత్సంగ్ విహార్ చేస్తున్న కృషి ఎంతో గొప్పవన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అండమాన్ నికోబార్ దీవుల ఎంపీ బిష్ణు పద రాయ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఠాకూర్ అనుకూల్ చంద్రమహారాజ్ మార్గంలో నడుచుకున్ననాడు దేశం అన్ని రంగాల్లో ప్రపంచానికి మార్గదర్శనం చేస్తుందన్నారు. డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త డాక్టర్ జీఏ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 2,500 సత్సంగ్ విహార్‌లు, 15 కోట్ల మంది సభ్యులను సత్సంగ్ విహార్‌లు మంచి మార్గంలో నడిపిస్తున్నాయన్నారు. ప్రజలు ఏ రంగంలో పనిచేస్తున్నప్పటికీ నిజాయితీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అడిషనల్ డీసీపీ సుహాస్‌చతుర్వేది, హైదరాబాద్ సత్సంగ్ విహార్ ఇన్‌చార్జి కార్యదర్శి అశోక్ గిద్వానీ, బారీ, ఆవుల ఉచ్చిరప్ప యాదవ్, చంద్రమౌళి పాల్గొన్నారు. భజనలు, కీర్తనలతో హైదరాబాద్ సత్సంగ్ విహార్ మార్మోగింది.

జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్య


మచ్చ శ్రీకాంత్ (ఫైల్)

బౌద్ధనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య విబేధాలు తలెత్తడంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్ రామాలయం వద్ద నివసించే మచ్చ శ్రీకాంత్(32) ముషీరాబాద్ జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలో రాంనగర్ లక్ష్మమ్మ పార్కు వద్ద పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి ఏడు సంవత్సరాల క్రితం శృతి అనే మహిళతో వివాహం జరిగింది. వీరికి ఐదు సంవత్సరాల పాప ఉంది. భార్య నగరంలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుంది. ఇటీవల శ్రీకాంత్ మద్యానికి బానిసవడంతో భార్యాభర్తలు తరచూ గొడవ పడుతున్నారు. ఈనెల 13న భర్తపై ఉమెన్స్ పోలీస్‌స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసింది. 16వ తేదీన పోలీసులు కౌన్సిలింగ్‌కు రమ్మని శ్రీకాంత్‌కు సమాచారం ఇచ్చారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఇంట్లో సీలింగ్‌ఫ్యాన్‌కు చున్నీతో శ్రీకాంత్ ఉరేసుకున్నాడు. ఫ్యాన్‌కు వేలాడుతున్న శ్రీకాంత్‌ను చూసి తండ్రి కేకలు వేయటంతో స్థానికులు వచ్చి శ్రీకాంత్‌ను కిందకు దింపారు. 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేయగా వారు వచ్చి శ్రీకాంత్ మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రాహుల్‌గాంధీ కోసం ప్రార్థనలు చేయండి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సికింద్రాబాద్, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రజల మధ్య ఐక్యతకు వేలాది కిలోమీటర్లు పాదయాత్ర చేసి, శ్రమించిన రాహుల్‌గాంధీ కోసం ప్రార్థనలు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్రైస్తవులకు పిలుపునిచ్చారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన క్యాండిల్ ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రైస్తవులు ప్రార్థనలు చేసేటప్పుడు రాహుల్ గాంధీ గురించి ప్రార్థించాలని కోరారు. రాష్ట్రంలోని క్రైస్తవులకు కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషిచేస్తుందన్నారు. ప్రార్థనల్లో మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి 19వ తేదీ వరకు సీఎం కప్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి గోపాల్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో యోగా, చెస్, జూడో, హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. కీసర ఓఆర్‌ఆర్ ప్రాంతంలో సైక్లింగ్, లాలాగూడలో బాక్సింగ్ సెలక్షన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 27 నుంచి జనవరి 2 వరకు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, 10వ తరగతి మెమో, రెండు పాస్ ఫొటోలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9912770801, 7660919518 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

40 శాతమే హాజరు


కూకట్‌పల్లిలోని గ్రూప్-2 పరీక్ష కేంద్రం ఎదుట అభ్యర్థులు

(5వ పేజీ తరువాయి)

శాతం) హాజరుకాగా.. 29,133 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో మొత్తం 56,883 అభ్యర్థులకు 45 శాతం మంది, మేడ్చల్ జిల్లాలో 72,999 మందికి 48 శాతం మంది హాజరయ్యారు.

పలువురు అభ్యర్థులకు నిరాశ

హైదరాబాద్ జిల్లాలో 101, మేడ్చల్‌లో 116, రంగారెడ్డి జిల్లాలో 90 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు టీజీపీఎస్సీ అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగారు. హైదరాబాద్ జిల్లాలో 693 మంది రీజనల్ కో-ఆర్డినేటర్లు, జాయింట్ రూట్ ఆఫీసర్లు, అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించారు. పరీక్షల నిర్వహణపై ఉన్నతాధికారులు వారికి అవగాహన తరగతులు నిర్వహించడంతో సమన్వయంతో పనిచేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు అభ్యర్థులు ఉరుకులు, పరుగులు పెట్టారు. చాలా మంది పరీక్షకు 2 గంటల ముందే కేంద్రాల వద్దకు చేరుకోగా.. కొంతమంది షెడ్యూల్ టైమ్‌కు వచ్చి హైరానా పడ్డారు. హయత్‌నగర్‌లో జీ-స్కూల్ సెంటర్ వద్దకు 9.30 గంటల తర్వాత వచ్చిన ముగ్గురిని వెనక్కి పంపారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని న్యూ నోబుల్ డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన మహబూబ్‌నగర్ అభ్యర్థి సురేష్, అచ్చంపేటకు చెందిన అరుణ, ప్రశాంత్‌తోపాటు మరో ఇద్దరిని అనుమతించలేదు. పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని వారు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో వాగ్వాదానికి దిగారు. రామంతాపూర్ వాగ్దేవి కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి ఓ మహిళా అభ్యర్థి ఉదయం 9.50 గంటలకు రాగా పోలీసులు అనుమతించకపోవడంతో వెనుదిరిగారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని శ్రీహిందు ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌కు ఆలస్యంగా వచ్చిన ఆరుగురు అభ్యర్థులను లోపలికి అనుమతించలేదు. గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన 8 మందిని వెనక్కి పంపించారు. మేడ్చల్ జిల్లా కీసరలోని ఓ పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అభ్యర్థినిని అనుమతించలేదు. ఇబ్రహీంపట్నం వినోభానగర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు వెళ్లేందుకు బస్సు దిగి ఇబ్బందులు పడుతున్న ఆపరేషన్ అయిన మహిళా అభ్యర్థిని గమనించిన ఏసీపీ కేపీవీ రాజు తన వాహనంలో పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు.

కలెక్టర్ సందర్శన

మెహిదీపట్నంలోని సంతోష్‌నగర్ సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్ష ముగిసిన తర్వాత జవాబు(ఓఎంఆర్) పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కాలేజీ ప్రిన్సిపాల్ విజయరాణి, పోలీసు అధికారులున్నారు.


ఉస్మానియా యూనివర్సిటీ పరీక్ష కేంద్రం వద్ద ఓ అభ్యర్థిని చిన్నారితో ఆడుకుంటున్న కానిస్టేబుల్

అన్నీ కల్తీ

(5వ పేజీ తరువాయి)



కందిపప్పు

కల్తీ చేసే పదార్థాలు: కేసరి దాల్

ఆరోగ్య సమస్య: తరచూ తింటే పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది.

కల్తీ అయినట్లు తెలుసుకునేదెలా: కల్తీ అయిన కందిపప్పును జాగ్రత్తగా గమనిస్తే కందిపప్పు ఆకారం గుండ్రంగా మందంగా ఉంటుంది. కేసరి పప్పు ఆకారం షేప్‌లెస్‌గా, పలుచగా ఉంటుంది.

పాలు



కలిపే పదార్థాలు: బియ్యం పిండి, గంజి

సమస్య: ఇలాంటి పాలలో పోషక విలువలు ఉండవు. తాగితే కడుపు భారంగా ఉంటుంది.

కల్తీ అయినట్లు తెలుసుకునేదెలా: పాలను చిన్న గిన్నెలో వేడి చేసి చల్లార్చి దానికి 4 లేదా 5 చుక్కల అయోడిన్ కలపాలి. నీలం రంగులో మారితే కల్తీ జరిగినట్లుగా గుర్తించాలి.

కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

ఆహారాన్ని కల్తీ చేయడం క్షమించరాని నేరం. కల్తీ కారణంగా కొన్ని సందర్భాల్లో ప్రాణహాని జరిగే అవకాశం ఉంటుంది. గత ఏడాది 33 కేసులు నమోదు చేశాం. ఈ ఏడాది నాలుగు నెలల్లో కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ పరిధిలో 3 కేసులు నమోదు చేశాం. కల్తీపై ప్రత్యేక విభాగం నిఘా పెడుతుంది. కల్తీ జరిగినట్లు గుర్తిస్తే 7995085349 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వండి. శాంపిల్స్ సేకరించి నాచారంలోని స్టేట్ ఫుడ్ లేబొరేటరీకి పంపించి కల్తీ జరిగిందా, లేదా పరీక్షలు నిర్వహిస్తాం. ఆహార పదార్థాలను కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

\- బి. పవన్‌కుమార్, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్, కూకట్‌పల్లి, మూసాపేట సర్కిల్స్

స్టేషన్ ఆవరణలోనే చలికి వణుకుతూ..

వణికించే చలిలోనూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఆదివారం అర్ధరాత్రి పడిగాపులు కాస్తున్న రైలు ప్రయాణికులు. సోమవారం పొద్దున్నే రైలు ఎక్కాల్సిన ప్రయాణికులను లోనికి అనుమతించకపోవడంతో ఆరుబయటే ఇలా నిద్రిస్తున్నారు.



బుద్వేల్‌లో ఎస్‌బీఐ ఖోఖో జట్ల ప్రాక్టీస్



ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ ఖోఖో టీమ్

రాజేంద్రనగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ ఖోఖో మహిళలు, పురుషుల జట్లు ఆదివారం బుద్వేల్ ఆదర్శ విద్యాలయం హైస్కూల్ మైదానంలో ఖోఖో పోటీల్లో తలపడ్డారు. ఎస్‌బీఐ మొదటి సారిగా డిసెంబరు 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కోల్‌కతాలో ఆల్ ఇండియా ఇంటర్ సర్కిల్ ఖోఖో టోర్నమెంట్ నిర్వహిస్తోంది. దీనికి సంబంధించి ఆదివారం తెలంగాణ రాష్ట్ర జట్లు(హైదరాబాద్ సర్కిల్)ఆదర్శ విద్యాలయ గ్రౌండ్స్‌లో ప్రాక్టీస్ మ్యాచ్‌లో తలపడ్డాయి. కార్యక్రమంలో ఎస్‌బీఐ స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనివాస్ నాయుడు, ఆదర్శ విద్యాలయం కరస్పాండెంట్ జి.సునంద విజయ్‌కుమార్, హైదరాబాద్ సర్కిల్ ఖోఖో కోచ్ ఎం.ప్రభాకర్ పాల్గొన్నారు. ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ తరఫున తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న పురుషుల ఖోఖో జట్టుకు రతన్‌రాథోడ్, మహిళల జట్టుకు శైలజ కెప్టెన్లుగా వ్యవహరిస్తున్నారు.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వర్ధంతి



సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చౌరస్తాలో ఆదివారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 74వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సేవలను కొనియాడారు. నిజాం నవాబుల ఆధీనంలో ఉన్న హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేయడానికి ధైర్యంగా పోరాడిన మహనీయుడు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని గుర్తు చేసుకున్నారు. భారత దేశ తొలి హోంశాఖమంత్రిగా ఉన్న సర్దార్ వల్లభాయి పటేల్ దేశం కోసం వీరోచితంగా పోరాడిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్, బీజేపీ నాయకులు నారగూడెం మల్లారెడ్డి, ఎం.కొమురయ్య, షాబాద విజయ్‌కుమార్, సులిగె వెంకటేశ్, నల్లింగ్ రమేశ్, రాచూరి రాజశేఖర్, ఎస్.జగన్, సుదాకర్‌రెడ్డి, రాజు పహిల్వాన్ తదితరులు పాల్గొన్నారు.



● సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్ రావు, కార్యదర్శి మనీలాల్ షా, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కిషన్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.
- అఫ్జల్‌గంజ్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి)



టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ బాధ్యతలు చేపట్టి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం గాంధీభవన్‌లో ఓ కార్యక్రమం చేపట్టారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకొన్నారు. కార్యక్రమంలో నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ రియాజ్, నాయకులు పాల్గొన్నారు.
- అఫ్జల్‌గంజ్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి)


టీడీపీ సభ్యత్వ నమోదు



టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నందమూరి సుహాసిని

నార్సింగ్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మణికొండ మర్రిచెట్టు చౌరస్తా వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాకి నందమూరి సుహాసిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సుహాసిని సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. రానున్న రోజుల్లో తెలంగాణలో టీడీపీ ప్రభుత్వం బలపడుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుహాసినిని సత్కరించారు.

వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం



క్లినిక్ ప్రారంభోత్సవంలో ఫౌండేషన్ ఎండీ డాక్టర్ గాంధీ పీసీ కాజ, సీడీఎఫ్‌డీ మాజీ డైరెక్టర్ డాక్టర్ తంగరాజ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జినోమ్ ఫౌండేషన్ తన మొదటి వెల్‌నెస్ క్లినిక్‌ను మేడిపల్లిలో ప్రారంభించింది. ఈ సందర్భంగా జినోమ్ ఫౌండేషన్ ఎండీ డాక్టర్ గాంధీ పీసీ కాజ మాట్లాడుతూ.. నగరంలో వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ క్లినిక్‌లో ఆయుర్వేద, అల్లోపతి, నేచురోపతి, హోమియోపతి వైద్య విధానాల్లో చికిత్స అందిస్తామన్నారు. అంతేకాకుండా జెనిటిక్స్, న్యూట్రీషనల్ జినోమిక్స్, కేన్సర్ జెనిటిక్స్, నాడీ సంబంధిత సమస్యలు, గట్ మైక్రోబియమ్‌లపై పరిశోధనలు చేయడంతోపాటు పలు ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు కనుగొనే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా జినోమ్ ఫౌండేషన్ ఫౌండర్ దివంగత డాక్టర్ లాల్జీ సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీడీఎఫ్‌డీ మాజీ డైరెక్టర్ డాక్టర్ తంగరాజ్, జాతీయ ఆంత్రోపాలజీ శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ రావు వడ్లమూడి, ఉస్మానియా వర్సిటీ జెనిటిక్స్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ సంధ్య, నేచురోపతి స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ పి.ప్రతీక్ రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ వైద్యులు డాక్టర్ కె.రాజేశ్వరరావు, సీసీఎంబీ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ నసీరుద్దీన్, డాక్టర్ సుగుణాకర్ పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లు



శంషీర్‌గంజ్- రాజన్నబావి రోడ్డు

- పాతబస్తీల్లో పరిష్కారం కాని సమస్యలు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు
- మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చాంద్రాయణగుట్ట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని పలు బస్తీల్లో ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. దీనికితోడు వీధిదీపాలు కూడా వెలగకపోవడంతో వాహనదారులు రోడ్లపై అదుపుతప్పి ప్రమాదాలకు గురువుతున్నారు. ఉప్పుగూడ, లలితాబాగ్, గౌలిపురా, కందికల్‌గేట్, ఆలియాబాద్, రాజన్నబావి, శంషీర్‌



గౌలిపురా మార్కెట్ లలితాబాగ్ రోడ్డు

గంజ్, జంగమ్మెట్, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోతోందని ప్రజలు వాపోతున్నారు. జీహెచ్‌ఎంసీ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా పాతబస్తీలో రోడ్లు బాగుపడడంలేదు.

గ్రేటర్ కమిషనర్ పాతబస్తీలో పర్యటించాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ పాతబస్తీలో పర్యటించి పాతబస్తీని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్లను అభివృద్ధి పరచాలని కోరుతున్నారు. నాసిరకం రోడ్లు వేస్తూ నిధులు దండుకుంటున్న కాంట్రాక్టర్, వారికి అండగా ఉంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. శంషీర్‌గంజ్ యూనియన్ బ్యాంకు నుంచి రాజన్నబావి వరకు సీసీ రోడ్డు గుంతలమయంగా మారి రెండేళ్లు గడుస్తోంది. వినాయక నవరాత్రి ఉత్సవాల సమయంలో ఈ రోడ్డును బాగు చేయాలని భాగ్యనగర్ గణేష్‌ఉత్సవ సమితి, స్థానికులు అప్పటి గ్రేటర్ కమిషర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా అధికారులు సీసీ రోడ్డు వేయడానికి వెనుకడుగు వేస్తున్నారు.

జోనల్ కమిషనర్ పర్యటించినా అదే దుస్థితి

శంషీర్‌గంజ్ రాజన్నబావి రహదారిని దక్షిణ మండలం జోనల్ కమిషనర్ పర్యటించి సుమారు నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆ రోడ్డుకి మరమ్మతులు జరగలేదు. సంబంధిత గుత్తేదారుపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కరువు



పాతనగరం అంటే ప్రభుత్వానికి చిన్నచూపు ఉంది. బల్దియా అధికారులు కేవలం మజ్లిస్ పార్టీ కనుసన్నల్లో పనిచేస్తున్నారు. దక్షిణ మండలం జోనల్ కమిషనర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నిధులు లేవంటూ చెప్పడం.. మజ్లిస్ నాయకులు చెప్పిన పనులకు సాంక్షన్లు ఇవ్వడం పరిపాటిగా మారింది.
- ఆలె జితేంద్ర, మాజీ కార్పొరేటర్

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://https://ejyothy.com/8Ua4mFBలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

పాదయాత్రగా శబరిమలకు వెళ్లొచ్చిన స్వాములకు సన్మానం

రాజేంద్రనగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి నుంచి నవంబరు 6వ తేదీన పాదయాత్రగా శబరిమలకు బయలుదేరి 45 రోజుల పాటు పాదయాత్ర చేసి శబరి మలకు వెళ్లొచ్చిన అయ్యప్ప స్వాములను ఆదివారం మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. సన్మాణం అందుకున్న వారిలో నర్సిరెడ్డి, రమేశ్‌రెడ్డి, కొండల్ ముదిరాజ్, సురేందర్, కిషోర్, వేణుగోపాల్, నాగరాజు ఉన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్

బర్కత్‌పుర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాభివృద్ధి కోసం పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సర్వీసును వెంటనే ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని, పే స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. 20ఏళ్లుగా పాఠశాల విద్యాభివృద్ధికి సమగ్ర శిక్షా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, వారి సేవలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి వారికి న్యాయం చేయాలని కోరా రు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్షలోని అన్ని విభాగాల్లో 1960మంది కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, చాలీచాలని జీతంతో విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి పదేళ్ల అధికారంలో కొనసాగిన కేసీఆర్ ప్రభుత్వం ఏనాడు వీరి సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వారి బాధలను అర్థం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి ఏపీలో సమగ్ర శిక్షా కార్యక్రమం ప్రారంభమైందని ప్రస్తుతం ఏపీలో ఉద్యోగులకు పే స్కేల్ ఇస్తున్నారని తెలంగాణలో కూడా అమలు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. 10లక్షల ఆరోగ్య బీమా పదవి విరమణ పొందిన వారికి 25 లక్షల బెనిఫిట్స్ ఇవ్వాలని, విద్యాశాఖ నియామకాలలో వెయిటేజీ మార్కులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు పి.బడేసాబ్, సాయిబాబా, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శి కె.శ్రీనివాస్, సరితాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నవనీతగౌడ్, కోశాధికారి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఏడాది విజయోత్సవాల్లో కళాకారులను విస్మరించిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాజా పాషా

బర్కత్‌పుర, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది విజయోత్సవాల్లో కళాకారులను విస్మరించిందని దక్కన్ థియేటర్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాజా పాషా ఆరోపించారు. ప్రభుత్వం నిర్వహించిన ఏడాది వేడుకల్లో గుర్తింపు పొందిన కళా సంస్థలకే అవకాశం ఇవ్వకుండా ప్రైవేట్ సంస్థకు అవకాశం ఇచ్చి 40మంది కళాకారులచే వేడుకలు నిర్వహించారని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సంగీత నాటక అకాడమీ చైర్మన్ ఆలేఖ్య పుంజాల గుర్తింపు పొందిన సంస్థలు ప్రాధాన్యం ఇవ్వకుండా బయటి కళాకారులకు పిలిపించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. కేవలం ప్రభుత్వ ఏడాది సాంస్కృతిక కార్యక్రమాలకు కోటి రూపాయలను కేటాయించారని ఒక సంస్థకు చెందిన 40మంది కళాకారులకే ఈ నిధులు కేటాయించడం ఎంత వరకు సమంజసమని ఆరోపించారు. 50 సంస్థలు గుర్తింపు పొందాయని 2,500 కళాకారులు తమకు అవకాశం వస్తుందని ఎదురుచూశారని కానీ నిరాశతో దుఃఖసాగరంలో మునిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద కళాకారులు, నిరుద్యోగులకు అవకాశం ఇస్తే ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే రోజుల్లో ఏ ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించిన గుర్తింపు పొందిన కళాకారులకే అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వంగర ప్రణయ్‌రాజ్, జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న మేకల దామోదర్‌రెడ్డి, వనితారెడ్డి దంపతులు

రాజేంద్రనగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి చైతన్య విలాస్ కాలనీలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 16న సీతారామచంద్ర స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రతం ప్రారంభం కానున్నాయి.

జనవరిలో విశేష పూజలు

జనవరి 5వ తేదీన ఉదయం 9గంటలకు స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 11న కూడారై వ్రత ఫలిత ప్రసాద (108 గంగాళాలతో పరమాన్నం ఆరగింపు) కార్యక్రమం ఉంటుందన్నారు. 13వ తేదీ భోగి సందర్భంగా ఉదయం 9గంటలకు స్వామివారి తిరు కల్యాణమహోత్సవం ఉంటుందన్నారు. 16న ప్రవచనాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. పూర్తి వివరాలకు దేవాలయ కమిటీని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రతినిధులు మహేశ్, రాజేశ్ కుమార్, డాక్టర్ వాసుదేవ్, ఆదర్శ్ శుక్లా, పద్మశ్రీ హాజరైనారు.

అయ్యప్ప మహా పడిపూజ



అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న సామ ఇంద్రపాల్‌రెడ్డి



అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న టీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉప్పర్‌పల్లిలో ఆదివారం జరిగిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. పులిమామిడి సందీప్ గౌడ్ గురు స్వామి 18వ పడి సందర్భంగా ఈ పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో తెలంగాణ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డి, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సామ ఇంద్రపాల్‌రెడ్డి పాల్గొన్నారు. పులిమామిడి కృష్ణాగౌడ్ గురుస్వామి, గురుజాల కృష్ణగౌడ్ గురు స్వాముల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



సీడీని ఆవిష్కరిస్తున్న రమణాచారి

తిరుగీతికలు ఆడియో, వీడియో సీడీ ఆవిష్కరణ

రవీంద్రభారతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భక్తిగీతాలతో సీడీని రూపొందించడం అభినందనీయమని రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ.రమణాచారి అన్నారు. ఆదివా రం రమణాచారి క్యాంప్ ఆఫీస్‌లో సరస్వతీ పుత్ర కళాపీఠం, శ్రీరాగా క్రియేషన్స్ ఆధ్వర్యంలో పుట్టపర్తి నాగపద్మిని రచన చేసి వంశీప్రియ గానం, విష్ణుప్రియ సంగీతం సమకూర్చిన తిరుగీతికలు ఆడియో, వీడియో సీడీ ఆవిష్కరణ సభ జరిగింది. ఈసందర్భంగా రమణాచారి చేతుల మీదుగా సీడీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముగ్గురు మహిళలు కలిసి రూపొందించిన ఈ గీతాలు ప్రేక్షకుల్ని మెప్పిస్తాయని ఆశిద్దామని అన్నారు. చక్కటి గీతాలతో అలరించారని అన్నారు. ఇలాంటి కాంబినేషన్‌లో మరిన్ని సీడీలు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రమేష్, శ్రీదేవి, ంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనంత కవితా లహరి పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వేమూరి రామకృష్ణ శర్మ కవి త్వం భక్తి, ఆధ్యాత్మికం, సామాజిక అంశాలను సమన్వయ పరుస్తూ వ్యక్తీకరించారని ఓయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో తెలుగు భాష చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి వేమూరి అనంత రామకృష్ణశర్మ రచించిన అనంత కవితా లహరి పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమాని కి ముఖ్య అతిథులుగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం సమాజ ప్రగతికి దోహదం చేసేలా ఉందన్నారు. భక్తి, ఆధ్యాత్మిక, సామాజిక అంశాలు ప్రేరేపించేలా ఈ పుస్తకం ఉందన్నారు. తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ మాట్లాడుతూ భాష, భావంలో స్పష్టత ఈ కవిత్వంలో కనిపిస్తుందని అన్నారు. కార్యక్రమంలో డీసీపీ రాందాస్ తేజావత్, రాములు, బాలాచారి, నాశేశ్వరంశంకరం, ప్రముఖ కవయిత్రి రాధాకుసుమ, బడేసాబ్ పాల్గొన్నారు.

‘రచయితలకు భాషపై పట్టు అవసరం’

రవీంద్రభారతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన గ్రంథాల పరిచయ సభ ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా నుడిగుడి, ఒక్కపదం అర్థాలెన్నో పుస్తకాల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త నాళేశ్వరం శంకరం, డా.బిక్కి కృష్ణ, డా.బీరంసుందరరావు, డా.ఎ.కె.ప్రభాకర్ తాడి ప్రకాష్, ముదిగొండ సంతోష్, శాంతి నిర్మల హాజరై పుస్తకాలను సమీక్షించారు. ఎవరూ రాయని విధంగా రాయబడిన తొలి గ్రంథాలైన వీటి విలువను వివరించారు. ఒక్క పదాన్ని తీసుకుని ఆ పదం పదాంశంగా, పదాంతంగా పదాంత ధ్వనిగా ఉన్నప్పుడు మారే పదాలను, వాటి అర్థాలను వివరించడం అభినందనీయమని అన్నారు. భాష మీద రచయిత్రికు ఉన్న పట్టు ఆమె ప్రతి రచనలో తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కార్ల మెకానిక్ షెడ్డులో మంటలు



కార్ల మెకానిక్ షెడ్డులో ఎగిసి పడుతున్న మంటలు

రాజేంద్రనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడలోని ఓ కార్ల మెకానిక్ షెడ్డులో ఆదివారం అనుమానాస్పద స్థితిలో మంటలు చెలరేగాయి. నెక్స్ట్ జేన్ కార్ సర్వీసింగ్ సెంటర్ ఆదివారం కావడంతో మూసి ఉంది. ఆ సర్వీసింగ్ సెంటర్‌లో ఒక్కసారి మంటలు ఎగిసిపడడంతో గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయ త్నం చేశారు. అప్పటికే ఒక కారు పూర్తిగా దహనమైంది. మరికొన్ని కార్లకు మంటలు అంటుకోగా స్థానికులు ఆర్పారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

యాసిడ్ తాగి యువకుడి ఆత్మహత్య



సాయికృష్ణ (ఫైల్)

బిట్స్‌పిలానీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఈవిషాద ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలోని బీజేఆర్ నగర్, జమ్మిగడ్డలో వెంకటేశ్ భార్య, ముగ్గురు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నా డు. ఇతని పెద్ద కుమారుడు సాయికృష్ణ(18) తన చిన్న తమ్ముడు రాకేష్‌తో సెల్‌ఫోన్ విషయమై గొడవపడ్డాడు. ఇది తెలిసి తండ్రి ఏ పనీ చేయకుండా ఇంట్లో తిని కూర్చుంటూ గొడవకు దిగుతున్నావ’ అని పెద్ద కుమారుడిని మందలిచ్చాడు. దీంతో మనస్తాపం చెందిన సాయికృష్ణ శనివారం సాయంత్రం ఇంట్లో బాత్రూమ్‌ను క్లీనింగ్ చేసే యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారతీయులకు రాజ్యాంగమే స్ఫూర్తి

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు



సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

రాంనగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారతీయులు విశ్వమానవులని, వారిని ఒక్కటిగా ఉంచగలిగింది మన రాజ్యాంగమేనని, దానిని కాపాడుకోవడం భారతీయుల తక్షణ కర్తవ్యమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకుడు అక్షయకుమార్‌దత్ సంస్మరణ సభ టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. లౌకికవాది, మానవతావాది, సమతావాది, కులం, మతం, ప్రాంతానికి అతీతంగా సమానత్వం కోరుకున్న వారు విశ్వమానవులన్నారు. ఆ కోవకు చెందిన వ్యక్తి అక్షయ్‌కుమార్ దత్ అన్నారు. మన అస్తిత్వం, భారతీయత, భారతీయులందరికీ సమానమైన హక్కులు ఉండాలన్నారు. అమెరికాలాంటి పెట్టుబడి దేశంలో అమలవుతున్న పౌరసత్వ ప్రాతిపదిక సవరణ చట్టం చేయబోతున్నారని ఆరోపించారు. రాజ్యాంగంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయన్నారు. కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే.. బీజేపీ రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తోందని ఆరోపించారు. ప్రపంచంలో ఎలక్ట్రోల్ డిక్టేటర్‌షిప్ అనే కొత్త సంస్కృతి తెరపైకి వచ్చిందని అది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక కూడా నియంతృత్వానికి దారి తీస్తుందన్నారు. లౌకికవాదం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయం, సామ్యవాదం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మతం వ్యక్తిగతం అని రాజ్యం జోక్యం ఉండ కూడదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారి వ్యవస్థ పట్ల వ్యతిరేకత పెరిగి సామ్యవాద భావనకు మద్దతు పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, నాయకులు మాణిక్‌రెడ్డి, నరహరి, కమలాకుమారి, సింహాచలం, కొండల్‌రావు, పౌరస్పందన వేదిక కార్యదర్శి రాధేశ్యామ్, పద్మశ్రీ, కె.జంగయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా గోమాత మారథాన్



మారథాన్‌లో విజేతలుగా నిలిచిన వారితో నిర్వాహకులు

ఖైరతాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోవును జాతీయ మాతగా ప్రకటించాలనే డిమాండ్‌పై ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశ్యంతో నిర్వహించిన గోమాత 5కే మారథాన్ ఆలోచింపజేసింది. ఆదివారం ఉదయం పీవీ నర్సింహారావు మార్గంలో శ్రీ దక్షిణేశ్వర్ కేదార్‌నాథ్ ట్రస్టు, సర్వదళ గోరక్షమంచ్, దేవభూమి ఉత్తరాఖండ్ సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ గోమాత మారథాన్ జరిగింది. పురుషులు, మహిళలు, పిల్లలు ఇలా మూడు విభాగాలుగా జరిగిన ఈ మారథాన్‌ను గోభక్తులు రామ్‌భాటి, మోహన్‌చౌదరి, మంగళరాం పవార్, హంక్మారాం సొన్పూరా, సోనారాం తిలాయచా, వికాస్‌శర్మ జెండా ఊపి ప్రారంభించారు. మారథాన్‌లో పిల్లల నుంచి 70 సంవత్సరాల వృద్ధుల వరకు ఉత్సాహంగా పాల్గొని గోవును జాతీయ మాతగా ప్రకటించాలని ప్లకార్డులు, గోమాతను ప్రదర్శించే టీషర్టులను ధరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జైపాల్ నయాల్ సనాతనీ మాట్లాడుతూ గోమాత మారథన్‌లో ఐటీ సంస్థల ప్రతినిధులు, మేధావులు, ఆర్మీ, పోలీసులు, న్యాయవాదులు, గోశాలల నిర్వాహకులు దాదాపు 400 మంది స్వచ్ఛందంగా పాల్గొన్నారని తెలిపారు. గోమాతను జాతీయ మాతగా ప్రకటించేవరకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా మద్దతు కూడగడుతామని ఆయన అన్నారు. 3 విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి మెడల్లతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. నిర్వాహకులు సీడీ చావన్, దీప్తి రావత్, ప్రేమరా నయాల్, కవితా నేగి, పుష్ప భద్రీ, దీపా శకర్మ, కమల్ పంత్, ఉషా అగర్వాల్, బలవీర్‌సింగ్ రావత్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా సైక్లోథాన్



జెండా ఊపి సైక్లోథాన్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌సీఎల్ ప్రతినిధులు

రాయదుర్గం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైక్లింగ్ అనేది మానవ సామార్థ్యాన్ని అన్‌లాక్ చేసేందుకు, పట్టణ స్థిరత్వాన్ని పెంచడానికి స్థిరమైన మార్గమని హెచ్‌సీఎల్ గ్రూప్ ప్రెసిడెంట్, స్ట్రాటజీ సుందర్ మహాలింగం అన్నారు. హెచ్‌సీఎల్ సైక్లోథాన్ హైదరాబాద్ మొదటి ఎడిషన్‌ను 1500 మంది సైక్లిస్టులతో ఆదివారం ఉదయం విజయవంతంగా నిర్వహించింది. ఈ సైక్లోథాన్ 23 కిలోమీటర్ల విభాగంలో సుందర్ మహాలింగం పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్‌సీఎల్ సైక్లోథాన్ వృత్తి పరమైన సైక్లిస్టులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు వేదికను అందించటంతో పాటు సైక్లింగ్‌ను ఫిట్నెస్ క్రీడగా స్వీకరించేలా తదుపరి తరాన్ని ప్రోహించేందుకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో సైక్లింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సైక్లోథాన్‌లో 10, 23, 52 కిలోమీటర్ల విభాగాల్లో కోకాపేట్ కూడలి నుంచి కొల్లూరు జంక్షన్ వరకు పలు లూప్‌లలో సైక్లిస్టులు పాల్గొన్నారు. సైక్లోథాన్‌లో గెలుపొందిన మొదటి ముగ్గురు పురుష, స్త్రీ విజేతలకు కలిపి మొత్తం రూ. 33.6 లక్షల ప్రైజ్ పూల్ అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ సంస్థ నుంచి రజత్ చందోలియా, పవన్ వాడపల్లి, శివప్రసాద్, విన్‌సింగ్‌లతో పాటు సంస్థ ఉద్యోగులు, సిబ్బంది, సైక్లిస్టులు పాల్గొన్నారు.



పాల్గొన్న సైక్లిస్టులు

నేషనల్ లా కాలేజీల నుంచి జడ్జిలను ఎంపిక చేసే విధానం రావాలి

● నల్సార్ వర్సిటీ ఉపకులపతి శ్రీకృష్ణదేవరావు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నేషనల్ లా కాలేజీల నుంచి నేరుగా జడ్జిలను ఎంపిక చేసే విధానం రావాలని నల్సార్ యూనివర్సిటీ ఉపకులపతి శ్రీకృష్ణదేవరావు ఆకాంక్షించారు. నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ న్యాయ కళాశాలలో '75 సంవత్సరాల భారతీయ రాజ్యాంగం- గతంలోని సవాళ్లు, భవిష్యత్‌ను ముందుకు నడిపించే మార్గం' అనే అంశంపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ మన రాజ్యాంగంలో న్యాయ కళాశాలల నుంచి న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన నిబంధన ఉన్నా అది అలంకార ప్రాయంగానే ఉందని అన్నారు. ఆల్ ఇండియా జ్యుడీషియల్ సర్వీసెస్ కూడా వెలుగు చూడలేదన్నారు. అదివస్తే న్యాయకళాశాలల నుంచి నేరుగా జిల్లా జడ్జిలు వచ్చే అవకాశాలున్నాయని అన్నారు. చాలా రాష్ట్రాలలో నేషనల్ లా స్కూల్స్ ఉన్నాయని, అయితే వాటికి టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ లాగానే జాతీయ గుర్తింపు ఇవ్వాల్సిన అవసరముందని ఆయన సూచించారు. అనంతరం జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా కేశవ్ మెమోరియల్ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అక్కపెద్ది సెమినార్ నివేదిక సమర్పించారు. ఈ కార్యక్రమంలో కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు జస్టిస్ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు జె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)



రెడ్‌హిల్స్‌లో ధ్వంసమైన వాటర్‌బోర్డు పైపులైన్

ఒక సభ్యుడికి బాడీ కెమెరా ఉంటాయి. వీటితో పాటు జీపీఎస్ ట్రాకింగ్ చేస్తాయి. పని ప్రదేశాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగవద్దనే ఆలోచనతో టీమ్‌లను ఏర్పాటు చేయగా.. ఇటీవల అవి నామమాత్రంగా మారాయి. టీమ్‌లకు డీజిల్ ఖర్చులు తప్ప.. పని ప్రదేశాల్లో కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి వాటర్‌బోర్డు పనుల్లో జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో చేర్చాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఇరుకు గదులతో ఇక్కట్లు

సొంత భవనం లేక వైద్య, ఆరోగ్య శాఖ కార్యకలాపాలకు ఇబ్బందులు ● అమీర్‌పేటలో ప్రతిపాదనలకే కొత్త భవన నిర్మాణం పరిమితం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంఅండ్‌హెచ్‌ఓ) కార్యకలాపాలను ఇరుకు గదుల్లోనే నిర్వహిస్తున్నారు. దాదాపు పది విభాగాల వరకు ఉండే డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యక్రమాలకు స్థలం సరిపోకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ వర్కర్ల సమావేశాలు, అధికారుల సమీక్షా సమావేశాలు వంటి కార్యక్రమాలను ఇరుకు గదుల్లోనే నిర్వహిస్తున్నారు.



సొంత భవనం లేక

డీఎంఅండ్‌హెచ్‌ఓకు ఇప్పటి వరకూ సొంత భవనం లేదు. దీంతో ఆ శాఖ వ్యవహారాలు చూసే అధికార యంత్రాంగానికి ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో సొంత భవనం కోసం కొంత ప్రయత్నం జరిగినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదు.

అక్కడి నుంచి ఇక్కడకు..

మొదట్లో డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యక్రమాలు జీహెచ్‌ఎంసీ ప్రధాన భవనంలో కొనసాగాయి. అక్కడ అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ జీహెచ్‌ఎంసీ కార్యకలపాల విస్తరణలో భాగంగా ట్యాంక్‌బండ్ సమీపంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓను బుద్ధభవన్‌కు మార్చారు. బుద్ధభవన్‌లో కొద్దికాలం పనులు యథావిధిగా కొనసాగాయి. అయితే, ఈ భవనం తమకే కావాలని మహిళా కమిషన్ అధికారులు పట్టుబట్టారు. దీంతో బుద్ధభవన్ నుంచి డీఎంఅండ్‌హెచ్‌ఓను సికింద్రాబాద్‌లోని హరిహర కళభవన్ వద్ద గల జీహెచ్‌ఎంసీకి సంబంధించిన మరో భవనంలోకి మార్చారు.

ప్రతిపాదనలకే పరిమితం

డీఎంహెచ్‌ఓకు అమీర్‌పేటలో కొత్త భవనం నిర్మించాలని అధికారులు యోచించారు. అమీర్‌పేటలో దాదాపు రెండు ఎకరాల స్థలంలో సివిల్ డిస్పెన్సరీ ఉంది. ఇదే ఆస్పత్రి స్థలంలో డీఎంహెచ్‌ఓ భవనం కూడా నిర్మించాలనే ఆలోచన అధికారులకు వచ్చింది. ఆ స్థలంలో 50 పడకలతో సివిల్ డిస్పెన్సరీ, 50 శాతం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయాన్ని నిర్మించేందుకు అప్పట్లో ప్రతిపాదనను ఉన్నతాధికారులకు పంపించారు. అయితే, 50 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేసి వైద్య సేవలు కూడా అందిస్తున్నారు. కానీ, డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి మాత్రం మోక్షం లభించలేదు.

సీడీఎంకు 'అరుదైన' అవార్డు

20న ప్రదానం చేయనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



సైనిక్‌పురిలోని సీడీఎం కాలేజీ

అల్వాల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సైనిక్‌పురిలోని సీడీఎం కాలేజీకి మొదటిసారి 'కలర్స్ ప్రజెంటేషన్' అవార్డు లభించింది. ఈనెల 20న ఉదయం 11గంటలకు సైనిక్‌పురిలోని సీడీఎం కాలేజీలో నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరై కాలేజీకి 'కలర్స్ ప్రజెంటేషన్' అవార్డు ప్రదానం చేస్తారని కాలేజీ నిర్వహకులు తెలిపారు. ఈ అవార్డును 'అరుదైన చిహ్నం', 'నిషాన్'గా కూడా పేర్కొంటారని తెలిపారు.

1970లో సైనిక్‌పురిలో..

కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)ను 1970లో సైనిక్‌పురిలో స్థాపించారు. త్రివిధ దళాలకు చెందిన అధికారులకు సాంకేతికపరమైన శిక్షణ అందించడంతో పాటు దేశ రక్షణకు భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ప్రత్యేక శిక్షణ అందిస్తారు. దేశానికి సంబంధించిన అధికారులతో పాటు మిత్రదేశాలకు చెందిన అధికారులు కూడా ఇక్కడ ప్రత్యేక శిక్షణ పొందుతుంటారు. దేశ రక్షణ కోసం వ్యూహాలను రచించడం కోసం కోర్సులను ఈ కళాశాల ప్రవేశపెడుతుంది. సైనిక అభివృద్ధికి సీడీఎం పునాదిగా పనిచేసే సంస్థగా మారింది. భారత సాయుధ దళాల్లో నాయకత్వం, నిర్వహణ నైపుణ్యాన్ని అందిస్తుంది. బ్రిగేడియర్ వి.ధ్రువ సీడీఎంకు మొదటి కమాండెంట్‌గా కీలకమైన బాధ్యతలను నిర్వహించారు. ప్రపంచీకరణ, సాంకేతిక పురోగతి, పెరుగుతున్న ప్రాబల్యం బహుళ డొమైన్(రంగాల్లో) సాంప్రదాయేతర భద్రతా సంబంధించిన పాఠ్యాంశాలను సీడీఎంలో చేర్చారు. రక్షణ విద్యలో గ్లోబల్ లీడర్‌గా సీడీఎం నేడు దేశంలో వృత్తిపరమైన సైనిక విద్యలో అగ్రగామిగా ఉంది. హయ్యర్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్స్, సీనియర్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్స్‌తో పాటు వివిధ కోర్సులను కూడా నిర్వహిస్తుంది. పురాతన భారతీయ విజ్ఞాన వ్యవస్థపై అధ్యయనాన్ని పోత్సహించడం కూడా ప్రారంభించింది.



ఎల్‌డీసీ ఎక్సలెన్స్ అవార్డును అందుకుంటున్న టీజీ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్

టీజీ ట్రాన్స్‌కోకు ఎల్‌డీసీ 'ఎక్సలెన్స్' అవార్డు

● అభినందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీజీ ట్రాన్స్‌కో 'ఎల్‌డీసీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డు-2024'కు అందుకుంది. మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఐఐటీలో శనివారం నిర్వహించిన పవర్ సిస్టమ్ సదస్సులో సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) చైర్‌పర్సన్ ఘన్ శ్యాంప్రసాద్, గ్రిడ్ ఇండియా సీఎండీ నర్సింహన్ చేతులమీదుగా టీజీ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు దక్కించుకున్న విద్యుత్ సంస్థలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం అభినందించారు. గ్రిడ్ క్రమశిక్షణతో పాటు పవర్ సిస్టం ఎక్సలెన్స్ ఆపరేషన్‌కు తగిన గుర్తింపునివ్వడంతో ఈ గౌరవం దక్కిందన్నారు. టీజీట్రాన్స్‌కో, టీజీజెన్‌కోతో టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీల సమష్టి కృషితో ఈ అవార్డు లభించిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి పెద్ద సంస్థలు పాల్గొన్నా ఎస్‌ఎల్‌డీసీల విభాగంలో తెలంగాణ రాష్ట్రం ఈ అవార్డును దక్కించుకోవడం అభినందనీయమని సిబ్బందిని ప్రశంసించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆస్పత్రి చైర్మన్ రవీందర్‌రావు, శివరాత్రి దేశికేంద్ర మహాస్వామీజీ, జస్టిస్ ఆర్.దేవదాస్ తదితరులు

ఏటా 5లక్షల కొత్త రోగులకు డయాలసిస్


● 20 వేల మందికి కిడ్నీ మార్పిడిలు

● యశోద ఆస్పత్రుల గ్రూప్ చైర్మన్ రవీందర్‌రావు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మన దేశంలో ప్రతీ ఏడాది దాదాపు 5లక్షల మంది కొత్త కిడ్నీ రోగులు డయాలసిస్ దశకు చేరుకుంటున్నారని, వీరిలో కేవలం 20వేల మందికి మాత్రమే కిడ్నీ మార్పిడి జరుగుతుందని, మిగిలిన వారు డయాలసిస్‌లో ఉండి, మార్పిడి కోసం నిరీక్షిస్తున్నారని యశోద ఆస్పత్రుల గ్రూప్ చైర్మన్ గోరుకంటి రవీందర్‌రావు తెలిపారు. హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో క్రానిక్ కిడ్నీ డిసీజ్(సీకేడీ) క్లినిక్‌ను ఆదివారం శివరాత్రి దేశికేంద్ర మహాస్వామీజీతో కలిసి గోరుకంటి రవీందర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.దేవదాస్, రాజ్యసభ సభ్యులు రేణుకాచౌదరి, గోరుకంటి పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలోని జనాభాలో 20 శాతం కంటే ఎక్కువమందిలో క్రానిక్ కిడ్నీ డిసీజ్ తీవ్రత పెరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయని వివరించారు. సీనియర్ నెఫ్రాలజిస్ట్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి మాట్లాడుతూ క్రానిక్ కిడ్నీ డిసీజ్ ప్రమాదంలో ఉన్న వారందరూ తమ పేరును క్రానిక్ కిడ్నీ డిసీజ్ క్లినిక్‌లో నమోదు చేసుకోవచ్చునని సూచించారు. సీనియర్ నెఫ్రాలజిస్టులు పోషకాహార నిపుణులు జబ్బు నివారణకు సలహా ఇస్తారని ఆయన తెలిపారు.

● సంపుటాల ఆవిష్కరణ

కేఎస్ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కొండపల్లి సీతారామయ్య సంపూర్ణ రచనల్లోని రెండు సంపుటాల ఆవిష్కరణ సభలో సీహెచ్ శివారెడ్డి అనుభవాలు 'వెంటాడే జ్ఞాపకాలు' - తిరుపతి రాడికల్ విద్యార్థి ప్రయాణం పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. సీపీఐ (ఎం.ఎల్ లిబరేషన్) నేత మూర్తి తదితరులు పాల్గొన్నారు.



- హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి)

తనిఖీల్లేవ్

(5వ పేజీ తరువాయి)

ఎలాంటి అనుమతి లేదు. ఇతర రాష్ట్రానికి అనుబంధంగా ఏర్పాటు చేసి.. విద్యార్థులకు ఐఐటీ, నీట్‌లో ర్యాంకులు తీసుకొచ్చేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని నమ్మించి రూ. లక్షలు గుంజుతున్నారు. ఫస్టియర్, సెకండియర్ డేస్కాలర్‌తో కలిపి రూ.2.40 లక్షలు వసూలు చేస్తున్నారు. రెసిడెన్షియల్‌లో రూ.3.60 లక్షలు తీసుకుంటున్నారు. దోమలగూడలోని ఇందిరాపార్కు సమీపంలో ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సుల పేరుతో మరో విద్యాసంస్థ పెద్ద ఎత్తున దోచుకుంటుంది. ఈ కాలేజీకి సంబంధించిన మెయిన్ బ్రాంచి శంషాబాద్‌లో ఉంది. అనుమతి లేకున్నా.. దానికి అనుబంధంగా నడిపిస్తూ అక్రమాలకు పాల్పడుతోంది. ఇక్కడ ఒక్కో విద్యార్థికి రెండు సంవత్సరాలకు రూ.4 లక్షలు వసూలు చేస్తుండడం గమనార్హం. గ్రేటర్‌లోని చాలా ప్రాంతాల్లో అనుమతులు లేకుండా వందలాది కాలేజీలు కొనసాగుతున్నాయి.

చదువు ఒక కాలేజీలో..

సర్టిఫికెట్లు మరో కాలేజీ నుంచి

గ్రేటర్ వ్యాప్తంగా కొన్నేళ్లుగా అనుమతి లేకుండా వందలాది కాలేజీలు నడుస్తున్నాయి. ఆకర్షణీయమైన ప్రకటనలతో విద్యాసంస్థల నిర్వాహకులు తల్లిదండ్రులను మోసగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. అడ్మిషన్లు తీసుకున్న తర్వాత ఇతర కాలేజీల నుంచి ఇంటర్ బోర్డుకు విద్యార్థుల నామినల్ రోల్స్‌ను పంపిస్తున్నారు. ఇంటర్ పూర్తయిన తర్వాత తాము చదువుకున్న కాలేజీ నుంచి కాకుండా ఇతర కాలేజీ నుంచి సర్టిఫికెట్లు వస్తుండడంతో విద్యార్థులు ఆశ్చర్యపోతున్నారు. దీనిపై ఎవరైనా నిలదీస్తే.. టీసీలు, బోనఫైడ్ సర్టిఫికెట్లు ఇచ్చే సమయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

తనిఖీలు మరిచిన అధికారులు

అనుమతి లేకుండా నడుస్తున్న కాలేజీలను అరికట్టాల్సిన ఇంటర్‌బోర్డు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హిమాయత్‌నగర్, బాగ్‌అంబర్‌పేట్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న రెండు కాలేజీలపై విద్యార్థి సంఘాల నాయకులు ఇంటర్ విద్యాధికారులకు కొంతకాలంగా ఫిర్యాదు చేస్తున్నా ఇప్పటివరకు తనిఖీ చేయలేదని తెలుస్తోంది. ఆయా విద్యాసంస్థల నిర్వాహకులు ఇస్తున్న ముడుపులకు ఆశపడి కాలేజీలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

భారీగా బందోబస్తు.. ట్రాఫిక్ మళ్లింపులు

బిగ్‌బాస్ గ్రాండ్ ఫినాలే నేపథ్యంలో పోలీసుల చర్యలు ● ర్యాలీ, ఊరేగింపు నిర్వహిస్తే కఠిన చర్యలంటూ హెచ్చరికలు



అన్నపూర్ణ స్టూడియో వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బిగ్‌బాస్ సీజన్-8 గ్రాండ్ ఫినాలే సందర్భంగా బంజారాహిల్స్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ మళ్లింపులు చేశారు. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రెడ్డి, డీఐ మధుసూదన్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. కాగా, వెస్టుజోన్ డీసీపీ విజయ్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. కార్యక్రమం అనంతరం ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించొద్దని డీసీపీ ముందుగానే నిర్వాహకులను హెచ్చరించినట్లు తెలిసింది. పోలీసుల ఆదేశాలు ఉల్లంఘించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా బిగ్‌బాస్ నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని డీసీపీ స్పష్టం చేశారు. గతేడాది బిగ్‌బాస్ సీజన్-7 గ్రాండ్ ఫినాలే రోజున విజేతగా నిలిచిన పల్లవి ప్రశాంత్.. స్టూడియో నుంచి బయటకు రాగానే అభిమానులు అత్యుత్సాహంతో వందలాదిగా చొచ్చుకు వచ్చారు. తోటి కంటెస్టుల మీదకు దూసుకెళ్లారు. ఈ క్రమంలో పరిస్థితి అదుపు తప్పింది. దాడులు ప్రతి దాడుల వరకు వెళ్లింది. ఈ గందరగోళంలో కొంతమంది పోకిరీలు, ఆకతాయిలు ఏడు ఆర్టీసీ బస్సులు, పలు కార్లు ధ్వంసం చేశారు. అనంతరం జరిగిన పరిణామాల్లో విజేతగా నిలిచిన పల్లవి ప్రశాంత్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ సారి అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా వందలమంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు





కొంపల్లిలోని న్యూలైఫ్ అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్

నల్లని శిరోజాలకు జోజోబా నూనె

శిరోజాల సమస్యలను నివారించడంలో జోజోబా నూనె అద్భుతంగా పనిచేస్తుంది. ఈ నూనెలో బి, ఇ విటమిన్లు; జింక్, కాపర్ మినరల్స్; ఫాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. మాడు మీద ఈ నూనెతో మెల్లగా మర్దన చేస్తే వెంట్రుకల కుదుళ్లు గట్టిపడతాయి. తలమీద ఉన్న చర్మానికి రక్తప్రసరణ జరిగి శిరోజాలు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి. మాడు మీద సెబమ్ ఉత్పత్తి నియంత్రణలో ఉండి వెంట్రుకలు జిడ్డుగా మారవు. జోజోబా నూనె అందించే మరికొన్ని ప్రయోజనాలు...

ఇ-విటమిన్‌తో: ఇ విటమిన్‌లో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి శిరోజాలు ఆరోగ్యంగా పెరిగేందుకు దోహదం చేస్తాయి. రెండు ఇ విటమిన్ ట్యాబ్లెట్స్ నుంచి నూనెను తీసి ఒక చిన్న గిన్నెలో వేయాలి. దీనికి రెండు చెంచాల జోజోబా నూనె కలపాలి. ఈ మిశ్రమాన్ని అరచేతుల్లోకి తీసుకుని మాడు మీద గుండ్రంగా రాస్తూ మర్దన చేయాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీళ్లు, గాఢత లేని షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే వెంట్రుకలు రాలడం తగ్గుతుంది.

తేనెతో: తేనెలో అధికంగా తేమతోపాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి మాడుమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఒక గిన్నెలో రెండు చెంచాల జోజోబా నూనె, ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలంతా పట్టించాలి. తరవాత షవర్ క్యాప్‌తో మూసివేయాలి. నలభై నిమిషాల తరవాత తలస్నానం



చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే చుండ్రు సమస్యలు రాకుండా ఉంటాయి. శిరోజాలు పొడవుగా పెరుగుతాయి.

కొబ్బరినూనెతో: ఒక గిన్నెలో రెండు చెంచాల జోజోబా నూనె, ఒక చెంచా కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి. రాత్రి పడుకునేముందు ఈ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. పది నిమిషాలు మాడు మీద మసాజ్ చేయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తూ ఉంటే వెంట్రుకల కుదుళ్లకు రక్తప్రసరణ జరిగి అవి గట్టిపడతాయి. శిరోజాలు నల్లగా మెరుస్తుంటాయి. వెంట్రుకల చివర్లు పగలడం తగ్గుతుంది.

కలబంద గుజ్జుతో: కలబంద గుజ్జు మంచి ఆయుర్వేద ఔషధం. ఇది తలలో చుండ్రు, కురుపులు రాకుండా చేస్తుంది. ఒక గిన్నెలో రెండు చెంచాల కలబంద గుజ్జు, రెండు చెంచాల జోజోబా నూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వెంట్రుకల కుదుళ్లకు పట్టించాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే మాడు మీద పీహెచ్ స్థాయి తటస్థంగా మారుతుంది. వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. బట్టతల సమస్య తీరుతుంది. వెంట్రుకలు తెల్లబడకుండా ఉంటాయి.



మా త్యాగాల కంటే

నితీష్ శ్రమే ఎక్కువ

స్టార్ బ్యాట్సమెన్ విఫలమైన చోట... అలవోకగా అతడు బౌండరీలు బాదాడు. బౌన్సీ పిచ్‌లు అయినా... బౌలర్ ఎవరైనా... సొగసైన ఆటతో ఆకట్టుకున్నాడు. అతడి విజయం వెనుక తల్లి అలుపెరుగని కృషి ఉంది. ఆమె నింపిన ఆత్మవిశ్వాసం ఉంది. ఆస్ట్రేలియా పర్యటనతో భారత టెస్టు జట్టులోకి వచ్చి... అరంగేట్రం సిరీస్‌లోనే అద్భుతంగా రాణిస్తున్న ఆల్‌రౌండర్ నితీష్‌కుమార్‌రెడ్డి తల్లి మానసతో 'నవ్య' ప్రత్యేక ఇంటర్వ్యూ.

"చిన్నప్పుడు నితీష్ యానిమేషన్ వీడియోలు, సినిమాలు విపరీతంగా చూసేవాడు. ఆ సమయంలో 'వీడు క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకొంటాడా' అనే సందేహం కలిగేది. అంతేకాదు... బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌పై కూడా దృష్టి పెట్టినప్పుడు... 'ఆల్‌రౌండర్‌గా వాడి కెరీర్ ఎలా ఉంటుందో'నని భయమేసింది. కానీ ప్రస్తుత ఆస్ట్రేలియా సిరీస్‌లో నితీష్ ఆటను ఉద్దండులు సైతం మెచ్చుకొంటుంటే మనసు ఉప్పొంగుతోంది. విశాఖపట్టణం 'హిందుస్థాన్ జింక్ స్కూల్‌'లో మూడో తరగతి చదువుతున్నప్పుడే వాడికి క్రికెట్ మీద మోజు మొదలైంది. రోజూ బ్యాట్ పట్టుకుని గ్రౌండ్‌కు వెళ్లేవాడు. మావారు ముత్యాలరెడ్డికి కూడా ఆటలపై ఆసక్తి ఉండడంతో కొడుకును మంచి క్రికెటర్‌ను చేయాలనుకున్నారు. దగ్గరుండి గ్రౌండ్‌కు తీసుకువెళ్లేవారు. క్రికెట్‌లో లీనమై చదువును నిర్లక్ష్యం చేస్తాడేమోనని అనిపించేది నాకు. అయితే కోచ్‌లందరూ నితీష్ ఆటను మెచ్చుకుంటుంటే ఆనందంగా ఉండేది. 'భవిష్యత్తులో మంచి క్రికెటర్ అవుతాడ'ని వాళ్లు ఎప్పుడూ అంటుండేవారు.

ఆర్థికంగా ఇబ్బందులు పడినా...

మావారిది 'హిందుస్తాన్ జింక్‌'లో ఉద్యోగం. ఆర్థిక సమస్యలు లేకుండా జీవితం సాఫీగానే సాగిపోయేది. అయితే నితీష్ క్రికెట్ కెరీర్‌ను బాగా తీర్చిదిద్దాలనే తపనతో ఆయన ఉద్యోగానికి రాజీనామా చేశారు. దాంతో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. అయినా నితీష్ కెరీర్‌కు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. దానికోసం ఆటుపోట్లు ఎన్నిటినో తట్టుకుంటూ ముందుకుసాగాం. కాస్త పెద్దయ్యాక మా అబ్బాయికి మేము పడుతున్న కష్టాలు అర్థమయ్యాయి. కెరీర్‌పై మరింత శ్రద్ధ పెట్టాడు. కఠోర సాధన చేశాడు. వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదల వాడిలో ఉంది. దాదాపు ప్రతి మ్యాచ్‌లో పరుగుల వరదతో సెలెక్టర్లను, కోచ్‌లను ఆకర్షించాడు. నితీష్ కోసం మేము చేసిన త్యాగాల కంటే... మా నమ్మకాన్ని నిలబెట్టడానికి వాడు పడిన శ్రమే ఎక్కువ.

అకాడమీలో వదల్లేకపోయాం...

కడప 'ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్' (ఏసీఏ) అకాడమీలో నితీష్‌కు అవకాశం వచ్చింది. అక్కడైతే వాడి ఆట తీరు మరింత మెరుగుపడుతుందని, కెరీర్ బాగుంటుందని చెప్పడంతో కడప తీసుకువెళ్లాం. అయితే అకాడమీలో వాడిని వదిలిపెట్టేందుకు మాకు మనసు రాలేదు. రెండు రోజులు అక్కడే ఉండి ప్రాక్టీస్ సెషన్‌కు బస్సులో వెళుతున్నప్పుడు చూసేవాళ్లం. నేనైతే తిరిగి రాలేకపోయాను. అక్కడ సాధన చేస్తే నితీష్ కెరీర్ బాగుంటుందని చెప్పి మావారు నన్ను ఓదార్చారు.

నాన్న పేరు చెబితే...

నాన్నంటే నితీష్‌కు చిన్నతనం నుంచి భయం. భోజనం తినేందుకు మారాం చేస్తే... 'నాన్న వస్తున్నార'ని చెప్పి తినిపించేదాన్ని. స్కూల్ హోమ్‌వర్కు చేయపోయినా నాన్న పేరు చెబితే చాలు... చేసేసేవాడు. వాళ్ల అక్క తేజస్విని బాగా ఆటపట్టించేవాడు. తనంటే వాడికి ఎంతో ప్రేమ. మా అమ్మాయి మంచి ఆర్టిస్టు. తను వేసే చిత్రాలు చూసి



సరదాగా ఏదో ఒకటి అనేవాడు. కానీ మ్యాచ్‌ల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఫోన్ చేసి అక్క గురించే ఎక్కువగా అడుగుతాడు. అలాగే నితీష్‌కు తన మామయ్య నరేందర్‌రెడ్డి అన్న చాలా ఇష్టం. ఆయనన్నా వాడికి భయం. కెరీర్‌లో ముందుకువెళ్లే క్రమంలో ఇద్దరూ మంచి స్నేహితుల్లా మారిపోయారు.

మాకు నమ్మకం కుదరలేదు...

'జింబాబ్వేలో టీ20 సిరీస్‌కు వెళ్లే భారత జట్టుకు ఎంపికయ్యా'నని మావారికి నితీష్ ఫోన్ చేసి చెప్పాడు. అయితే వాళ్ల నాన్న నమ్మలేదు. ఆ విషయం తను నాతో చెప్పి... 'నితీష్ సరదాగా చెప్పాడా' అని అడిగారు. 'సరదాకు మీకు అలా చెప్పడు కదా' అన్నాను. ఆయనకే కాదు... నాకూ నమ్మకం కుదరలేదు. మరుసటి రోజు జింబాబ్వే పర్యటనకు వెళ్లే భారత జట్టులో నితీష్‌కు స్థానం లభించినట్టు వార్తలు వచ్చాయి. అవి చూసి ఎంతో సంబరపడ్డాం. కానీ ఆ మర్నాడే గాయం కారణంగా నితీష్ జట్టు నుంచి తప్పుకోవాల్సిరావడం వాడినే కాదు... మమ్మల్ని కూడా ఎంతో బాధకు గురి చేసింది. గాయం తగ్గడానికి ఐదు వారాలు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో తర్వాత జరిగిన శ్రీలంక పర్యటనకు కూడా సెలక్టర్లు నితీష్‌ను ఎంపిక చేయలేదు.

ఆటకు ముందు ఫోన్ చేస్తాడు...

చివరకు ప్రస్తుత ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్‌కు జాతీయ జట్టులో నితీష్‌కు స్థానం లభించింది. అతడి ఆరాధ్య క్రికెటర్ విరాట్ కోహ్లీ నుంచి వాడు క్యాప్ అందుకోవడం, తనతో కలిసి బ్యాటింగ్ చేయడం ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతి. ఈ సిరీస్‌లో జట్టుకు ఉపయోగపడే ఇన్నింగ్స్‌తో రాణించడం చూస్తుంటే మాకు ఎంతో సంతోషంగా ఉంది. మ్యాచ్‌లో దిగే ముందు తప్పనిసరిగా నాకు ఫోన్ చేస్తాడు. నేను ఆల్ ద బెస్ట్ చెబుతాను. అది మా ఇద్దరికీ సెంటిమెంటుగా మారిపోయింది. మ్యాచ్ తర్వాత కూడా ఫోన్ చేస్తాడు. ఆటలో రాణించినా... విఫలమైనా సరే... నాతో తన అనుభవాలను పంచుకొంటాడు.

జాలి గుణం ఎక్కువ....

నితీష్‌కు జాలిగుణం ఎక్కువ. రోడ్ల మీద వృద్ధులు, దివ్యాంగులు, మానసిక రోగులను చూస్తే చలించిపోతాడు. అప్పటికప్పుడు ఏదో ఒక సాయం చేసేస్తాడు. సినిమాల్లో సెంటిమెంట్ సన్నివేశాలు కూడా చూడలేడు. ఒకవేళ చూసినా... కళ్ల వెంట నీళ్లు కారిపోతుంటాయి. ఈ మధ్య మా ఇంటి దగ్గరున్న అనాథ శరణాలయంలో నితీష్ పుట్టిన రోజు వేడుకలు చేశాం. మంచి వంటకాలతో మధ్యాహ్న భోజనం పెట్టాం. కార్యక్రమం పూర్తిచేసుకుని ఇంటికి వచ్చేశాం. ఆ తరువాత నితీష్ బయటకు వెళ్లి అనాథలందరికీ ఐస్‌క్రీమ్‌లు కొని ఇచ్చాడు. 'ఇంతగా చలించిపోయేవాడు... బౌండరీలు బాదినప్పుడు పొరపాటు బౌలర్ ముఖంలో బాధ కనిపిస్తే జాలితో అవుటైపోతాడా' అనిపించేది.

వాడి కోసం క్రికెట్ తెలుసుకున్నా...

ఒకప్పుడు నాకు క్రికెట్‌పై కనీస అవగాహన ఉండేది కాదు. నితీష్ బాగా ఆడుతున్నాడని మావారితోపాటు బయటవాళ్లు చెప్పినప్పుడు సంతోషించేదాన్ని. కెరీర్ కోసం వాడు చూపుతున్న శ్రద్ధ, పడుతున్న శ్రమ గ్రహించి, నా వంతుగా క్రికెట్ కోసం కొంతైనా తెలుసుకోవాలని అనుకున్నాను. ఇప్పుడు బ్యాట్ పట్టుకుని ఆడలేను కానీ తప్పొప్పులు చెప్పగలను."

• పి.భాస్కర్, విశాఖపట్నం

కెరీర్ గురించి ఆలోచిస్తాడా..!

చిన్నప్పటి నుంచి యానిమేషన్ వీడియోలు, పవర్ రేంజర్స్ సినిమాలు అంటే నితీష్‌కు ఎంతో ఆసక్తి. ఇప్పటికీ ఖాళీ సమయం దొరికితే యానిమేషన్ ఫిలిమ్స్ చూస్తూ ఆస్వాదిస్తాడు. 'పవర్ రేంజర్స్' సిరీస్‌లు వదలకుండా చూస్తాడు. 'వీడు యానిమేషన్ వీడియోలు తెగ చూస్తున్నాడు. క్రికెట్ కెరీర్ గురించి సీరియస్‌గా ఆలోచిస్తాడా' అని ఒక్కోసారి నాకు సందేహం కలిగేది. కానీ దేని సమయం దానికి కేటాయించేవాడు. యానిమేషన్ వీడియోలు చూడడంవల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతున్నాడని కొంతకాలానికి నాకు అర్థమైంది.

పవన్, మహేష్ అభిమాని...

నితీష్‌కు క్రికెట్‌లో విరాట్ కోహ్లీ ఆరాధ్య దైవం. సినిమాల్లో పవన్‌కల్యాణ్, మహేష్‌బాబు అంటే చాలా ఇష్టం. వాళ్లద్దరి సినిమాలు వదలకుండా చూస్తాడు. మిగిలినవాళ్ల చిత్రాలంటే అంతగా ఆసక్తి చూపడు.

వంకాయ వండొద్దు ప్లీజ్...

నితీష్ మితాహారి. కాయగూరలు తినడానికి ఇష్టపడేవాడు కాదు. మాంసాహారం ఇష్టం. కాయగూరలు వండితే కాదనలేక తినేవాడు. బయటకు వెళ్లే ముందు... 'అమ్మా... వంకాయ, బెండకాయ వండొద్దు ప్లీజ్' అని బతిమలాడేవాడు. 'వండను' అని చెప్పినా, చిన్న పిల్లాడిలా గెడ్డం పట్టుకొనిమరీ మళ్లీ అదే చెప్పేవాడు... 'ప్లీజ్ అవి వండకమ్మా' అని. ఇప్పటికీ అందులో ఎలాంటి మార్పూ రాలేదు.

అక్క చాక్లెట్లు లాక్కొని...

నితీష్‌కు చాక్లెట్లంటే చాలా ఇష్టం. బడికి వెళ్లినప్పుడు తనతోపాటు అక్కకు పెట్టిన చాక్లెట్స్ కూడా బలవంతంగా లాక్కొని తినేవాడు. ఇప్పటికీ చాక్లెట్స్ ఇష్టంగా తింటాడు.



బెండకాయలతో బ్రహ్మాండంగా!

బెండకాయలతో తయారుచేసిన రకరకాల కూరలు, వేపుళ్లు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వారానికి రెండుసార్లు బెండకాయలను ఆహారంలో చేర్చుకుంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గి గుండె జబ్బులు రావు. రక్తం శుద్ధి అవుతుంది. బెండకాయల్లో ఫోలిక్ ఆమ్లం ఎక్కువగా ఉంటుంది. ఇది మెదడు పనితీరుని మెరుగుపరుస్తుంది. కాబట్టి బెండకాయ కూరలను పెరిగే పిల్లలు, గర్భిణులు తప్పనిసరిగా తినాలి. లేత బెండకాయలతో చేసే ప్రత్యేక వంటకాల వివరాలు మీ కోసం......

బెండకాయ మసాలా వేపుడు

అరకేజీ బెండకాయలను శుభ్రంగా కడిగి తేమ లేకుండా తుడవాలి. తరవాత చిన్న ముక్కలుగా కోయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు చెంచాల వేరుశనగ గుండ్లు, రెండు చెంచాల తెల్ల నువ్వులు, అర చెంచా జీలకర్ర, రెండు చెంచాల ఎండు కొబ్బరి పొడి, నాలుగు వెల్లుల్లి రెబ్బలు వేసి ఎర్రగా వేపాలి. వీటిని చల్లార్చి మెత్తని పొడిలా చేయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అయిదు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. అందులో రెండు కరివేపాకు రెమ్మలు తుంచి వేయాలి. తరవాత బెండకాయ ముక్కలు వేసి గిన్నెను కదిలిస్తూ వాటిని దోరగా వేపాలి. ముక్కలు వేగాక వాటిపై ఒక చెంచా ఉప్పు, ముప్పావు చెంచా కారం, ముందుగా తయారు చేసుకున్న మసాల పొడి, చిటికెడు పసుపు వేసి గిన్నెను పైకి కింది ఊపుతూ నాలుగు నిమిషాలు కలపాలి. గరిటెతో కలపకూడదు. కావాలనుకుంటే గరం మసాలా పొడి కూడా చల్లుకోవచ్చు. కొత్తిమీర తరుగు వేసి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ వేపుడు వేడి అన్నంలోకి బాగుంటుంది. పిల్లలు బాగా ఇష్టపడతారు.

బెండకాయ పకోడీ

పావు కేజీ బెండకాయలను నిలువుగా చీలికల మాదిరి కోయాలి. ఒక గిన్నెలో అర చెంచా గరం మసాలా, ఒక చెంచా కార్న్‌ఫ్లోర్, అయిదు చెంచాల బియ్యం పిండి, ఒక చెంచా ధనియాల పొడి, రెండు చెంచాల కారం, ఒక చెంచా ఉప్పు, అరగ్లాసు నీళ్లు పోసి బజ్జీల పిండిలా కలపాలి. ఇందులో బెండకాయ చీలికలు వేసి పావు గంట నాననివ్వాలి. స్టవ్ మీద కడాయి పెట్టి నూనె పోసి వేడిచేయాలి. నూనె బాగా వేడెక్కాక అందులో బెండకాయ చీలికలను ఒక్కోటి వేయాలి. ఎర్రగా వేగిన తరవాత టిష్యూ పేపర్‌లోకి తీయాలి. ఈ బెండకాయ పకోడీని చిరుతిండిగా పిల్లలకు పెట్టవచ్చు. టీ సమయంలో పెద్దవాళ్లు తినడానికి కూడా బాగుంటుంది.



టమాటా-భిండీ మసాలా

పావుకేజీ బెండకాయలకు మధ్యలో పొడవుగా గాటు పెట్టాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అయిదు చెంచాల నూనె వేసి వేడయ్యాక పావు చెంచా జీలకర్ర, పావు చెంచా ఆవాలు వేయాలి. ఒక పెద్ద సైజు ఉల్లిపాయను సన్నగా తరిగి వేయాలి. అది కొద్దిగా వేగాక బెండకాయలు, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలిపి మూతపెట్టి మగ్గించాలి. అయిదు నిమిషాల తరవాత సన్నగా తరిగిన టమాటా ముక్కలు, చిటికెడు పసుపు వేసి కలపాలి. టమాటా ముక్కలు మెత్తగా అయిన తరవాత రెండు చెంచాల కారం, ఒక చెంచా ధనియాల పొడి. అర చెంచా గరం మసాలా పొడి, అరచెంచా ఉప్పు వేసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించి రెండు చెంచాల నిమ్మరసం, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి మెల్లగా కలపాలి. ఈ మసాలా కూర పుల్కాలు, చపాతీల్లోకి బాగుంటుంది.

భిండీ-వెల్లుల్లి వేపుడు

బెండకాయలను మధ్యలో చీల్చి ఉంచుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి కొద్దిగా నూనె వేసి వేడిచేయాలి. అందులో పచ్చిమిర్చి చీలికలు, పొడవుగా కోసిన వెల్లుల్లి రెబ్బలు, చిటికెడు పసుపు, రెండు కరివేపాకు రెమ్మలు వేసి దోరగా వేపాలి. తరవాత బెండకాయలు వేసి కలపాలి. బెండకాయలు బాగా వేగాక రుచికి తగినంత ఉప్పు, కొంచెం మిరియాల పొడి వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించి ఒక చెంచా నిమ్మరసం వేసి కలపాలి. ఈ వేపుడు కూడా వేడి అన్నంలోకి బాగుంటుంది.



కుటుంబ సభ్యుల బెదిరింపులు, ఊళ్లోవారి ఈసడింపులు... వేటికీ భయపడలేదు. బాగా చదువుకోవాలన్న తన కల... బాల్య వివాహం వల్ల నాశనమైపోతూ ఉంటే తలవంచుకొని కూర్చోలేదు. పరిస్థితుల మీద తిరగబడింది. తన ఆశయాన్ని నెరవేర్చుకోవడమే కాదు, ఎందరికో మార్గదర్శిగా నిలుస్తోంది. 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్' అందుకున్న పదిహేడేళ్ల జ్యోత్స్నా అఖ్తర్ స్ఫూర్తిదాయకమైన కథ ఇది...

మార్పునకు నాందిగా... బాలికలకు అండగా

"కిందటి ఏడాది మే నెల. ఆ రోజు నేను బడి నుంచి ఇంటికి వచ్చేసరికి మా ఇల్లంతా సందడిగా ఉంది. ఎవరో కొత్త మనుషులు మా ఇంట్లో ఉన్నారు. నన్ను పెళ్ళి చూపులు చూడడానికి వాళ్ళు వచ్చారని అర్థమయింది. నన్ను అలంకరించడానికి మా అమ్మ, బంధువులు గదిలోకి తీసుకువెళ్ళినప్పుడు నేను అభ్యంతరం చెప్పాను. కానీ ఎవరూ వినిపించుకోలేదు. పెళ్ళి సంబంధం కోసం వచ్చిన వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత... ఏడ్చాను, మొత్తుకున్నాను. నాకు బాగా చదువుకోవాలని ఉందనీ, పదహారేళ్ళ వయసుకే పెళ్ళి చేసుకోలేననీ చెప్పాను. మా కుటుంబ సభ్యులు నన్ను బెదిరించారు. ఇంట్లోంచీ గెంటేస్తామన్నారు. ఈ సంగతి తెలిసిన ఇరుగుపొరుగువారు కూడా నన్ను సూటిపోటి మాటలన్నారు. సంప్రదాయానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే నాశనమైపోతావని శాపనార్థాలు పెట్టారు. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ అప్పుడే పెళ్ళి చేసుకోకూడదని నేను గట్టిగా నిశ్చయించుకున్నాను.

మేజిస్ట్రేట్ జోక్యంతో...

మాది దక్షిణ త్రిపురలోని బెలోనియా గ్రామం. మైనారిటీ జనాభా ఎక్కువ. పాత సంప్రదాయాలను పాటించడం, కట్టుబాట్లను కఠినంగా అమలు చేయడం కూడా ఎక్కువే. హైస్కూలు చదువు పూర్తవకుండానే ఆడపిల్లలకు పెళ్ళి చేయడం సర్వసాధారణం. ఇరవయ్యేళ్ళకే ముగ్గురు నలుగురు పిల్లలతో... వారి జీవితం ఇంటి పనులకే పరిమితమైపోతుంది. వారు పడుతున్న ఇబ్బందులు కళ్ళారా చూశాను. నేను కూడా అలా కాకుండా ఉండాలంటే బాగా చదువుకోవాలి. నా కాళ్ళమీద నేను నిలబడి స్వతంత్రంగా బతకాలి అనేది నా కల. కానీ సామాజికమైన ఒత్తిడికి లొంగిపోయి... నాకు పెళ్ళి చెయ్యడానికి మావాళ్ళు నిర్ణయించడంతో... నా కలలన్నీ కూలిపోతున్నాయనిపించింది. బాల్య వివాహం అంటే... జీవితం అక్కడితో ముగిసిపోతుంది. నా విషయంలో అలా జరగకూడదనుకున్నాను. నేను ఎంత చెప్పినా ఇంట్లో వాళ్ళు వినకపోవడంతో... 'బాలికా మంచ్'ను ఆశ్రయించాను. పాఠశాలల్లో బాలికలకు సురక్షితమైన పరిస్థితులను ఏర్పాటు చేయడం కోసం, బాల్య వివాహాల నుంచి వారిని రక్షించుకోవడం కోసం ఏర్పాటైన విభాగం అది. దానిలో నా స్నేహితులు కొందరు సభ్యులుగా ఉన్నారు. నా సమస్యను విభాగం ఇన్‌ఛార్జిగా ఉన్న టీచర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సంగతి తెలిసిన నా తల్లితండ్రులు రెండు రోజుల్లో నా పెళ్ళి జరపడానికి ఏర్పాట్లు చేశారు. పరిస్థితి తీవ్రతని గుర్తించిన మా టీచర్ నేరుగా జిల్లా మేజిస్ట్రేట్‌ను కలిసి విషయం చెప్పారు. మేజిస్ట్రేట్ జోక్యంతో అధికారులు రంగంలోకి దిగారు. నా పెళ్ళి ఆగిపోయింది. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం కాబట్టి మళ్ళీ అలాంటి ప్రయత్నం చేస్తే అరెస్ట్ చెయ్యాల్సి వస్తుందని అధికారులు హెచ్చరించడంతో... మా వాళ్ళు మళ్ళీ ఆ ప్రస్తావన తేలేదు.



బాల్య వివాహం అంటే... జీవితం అక్కడితో ముగిసిపోతుంది. నా విషయంలో అలా జరగకూడదనుకున్నాను. నేను ఎంత చెప్పినా ఇంట్లో వాళ్ళు వినకపోవడంతో... 'బాలికా మంచ్'ను ఆశ్రయించాను.

ఎన్నడూ అనుకోలేదు...

ఈ సంఘటనతో నా పేరు మా ప్రాంతమంతా మారుమోగిపోయింది. అప్పటివరకూ తమకు ఇష్టం లేకపోయినా... బాల్య వివాహాలకు అమ్మాయిలు తలవంచేవారు. మొదటిసారి ఎదిరించింది నేనే కావడంతో... నా తోటి బాలికల్లో నేను ప్రేరణ కలిగించగలనని అనిపించింది. మా పాఠశాల యాజమాన్యం, అధికారులు కూడా ఇదే ఆలోచనతో 'బాలికా మంచ్'కు కన్వీనర్‌గా నన్ను నియమించారు. అప్పటి నుంచి తరగతుల్లో, ఇతర వేదికల మీద బాలికల హక్కుల గురించి మాట్లాడడం ప్రారంభించాను. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే బాగా చదువుకోవాలనీ, సాధికారత సాధించాలనీ, తమ ఆకాంక్షలకు ముప్పుగా నిలిచే ఒత్తిడులను ప్రతిఘటించాలని ప్రధానంగా చెబుతూ వచ్చాను. ఒక రోజు నాకు ఫోన్ కాల్ వచ్చిందని హెడ్మాస్టర్ నుంచి కబురు వచ్చింది. 'నాకోసం ఎవరు చేస్తారు?' అనుకుంటూ వెళ్ళాను. "హలో!' అనగానే నాతో మాట్లాడినాయన నా వివరాలు కనుక్కొని... వేరొకరికి ఫోన్ అందించారు. "నేను మాణిక్ సహాను మాట్లాడుతున్నాను" అంటూ అవతలి వ్యక్తి అనగానే... నాకు ఒక్క క్షణం ఏం చెయ్యాలో అర్థం కాలేదు. సాక్షాత్తూ త్రిపుర ముఖ్యమంత్రి నాతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడతారని ఎన్నడూ అనుకోలేదు. ఆయన నా ధైర్యాన్ని అభినందించారు. అనంతరం ఒక కార్యక్రమానికి నన్ను ఆహ్వానించి సత్కరించారు. అలాగే ఈ ఏడాది 'ప్రధానమంత్రి బాల పురస్కార్'ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నాను. నాయకత్వ లక్షణాలున్న బాలలకు మన దేశంలో ఇచ్చే అత్యున్నత పురస్కారం అది. నాలాంటి ఒక సామాన్యమైన అమ్మాయికి ఇంతటి గౌరవం దక్కుతుందని నేను ఊహించలేదు. ఇది నాలో మరింత ఉత్సాహాన్ని నింపింది. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడానికి మా ప్రాంతంలో 'బాలికా మంచ్' ద్వారా నా వంతు కృషి చేస్తున్నాను. బాల్య వివాహాలు బాలికలను శారీరకంగా, మానసికంగా కుంగదీస్తాయి. వారి ఎదుగుదలకు అవరోధంగా మారుతాయి. వారికి భవిష్యత్తు లేకుండా చేస్తాయి. వాటి నివారణకు ప్రభుత్వం తీసుకొనే చర్యలు కీలకం అయినప్పటికీ, ఈ దురాచారాన్ని రూపుమాపాలంటే సమాజంలో మార్పు కూడా ఎంతో ముఖ్యం. స్వయంగా ఈ సమస్యను ఎదుర్కొన్న వ్యక్తిగా... అలాంటి మార్పునకు దోహదం చెయ్యాలనేదే నా ఆశయం."

తప్పు నాదే.. క్షమించండి

» జర్నలిస్టు రంజిత్, అతని కుటుంబంతో మోహన్ బాబు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై దాడి ఘటనలో సినీనటుడు మోహన్ బాబు తన తప్పును అంగీకరించారు. బాధిత జర్నలిస్టు రంజిత్, అతని కుటుంబ సభ్యులకు స్వయంగా క్షమాపణలు చెప్పారు. జల్‌పల్లిలోని తన నివాసం వద్ద తాను చేసిన దాడిలో గాయపడి ఆస్పత్రిపాలైన జర్నలిస్టు రంజిత్‌ను మోహన్ బాబు ఆదివారం పరామర్శించారు. తన కుమారుడు మంచు విష్ణుతో కలిసి సోమాజీగూడలోని యశోద ఆస్పత్రికి వెళ్లిన ఆయన.. బాధిత జర్నలిస్టుకు క్షమాపణ చెప్పారు. రంజిత్ కుమార్తె, ఇతర కుటుంబసభ్యులకు కూడా క్షమాపణలు తెలియజేశారు. ఆ రోజు జరిగిన ఘటనకు తాను బాధపడుతున్నానని, అలా జరిగి ఉండాల్సింది కాదని, తప్పు తనదేనని రంజిత్‌తో అన్నారు. క్షమించమని అడగడం తప్ప.. ఏమీ మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నానని రంజిత్, అతని భార్యాపిల్లలకు వివరణ ఇచ్చుకున్నారు. అలాగే, రంజిత్ కుమార్తెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఎత్తుకున్నారు. సారీ తల్లి నా వల్లే మీ నాన్నకు ఈ పరిస్థితి వచ్చిందని ఆ చిన్నారితో అన్నారు. అనంతరం, రంజిత్, అతని కుటుంబసభ్యులతో మాట్లాడి.. రంజిత్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రెండు కాళ్లు, భుజాలు, కళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్న తనకు... శస్త్రచికిత్సల బాధ ఎలా ఉంటుందో తెలుసునని ఈ సందర్భంగా వారితో అన్నారు. రంజిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రంజిత్ కుటుంబానికి అండగా ఉంటానని, ఏ సాయం చేయడానికైనా సిద్ధమని హామీ ఇచ్చారు.

విష్ణు అనుచరులతో ప్రాణహాని ఉంది

» ఇంట్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయడానికి జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారు

» మా అమ్మను, నా కుటుంబాన్ని భయపెడుతున్నారు

» తనపై కుట్ర జరుగుతోందంటూ మంచు మనోజ్ లేఖ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంచు మోహన్‌బాబు కుటుంబంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. అన్నదమ్ములు విష్ణు, మనోజ్ మధ్య మళ్లీ విభేదాలు భగ్గుమన్నాయి. జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్‌ను పోసి విద్యుత్తు సరఫరా నిలిపివేయడం ద్వారా విష్ణు అనుచరులు నన్ను, నా కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేశారని మంచు మనోజ్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం మీడియాకు ఓ లేఖ విడుదల చేశారు. "నన్ను, నా కుటుంబాన్ని విష్ణు, అతడి అనుచరులు పలు విధాలుగా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. శనివారం నేను షూటింగ్ వెళ్లగా.. నా భార్య కుమారుడి స్కూల్‌లో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్లారు. మా అమ్మ పుట్టిన రోజు సందర్భంగా కేక్ ఇచ్చే నెపంతో మంచు విష్ణుతోపాటు అతడి అనుచరులు రాజ్ కందూరు, కిరణ్, విజయ్ రెడ్డితోపాటు కొంతమంది బౌన్సర్లు ఇంటికి వచ్చారు. ఈ సమయంలో వారు నా జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్‌ను పోశారు. దీని కారణంగా కరెంట్ సరఫరాలో అంతరాయం కలడంతోపాటు జనరేటర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. జనరేటర్‌కు సమీపంలోనే కార్లు, గ్యాస్‌కు సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయి. ఒక వేళ నిప్పురవ్వల కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటే ఇంట్లో ఉన్న నా 9 నెలల పాప, వృద్ధురాలైన నా తల్లి, అంకుల్, ఆంటీల ప్రాణాలకు ముప్పు ఏర్పడేది. మా అమ్మ పుట్టిన రోజున ఇలా జరగడం నా మనసును కలిచివేసింది. ఇది పూర్తిగా కుటుంబ సమస్య.. కానీ నా కుటుంబ క్షేమం, రక్షణ కోసం అన్ని అంశాలను బహిరంగపర్చాల్సి వస్తోంది. నాకు, నా కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా. ఈ ఒక్క సంఘటనే కాకుండా పోలీసు వారి హెచ్చరికలు ఖాతరు చేయకుండా పలు విధాలుగా నా కుటుంబానికి హాని కలిగేలా ప్రవర్తిస్తున్నారు. నేను, నా కుటుంబం చాలా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. నాకు, నా కుటుంబానికి రక్షణ ఇస్తామని హామీ ఇచ్చిన రాచకొండ పోలీస్ కమిషనర్‌కు, పహాడిషరీఫ్ ఇన్‌స్పెక్టర్‌కు ధన్యవాదాలు. నేడు ఆళ్లగడ్డలో నిర్వహించే మా అత్తగారి జయంతి వేడుకలకు హాజరై వచ్చాక ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా" అని మనోజ్ పేర్కొన్నారు.

మెగా బ్రదర్స్ ఇంటికి అల్లు అర్జున్



హైదరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో శనివారం జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్.. తన మామ, ప్రముఖ సినీనటుడు చిరంజీవిని ఆదివారం కలిశారు. భార్య స్నేహారెడ్డి, పిల్లలు అయాన్, అర్హతో కలిసి ఆదివారం మధ్యాహ్నం చిరంజీవి నివాసానికి వెళ్లారు. మరో కారులో అల్లు అరవింద్ వారిని అనుసరించారు. కాగా, చాలాకాలం తర్వాత తమ ఇంటికి వచ్చిన అల్లు అర్జున్‌ను చిరంజీవి దంపతులు సాదరంగా ఆహ్వానించారు. 'అల్లుడూ ఎలా ఉన్నావ్' అని అడుగుతూ అల్లు అర్జున్‌ను చిరంజీవి ఈ సందర్భంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అర్జున్ దంపతులు చిరంజీవి పాదాలకు నమస్కరించారు. అనంతరం ఇరు కుటుంబాలు కలిసి భోజనం చేశాయి. కాగా, ఆపత్కాలంలో తనకు, తన కుటుంబానికి అండగా నిలిచినందుకు చిరంజీవికి అల్లు అర్జున్ కృతజ్ఞతలు చెప్పారు. గత మూడు రోజులుగా జరిగిన పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్టు తెలిసింది. ఈ సందర్భంగా అర్జున్‌కు చిరంజీవి పలు సూచనలు చేశారని సమాచారం. కాగా, అల్లు అర్జున్‌ను జైలు నుంచి విడుదల చేయించేందుకు చిరంజీవి అటు న్యాయపరంగా, ఇటు రాజకీయంగా తన పలుకుబడి వాడారనే ప్రచారం, మెగా కుటుంబానికి అల్లు అర్జున్‌కు దూరం పెరిగిందనే వార్తల నేపథ్యంలో ఈ కలయిక ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, చిరంజీవితో భేటి అనంతరం ఆయన సోదరుడు నాగబాబు నివాసానికి కూడా అల్లు అర్జున్ దంపతులు వెళ్లారు.

కేసు విచారణ వల్లే శ్రీతేజ్‌ను కలవలేకపోతున్నా: అల్లు అర్జున్

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను స్వయంగా కలవకపోవడంపై అల్లు అర్జున్ స్పందించారు. కేసు విచారణ దశలో ఉన్న నేపథ్యంలో న్యాయ నిపుణులు చేసిన సూచనల వల్లే శ్రీతేజ్ వద్దకు వెళ్లడం లేదని సోషల్ మీడియా ద్వారా ఆదివారం ప్రకటించారు. శ్రీతేజ్‌ను కలవలేకపోతున్నందుకు విచారం వ్యక్తం చేశారు. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. త్వరలోనే వారి కుటుంబాన్ని కలిసి, ఇచ్చిన మాట ప్రకారం ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని అల్లు అర్జున్ వెల్లడించారు.

వెంటిలేటర్‌పైనే శ్రీతేజ

జ్వరంతో ఇబ్బంది.. మెదడు, నాడీ సంబంధిత సమస్యలు

» హెల్త్ బులెటిన్ విడుదల చేసిన కిమ్స్ కడిల్స్ వైద్యులు

» 15 రోజులు గడిస్తే తప్ప ఏమీ చెప్పలేమంటున్నారు

» బాలుడి కుటుంబానికి అర్జున్ రూ.కోటి ఇవ్వాలి: మంద కృష్ణ

» అర్జున్‌ను పరామర్శిస్తారు గానీ శ్రీతేజను చూడరా?

» సినీ ప్రముఖుల తీరుపై బండ్రు శోభారాణి విమర్శ



వైద్యులను శ్రీతేజ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుంటున్న మంద కృష్ణ మాదిగ

హైదరాబాద్, రాంగోపాల్‌పేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజకు ఇంకా వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడిల్స్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. శ్రీతేజకు అందిస్తున్న చికిత్స, అతడి ఆరోగ్యస్థితిపై ఆదివారం సాయంత్రం ఆస్పత్రి హెల్త్‌బులిటెన్ విడుదల చేసింది. ఆస్పత్రిలో బాబుకు పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ)లో చికిత్స కొనసాగుతోందని వైద్యులు చేతన్ ఆర్.ముందాడ, విష్ణు తేజ్ తెలిపారు. శ్రీతేజ వైటల్ పారామీటర్స్ స్థిరంగా ఉన్నాయని, ట్యూబ్ ద్వారా ఇచ్చే ఆహారం బాగానే తీసుకుంటున్నాడని పేర్కొన్నారు. బాలుడికి జ్వరం వస్తోందని.. మెదడు, నాడీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడని వివరించారు. నాడీ సంబంధిత ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు వైద్యులు వివరించారు. కాగా శ్రీతేజను పరామర్శించేందుకు ఆదివారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆస్పత్రికి వచ్చారు. శ్రీతేజ ఆరోగ్యస్థితి గురించి వైద్యులను, బాలుడి తండ్రి భాస్కర్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీతేజ కుటుంబానికి అల్లు అర్జున్ రూ.కోటి పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీతేజను సినీ పరిశ్రమ, మా అసోసియేషన్ సభ్యులు కూడా ఆదుకోవాలని కోరారు. మరో 15 రోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉంటే తప్ప శ్రీతేజ ఆరోగ్య పరిస్థితిపై ఏమీ చెప్పలేమని వైద్యులు అంటున్నారని వెల్లడించారు. థియేటర్‌కు అల్లు అర్జున్ రాక విషయమ్మీద ముందుగానే పోలీసులకు సమాచారం ఉన్నప్పుడు తగిన బందోబస్తు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని, అక్కడ భద్రతా వైఫల్యంపై పోలీస్ కమిషనర్, డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీతేజను పరామర్శించడానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆస్పత్రికి వచ్చారు. శ్రీతేజ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెబుతున్నారని, బాలుడి ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని ఆమె చెప్పారు. అభిమానం హద్దులు దాటితే ప్రాణాల మీదకు వచ్చే అవకాశం ఉంటుందని, రద్దీ ప్రాంతాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని కోరారు. శ్రీతేజ వైద్యానికి అయ్యే ఖర్చును తామే భరిస్తామని అల్లు అర్జున్ చెప్పినప్పటికీ ప్రభుత్వం కూడా వారి కుటుంబానికి, బాలుడి వైద్య చికిత్సల ఖర్చు విషయంలో సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. శ్రీతేజ ఆరోగ్య స్థితి తెలుసుకునేందుకు తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి ఆస్పత్రికి వచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు బాలుడిని పరామర్శించామని ఆమె చెప్పారు. మరో రెండు వారాలు గడిస్తే కానీ బాలుడి ఆరోగ్య స్థితిపై స్పష్టమైన అవగాహన రాదని వైద్యులు చెబుతున్నారని పేర్కొన్నారు. జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్‌ను ఆయన ఇంటికి వెళ్లి సినీ ప్రముఖులు పరామర్శించడం విడ్డూరంగా ఉందని, అల్లు అర్జున్‌ను పరామర్శించేందుకు వెళ్తున్న సినీ ప్రముఖులు నిరుపేద వర్గానికి చెందిన బాలుడిని పరామర్శించేందుకు ఎందుకు రావడం లేదని ఆమె ప్రశ్నించారు. సినిమా వాళ్లు వ్యాపారాలు చేసుకుంటూ అభిమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. బెనిఫిట్ షోల పేరుతో సినీ ప్రముఖులు లాభం పొందడం తప్ప దేశానికి ఒరిగేదేమీ లేదన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున న్యాయం చేస్తామన్నారు

అమ్మ ఊరికి పోయింది..
నెల తర్వాత వస్తది!

అన్నయ్య ఆస్పత్రి నుంచి వచ్చాక బడికి పోతాం

కంటతడి పెట్టిస్తున్న రేవతి కూతురు శాన్విక మాటలు



తల్లిదండ్రులు, సోదరుడితో చిన్నారి శాన్విక (ఫైల్)

చాదర్‌ఘాట్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొన్ని విషాదాలు గుండెను పిండేస్తాయి.. ఇంకొన్ని జీవితాంతం వెంటాడతాయి! తెలిసీ తెలియని వయసు కావడమే ఆ పాప అదృష్టమేమో.. కుటుంబమే చిన్నాభిన్నమైన సంగతే ఆ నాలుగేళ్ల చిన్నారికి తెలియదు! కొన్ని రోజులుగా అమ్మ కనిపించడం లేదని తెలిసినా నెలరోజుల తర్వాత వస్తుందనే ఓ నమ్మకంతో ఉంది. అయితే తన కన్నతల్లి తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయిందనే చేదు నిజం ఆ బాలికకు తెలియదు! రోజూ తన చేతిలో చేయి వేసుకొని బడిలోకి నడిపించే అన్న, ఆస్పత్రిలో ఉన్నట్టు తెలిసినా, ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్టు తెలియదు. ఇదంతా సంధ్యా థియేటర్ వద్ద తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన రేవతి నాలుగేళ్ల కూతురు శాన్విక గురించే! అమ్మ ఊరెళ్లిందని.. నెల తర్వాత వస్తుందని, అన్న శ్రీతేజ కూడా ఆస్పత్రి నుంచి వచ్చేస్తాడని తనను పలకరించిన వారితో చెబుతోంది. అమ్మానాన్న, అన్నయ్యతో కలిసి తాను సినిమాకు వెళ్లానని చెబుతన్న శాన్విక.. అల్లు అర్జున్ వచ్చాడని తెలియడంతో అంతా కలిసి థియేటర్ నుంచి బయటకు వచ్చామని, ఆ తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదని శాన్విక వెల్లడించింది. తానిప్పుడు అమ్మమ్మ ఇంట్లో ఉన్నానని.. అమ్మ గురించి అడిగితే ఊరెళ్లిందని.. నెల రోజుల తర్వాత వస్తుందని ఇంట్లో వారు తనకు చెబుతున్నారని అంటోంది. అన్నయ్య శ్రీతేజ ఆస్పత్రిలో ఉన్నాడని.. నాన్నతో కలిసి రోజూ అక్కడికి వెళ్తున్నాని.. అన్నయ్య కూడా నెల రోజుల తర్వాత ఆస్పత్రి నుంచి వస్తాడని.. కలిసి బడికి, ట్యూషన్‌కు వెళ్తామని చెబుతోంది. ఆ చిన్నారి మాటలు వింటున్న బంధువులు, స్థానికుల మనసు బాధతో నిండిపోయి.. కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి!!

నవ్య | చిత్రజ్యోతి

విడుదల తేదీ ఖరారు

క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క శెట్టి నటిస్తున్న 50వ చిత్రం 'ఘాటి'. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేసి సినిమాపై అంచనాలను పెంచేశారు.



ఆదివారం ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్. సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 18న విడుదలవుతున్నట్లు ఓ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో అనుష్క లుక్‌ను ప్రజంట్ చేస్తూ.. 'విక్టిమ్.. క్రిమినల్.. లెజెండ్' అని పేర్కొన్నారు. అనుకోని పరిస్థితుల్లో లోతైన సమస్యలో కూరుకుపోయిన ఓ మహిళ.. తనకు జరిగిన అన్యాయంపై పోరాడి ..వారిపై ప్రతీకారం తీర్చుకోవడమే కథాంశంగా ఈ సినిమా తెరకెక్కనుంది. కాగా, క్రిష్ దర్శకత్వంలో దాదాపు 14 ఏళ్ల తర్వాత అనుష్క నటిస్తుండటం విశేషం. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'వేదం' విమర్శకుల ప్రశంసలతో పాటు క్లాసికల్ హిట్ స్టేటస్‌ను సంపాదించుకుంది.



బిగ్‌బాస్ సీజన్ 8
గెలుపుగుర్రం నిఖిల్

ఒక టీవీ షో.. ప్రతి సంవత్సరం దాదాపు మూడు నెలల పాటు ప్రేక్షకులు టీవీలకు అతుక్కుపోయేలా చేస్తోంది. కొన్ని సంవత్సరాలుగా ప్రేక్షకులకు అంతులేని వినోదంతో పాటు మరిచిపోలేని జ్ఞాపకాల్ని పంచిన ఆ షో బిగ్‌బాస్. గత ఏడు సీజన్‌లు అందించిన వినోదానికి ఏ మాత్రం తగ్గకుండా సెప్టెంబర్ 1న మొదలైంది తెలుగు బిగ్‌బాస్ సీజన్ 8. 105 రోజుల పాటు ఆసక్తికరమైన మలుపులతో ప్రేక్షకులను విశేషంగా అలరించి.. ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేతో ముగిసింది. బిగ్‌బాస్ సీజన్ 8 గేమ్ షో విజేత ఎవరో తెలిసిపోయింది. ఈ ఏడాది షో విన్నర్‌గా నిఖిల్‌ను వ్యాఖ్యాత నాగార్జున ప్రకటించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామ్‌చరణ్.. విజేతకు ట్రోఫీతో పాటు రూ.55 లక్షల ప్రైజ్‌మనీ, మారుతీ సుజుకీ డాజ్లింగ్ డిజైర్ కారుని అందజేశారు. ఇప్పటివరకు జరిగిన అన్ని సీజన్ల కన్నా ఈ సీజన్ ప్రైజ్ మనీ ఎక్కువ కావడం విశేషం. విజేతకు చివరి వరకు గట్టి పోటీనిచ్చిన గౌతమ్‌కృష్ణ రన్నరప్‌గా మిగిలారు. టాప్ 5 కంటెస్టెంట్లుగా పోటీ చేసిన నబీల్, ప్రేరణ, అవినాశ్‌లకు ప్రేక్షకుల నుంచి వచ్చిన ఓట్ల ఆధారంగా వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాలు దక్కాయి. ఎలిమినేషన్ ప్రక్రియలో ఐదో స్థానంలో నిలిచిన అవినాశ్‌ను హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ .. నాలుగో స్థానంలో ఉన్న ప్రేరణను కన్నడ స్టార్ ఉపేంద్ర.. మూడో స్థానంలో విగిలిన నబీల్‌ను విజయ్‌సేతుపతి, మంజు వారియర్ బయటకు తీసుకుని వచ్చారు.

నభానటేష్ స్టెప్పులు

ఈ ఏడాది గ్రాండ్ ఫినాలేలో హీరోయిన్ నభా నటేశ్ స్పెషల్ పర్ఫామెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'పుష్ప 2'లోని 'వస్తున్నాయ్ పీలింగ్స్' పాటతో పాటు మరికొన్ని సాంగ్స్‌కు స్టెప్పులేసి అలరించారు. పలువురు సినీతారలు తళుక్కుమనడం.. శ్రీకృష్ణ, గీతా మాధురి పాటల ప్రదర్శన... టాప్ 5 కంటెస్టెంట్స్ ఆటపాటలతో షో ఆకట్టుకుంది. నాగార్జున జరిపిన సరదా సంభాషణలు.. సీజన్ 8 హౌజ్‌ను చూపించి అందర్నీ గతంలోకి తీసుకెళ్లడం.. ఇలా ఫినాలే ఆరంభం నుంచి విన్నర్‌ని ప్రకటించేదాకా వరకు హౌజ్‌లో జరిగిన హంగామా అంతా ప్రేక్షకులకు వినోదాన్ని పంచింది.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

సీజన్ 7 ఫినాలే తర్వాత జరిగిన గొడవల్ని, అల్లర్లను దృష్టిలో పెట్టుకున్న పోలీసులు.. ఈ ఏడాది అలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 300 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. అభిమానులు ఎవ్వరూ స్టూడియోస్‌కు రావొద్దని.. విజేతను ప్రకటించాక ఊరేగింపులు, ర్యాలీలు చేయొద్దని పోలీసులు సూచించారు.



సినీ ఫైనాన్సియర్ బంగారు బాబు (ఈ.వి.రాజారెడ్డి) తనయుడు క్రాంతి రెడ్డి నిశ్చితార్థం పారిశ్రామికవేత్త సీతారామిరెడ్డి కుమార్తె శిరీషతో ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి గ్రూప్స్ అధినేత వేమూరి రాధాకృష్ణ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. అలాగే పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కథానాయిక కీర్తిసురేశ్ ఇటీవలే తన ప్రియుడు ఆంటోని తట్టిల్‌ను పెళ్లాడిన విషయం తెలిసిందే. తొలుత ఈ నెల 12న గోవాలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో జరగ్గా, తర్వాత క్రైస్తవ సంప్రదాయాన్ని అనుసరించి వీరిద్దరూ ఒక్కటయ్యారు. ఆ ఫొటోలను కీర్తిసురేశ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.



శివకార్తికేయన్‌తో శ్రీలీల

తమిళ హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న నూతన చిత్రం ఖరారైంది. 'ఎస్కే 25' వర్కింగ్ టైటిల్. సుధాకొంగర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయిక. జయం రవి, అథర్వ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఆకాశ్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శివకార్తికేయన్ ప్రతిభావంతుడైన నటుడు. ఆయనతో సినిమా చేసే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. భారీ బడ్జెట్‌తో గ్రాండ్‌గా నిర్మిస్తున్నాం' అని చెప్పారు. జీవీ ప్రకాశ్‌కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కె. చంద్రన్.

గర్వంగా ఉంది



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్‌సేతుపతి నటించిన చిత్రం 'విడుదల 2'. గతేడాది రిలీజై విజయం సాధించిన 'విడుదల' పార్ట్ 1కు కొనసాగింపుగా ఇది తెరకెక్కింది. సూరి, మంజు వారియర్ కీలక పాత్రల్లో నటించారు. నిర్మాత చింతపల్లి రామారావు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్‌సేతుపతి మాట్లాడుతూ "ఈ సినిమాలో నటించినందుకు ఎంతో గర్వంగా ఉంది. నా సినిమాల్ని ఇంతలా ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకుల సపోర్ట్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఇళయరాజా అందించిన సంగీతం ఈ చిత్రానికి ప్రధానాకర్షణ. చిత్రం తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. "ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఇది తెలుగు నేటివిటీకి దగ్గరగా ఉన్న సినిమా" అని నిర్మాత చింతపల్లి రామారావు అన్నారు.



శరవేగంగా చిత్రీకరణ

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జీవిత విశేషాల ఆధారంగా దిలీప్ రాజా దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బాబు జగ్జీవన్ రామ్'. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ప్రదీప్ దోనెపూడి. బాబు జగ్జీవన్ రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్ ఫిల్మ్‌ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం షూటింగ్ వివరాలను వివరించింది. చిత్రదర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ 'జగ్జీవన్ రామ్ సేవల గురించి ప్రేక్షకులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. జగ్జీవన్‌రామ్ వర్ధంతి అయిన జూలై 6న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

అందరికీ నచ్చుతుంది



కేవీజీ రాజు దర్శకత్వంలో లోకేశ్ బాబు దాసరి, శిరీష హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ఉల్లాసంగానే ఉత్సాహంగానే'. శ్రీ మైత్రీ క్రియేషన్స్ పతాకంపై యార్లగడ్డ ఉమామహేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఎండీ కలామ్, ఖదీర్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు కేవీజీ రాజు మాట్లాడుతూ' ఈ చిత్రంలో లోకేశ్ ఎనర్జిటిక్‌గా నటించాడు. త్వరలో సాంగ్స్ ట్రైలర్ రిలీజ్ చేస్తాం' అని తెలిపారు. నిర్మాత ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ' ఒక మంచి లవ్ స్టోరీని తెరకెక్కించాం. మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నా' అని అన్నారు.

లైంగికంగా వేధించాడు






బాలీవుడ్ సంగీత దర్శకుడు రాజేశ్ రోషన్ తనను లైంగికంగా వేధించారని గాయని లగ్నజితా చక్రబర్తి ఆరోపించారు. సంగీత చర్చల కోసం తన ఇంటికి పిలిచిన రాజేశ్ రోషన్ అసభ్యకరంగా తాకారని ఆమె చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో లగ్నజితా మాట్లాడుతూ 'నేను ముంబైలో ఉన్న రోజుల్లో ఓ సారి రాజేశ్ రోషన్ పిలవడంతో వారి ఇంటికి వెళ్లాను. వాద్య పరికరాలతో నిండి ఉన్న గదిలోకి నన్ను తీసుకెళ్లి కూర్చోబెట్టారు. నాక్కొంచెం దూరంలో ఆయన కూర్చున్నారు. నేను ఫోన్ చూస్తుండగా, రాజేశ్ రోషన్ నెమ్మదిగా నా వైపు కదలడం గమనించాను. అతను ఏం చేస్తాడో చూద్దాం అని నేను గమనించనట్లే ఊరుకున్నాను. రాజేశ్ రోషన్ నా స్కర్ట్‌లోకి తన చేతులను దూర్చాడు. నేను వెంటనే తేరుకొని అక్కడ నుంచి బయటకు పరుగుతీశాను. జుగుప్సాకరమైన ఆ సంఘటన గురించి కెమెరా ముందు మాట్లాడలన్నా సిగ్గుగా ఉంది. మొదట దిగ్భ్రాంతికి గురయ్యాను. అయితే జరిగిన దాంట్లో నా తప్పేం లేదు, అతనిది దిగజారుడు వ్యక్తిత్వం అని అర్థం చేసుకొని, ఆ సంఘటన వల్ల క్షోభకు గురికాకుండా నన్ను నేను కాపాడుకున్నాను' అని తెలిపారు. లగ్నజితా ఆరోపణలపై రాజేశ్ రోషన్ స్పందించలేదు.

శతక మోతెక్కించారు..

హెడ్, స్మిత్ సెంచరీలు

- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 405/7
- బుమ్రాకు ఐదు వికెట్లు
- భారత్‌తో మూడో టెస్టు



హెడ్ (160 బంతుల్లో 152)

స్టీవ్ స్మిత్ (101)

బ్రిస్బేన్: ట్రావిస్ హెడ్ (160 బంతుల్లో 18 ఫోర్లతో 152) భారత జట్టుపై తన 'ప్రేమ'ను మరోసారి చాటుకున్నాడు. గాబాలో తన చివరి మూడు టెస్టుల్లోనూ గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగిన హెడ్ ఈసారి తన ప్రియమైన ప్రత్యర్థిపై కసితీరా బాదేస్తూ అదే మైదానంలో భారీ శతకం అందుకున్నాడు. ఈ సిరీస్‌లో అతడికిది వరుసగా రెండో సెంచరీ. అతడికి జతగా స్టీవ్ స్మిత్ (101) కూడా ఎట్టకేలకు ఫామ్‌ను అందుకుంటూ మూడంకెల స్కోరుతో ఆకట్టుకున్నాడు. ఇది స్మిత్‌కు 25 ఇన్నింగ్స్‌ల తర్వాత వచ్చిన సెంచరీ కావడం విశేషం. వీరిద్దరి ఆటతీరుతో మూడో టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 405/7 స్కోరుతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. భారత బౌలర్లలో ఎప్పటిలాగే పేసర్ బుమ్రా (5/72) మాత్రమే ఆసీస్‌ను కాస్తయినా కట్టడి చేయగలిగాడు. శనివారం తొలి రోజు వర్షం కారణంగా 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా.. రెండో రోజు ఆసీస్ వన్డే తరహాలో చెలరేగి పరుగులు రాబట్టింది. నేటి తొలి సెషన్‌లో మిగతా మూడు వికెట్లు వేగంగా తీసి బ్యాటింగ్‌లో చెలరేగితేనే భారత్ పోటీలోకి రాగలుగుతుంది.

తొలి సెషన్ మనదే..: రెండో రోజు అర్ధగంట ముందే తొలి సెషన్ ఆరంభం కాగా.. పిచ్ బౌలింగ్‌కు సహకరించింది. 28/0 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్‌ను బుమ్రా వరుస ఓవర్లలో దెబ్బతీశాడు. ఓపెనర్లు ఖవాజా (21), మెక్‌స్వీనే (9)ల వికెట్లను పడగొట్టడంతో 38/2 స్కోరుతో నిలిచింది. కాసేపటికి లబుషేన్ (12)ను నితీశ్ అవుట్ చేయడంతో ఆసీస్ ఒత్తిడిలో పడింది. ఈ సెషన్‌లో ఆసీస్ 76 పరుగులు సాధించింది.

హెడ్, స్మిత్ హవా: రెండో సెషన్‌లో హెడ్, స్మిత్‌ల ధాటికి భారత బౌలర్లు చెమటోడ్చాల్సివచ్చింది. హెడ్‌ను ఎలా కట్టడి చేయాలో తెలీక బౌలర్లు చేష్టలుడిగిపోయారు. మరోవైపు ఫీల్డింగ్ సెటప్ కూడా సరిగా లేకపోవడం రోహిత్ కెప్టెన్సీపై విమర్శలకు తావిచ్చింది. ఫీల్డర్లను డీప్ పాయింట్, డీప్ స్క్వేర్ లెగ్‌లో మోహరించడంతో హెడ్ ఇబ్బంది లేకుండా సింగిల్స్, డబుల్స్‌తో వేగంగా రన్స్ రాబట్టాడు. ఈ జోడీ వికెట్ కోల్పోకుండా సెషన్‌ను ముగించింది.

బుమ్రా కట్టడి చేసినా..: ఆఖరి సెషన్‌లో బుమ్రా కొత్త బంతితో మరో మూడు వికెట్లు తీశాడు. కానీ అటు ఆసీస్ బ్యాటర్లు సైతం వేగంగా పరుగులు సాధించారు. స్మిత్, హెడ్ పోటాపోటీ బౌండరీలతో చెలరేగారు. అయితే హెడ్ 112 పరుగుల దగ్గర ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో రోహిత్ వదిలేశాడు. 80 ఓవర్లు పూర్తయ్యాక రెండో కొత్త బంతి అందుబాటులోకి రాగా అటు స్మిత్ కెరీర్‌లో 33వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ బుమ్రా అతడిని అవుట్ చేయడంతో దాదాపు 50 ఓవర్ల తర్వాత లభించిన వికెట్‌తో భారత్ ఊపిరి పీల్చుకుంది. అటు నాలుగో వికెట్‌కు 241 పరుగుల భారీ భాగస్వామ్యం కూడా ముగిసింది. స్వల్ప వ్యవధిలోనే బుమ్రా ఒకే ఓవర్‌లో మార్ష్ (5), హెడ్‌ను కూడా అవుట్ చేయడంతో ఆసీస్ తడబడినట్టు కనిపించింది. కానీ క్యారీ నిలకడగా ఆడుతూ రెండో రోజు ఆలౌట్ కాకుండా అడ్డుకున్నాడు. అలాగే కమిన్స్ (20)తో కలిసి ఐదో వికెట్‌కు 58రన్స్ జోడించడంతో స్కోరు 400 దాటింది.



బుమ్రాపై వివాదాస్పద వ్యాఖ్యలు

భారత స్టార్ పేసర్ బుమ్రాపై ఇంగ్లండ్ మహిళా కామెంటేటర్ ఇసా గుహ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. రెండో రోజు ఆట ఆరంభంలోనే తను రెండు వికెట్లు తీయడంతో సహచర ఫాక్స్ క్రికెట్ కామెంటేటర్ బ్రెట్ లీ కొనియాడాడు. దీనికి ఇసా బదులిస్తూ.. 'అవును. బుమ్రాను ఎంవీపీగా పిలవొచ్చు. అత్యంత విలువైన ప్రైమేట్ బుమ్రా' అని పేర్కొంది. తన ఉద్దేశం ఏమిటో కానీ తోకలేని కోతిని ప్రైమేట్ అని పిలుస్తుంటారు.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖవాజా (సి) పంత్ (బి) బుమ్రా 21; మెక్‌స్వీనే (సి) విరాట్ (బి) బుమ్రా 9; లబుషేన్ (సి) విరాట్ (బి) నితీశ్ 12; స్మిత్ (సి) రోహిత్ (బి) బుమ్రా 101; హెడ్ (సి) పంత్ (బి) బుమ్రా 152; మార్ష్ (సి) విరాట్ (బి) బుమ్రా 5; క్యారీ (బ్యాటింగ్) 45; కమిన్స్‌(సి) పంత్ (బి) సిరాజ్ 20; స్టార్క్ (బ్యాటింగ్) 7; **ఎక్స్‌ట్రాలు: 33; మొత్తం: 101 ఓవర్లలో 405/7. వికెట్ల పతనం:** 1-31, 2-38, 3-75, 4-316, 5-326, 6-327, 7-385; **బౌలింగ్:** బుమ్రా 25-7-72-5; సిరాజ్ 22.2-4-97-1; ఆకాశ్ 24.4-5-78-0; నితీశ్ 13-1-65-1; జడేజా 16-2-76-0.

'సెనా' (ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా) జట్లపై ఎక్కువ (8) సార్లు 5+ వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా బుమ్రా. కపిల్ (7 సార్లు)ను అధిగమించాడు.

1 భారత్‌పై ఎక్కువ టెస్టు శతకాలు (10) బాదిన బ్యాటర్‌గా రూట్‌తో కలిసి టాప్‌లో ఉన్న స్మిత్. అలాగే ఆసీస్ తరఫున పాంటింగ్ (41) తర్వాత రెండో స్థానం (33)లో నిలిచాడు.

3 టెస్టుల్లో ఒకే జట్టుపై ఎక్కువ క్యాచ్‌లు (ఆసీస్‌పై 71) పట్టిన మూడో ప్లేయర్‌గా విరాట్. బోర్డర్ (ఇంగ్లండ్‌పై) కూడా అన్నే క్యాచ్‌లు పట్టగా.. టాప్‌లో స్మిత్ (ఇంగ్లండ్‌పై 76), జయవర్ధనె (ఇంగ్లండ్‌పై 72) ఉన్నారు.

సీఏకు రూ.5.4 కోట్ల నష్టం

భారత్-ఆసీస్ జట్ల మధ్య జరిగిన మూడో టెస్టు తొలి రోజు ఆట వర్షం కారణంగా 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. దీంతో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తమ పాలసీ ప్రకారం ప్రేక్షకులకు టిక్కెట్ల పూర్తి సొమ్మును రిఫండ్ చేయనుంది. ఈ కారణంగా బోర్డు రూ.5.4 కోట్ల సొమ్ము నష్టపోనుంది. మరో 10 బంతుల ఆట జరిగుంటే 15 ఓవర్ల ఆట అయ్యేది కాబట్టి.. సీఏ పూర్తి రిఫండ్ నుంచి బయటపడేది.



భారత్‌దే జూనియర్ హాకీ ఆసియా కప్

ఫైనల్లో చైనాపై విజయం

మస్కట్: మహిళల జూనియర్ ఆసియా కప్ హాకీ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండోసారి చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం చైనాతో జరిగిన ఈ ఫైనల్లో భారత్ పెనాల్టీ షూటౌట్ ద్వారా 4-2 తేడాతో విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. మొదట పెనాల్టీ స్ట్రోక్ ద్వారా చైనా గోల్ సాధించి 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత 41వ నిమిషంలో దీపిక గోల్‌తో భారత్ పోటీలోకి వచ్చింది. విజేతను తేల్చేందుకు పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. ఇందులో భారత్ 4 గోల్స్ చేసి ఒక్కసారి మాత్రమే విఫలం కాగా.. అటు చైనా ప్రయత్నాలను గోల్‌కీపర్ నిధి అద్భుతంగా అడ్డుకోవడంతో కేవలం రెండు గోల్స్ చేసి నిరాశలో మునిగింది. కాగా భారత ప్లేయర్లకు తలా రెండేసి లక్షల నజరానాను హాకీ ఇండియా ప్రకటించింది.

అన్‌క్యాప్డ్ అధరహో!

డబ్ల్యూపీఎల్ వేలం

- సిమ్రన్‌కు రూ. 1.90 కోట్లు
- కమలినికి రూ. 1.60 కోట్లు
- ప్రేమకు రూ. 1.20 కోట్లు
- తెలుగమ్మాయి శ్రీచరణికి రూ. 55 లక్షలు



సిమ్రన్

కమలిని

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2025 సీజన్‌కు నిర్వహించిన మినీ వేలంలో భారత్‌కు చెందిన అన్‌క్యాప్డ్ క్రికెటర్లపై కాసుల వర్షం కురిసింది. బరిలో నిలిచిన సీనియర్లను కాదని ఐదు ఫ్రాంచైజీలు, ఇంకా భారత సీనియర్ జట్టుకు ఆడని కుర్ర క్రికెటర్లపట్ల మొగ్గు చూపాయి. దాంతో ఆల్‌రౌండర్లకు కళ్లుచెదిరే మొత్తం లభించింది. ముంబైకి చెందిన సిమ్రన్ షేక్ రూ.1.90 కోట్లతో ఈ వేలంలో అత్యధిక ధర పలికిన క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పింది. గుజరాత్ జెయింట్స్ ఆమెను కైవసం చేసుకుంది. తమిళనాడుకు చెందిన కమలిని (16) రూ. 1.60 కోట్ల ధర పలికింది. ముంబై ఇండియన్స్ కమలినిని సొంతం చేసుకుంది. ఉత్తరాఖండ్‌కు చెందిన ప్రేమా రావత్‌ను రూ.1.20 కోట్లకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కొనుగోలు చేసింది. సీనియర్ల విషయానికొస్తే..వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డియాండ్ర డాటిన్‌ను రూ. 1.70 కోట్లకు గుజరాత్ జెయింట్స్ దక్కించుకుంది. డాటిన్ వేలంలో రెండో అత్యధిక మొత్తానికి అమ్ముడైన క్రికెటర్‌గా నిలిచింది. ఐదు జట్లలో మొత్తం 19 స్థానాలే ఉండగా 120 మంది క్రికెటర్లు వేలంలో నిలిచారు.

అమ్ముడైన వారిలో కొందరు..

1. సిమ్రన్ షేక్-రూ.1.90 కోట్లు-గుజరాత్
2. డియాండ్ర డాటిన్-రూ.1.70 కోట్లు-గుజరాత్
3. కమలిని-రూ.1.60 కోట్లు-ముంబై
4. ప్రేమా రావత్-రూ.1.20కోట్లు-బెంగళూరు
5. శ్రీ చరణి-రూ. 55 లక్షలు-ఢిల్లీ
6. డి క్లెర్క్-రూ.30 లక్షలు-ముంబై
7. డానిలి గిబ్సన్-రూ.30లక్షలు-గుజరాత్
8. అలనా కింగ్-రూ.30లక్షలు-యూపీ
9. అక్షితా మహేశ్వరి-రూ.20లక్షలు-ముంబై



శ్రీ చరణి

శ్రీ చరణి..లక్షాధికారి..: ఆంధ్ర ఆల్‌రౌండర్ నల్లపురెడ్డి శ్రీ చరణికి కూడా ఊహించని మొత్తం లభించింది. రూ. 10 లక్షల ప్రాథమిక ధర కలిగిన ఆమె కోసం ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. ఆఖరికి రూ. 55 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్ శ్రీ చరణిని కొనుగోలు చేసింది. వేలంలో టాప్-5గా శ్రీ చరణి నిలవడం విశేషం. కడప జిల్లాకు చెందిన 20 ఏళ్ల శ్రీ చరణి ఎడమ చేతి బ్యాటింగ్‌తోపాటు లెఫ్టామ్ స్పిన్ బౌలింగ్ చేయగలదు.

పాక్‌పై భారత్ గెలుపు

అండర్-19 ఆసియాకప్

కౌలాలంపూర్: అండర్-19 ఆసియాకప్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో 9 వికెట్లతో విజయం సాధించింది. మహిళల ప్రీమియర్ లీగ్ వేలంలో కోటీ 60 లక్షలతో అదరగొట్టిన ఓపెనర్ కమలిని (29 బంతుల్లో 44 నాటౌట్) అలరించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 67 పరుగులు చేసింది. సోనమ్ యాదవ్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారత్ 7.5 ఓవర్లలోనే 68/1 స్కోరుతో మ్యాచ్‌ను ముగించింది. మరో ఆరంభ మ్యాచ్‌లో శ్రీలంక జట్టు మలేసియాపై గెలిచింది.

'ముస్తాక్ అలీ' విజేత ముంబై



కెప్టెన్ శ్రేయాస్

బెంగళూరు: రెండేళ్ల తర్వాత ముంబై జట్టు మరోసారి సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ విజేతగా నిలిచింది. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో ఆ జట్టు 5 వికెట్లతో మధ్యప్రదేశ్‌పై గెలుపొందింది. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన ఎంపీ 20 ఓవర్లలో 174/8 స్కోరు సాధించింది. కెప్టెన్ రజత్ పటీదార్ (81 నాటౌట్) అదరగొట్టాడు. అనంతరం ముంబై 17.5 ఓవర్లలో 180/5 స్కోరు చేసి విజయం అందుకుంది. సూర్యకుమార్ (48), రహానె (37), సూర్యాంశ్ (36 నాటౌట్) మెరిశారు. ముంబై ఈ టైటిల్ గెలవడం ఇది రెండోసారి.

ఘనమైన బోణీ

తొలి టీ20లో భారత్ గెలుపు

ముంబై : వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్‌లో ఆదివారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో 49 పరుగులతో విజయం సాధించారు. మొదట భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగులు చేసింది. జెమీమా (73), మంధాన (54) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. ఛేదనలో టిటాస్ (3/37) ధాటికి వెస్టిండీస్ 7 వికెట్లకు 146 పరుగులే చేసి ఓడింది. డాటిన్ (52), క్వియానా (49) రాణించారు. స్పిన్నర్లు దీప్తిశర్మ, రాధా యాదవ్ చెరో రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు.

సంక్షిప్తస్కోర్లు : భారత్ 20 ఓవర్లలో 195/4 (జెమీమా 73, మంధాన 54, ఉమ 24, రిచా 20, హర్మన్ 13 నాటౌట్, కరిష్మా 2/18); **వెస్టిండీస్ 20 ఓవర్లలో 146/7** (డాటిన్ 52, క్వియానా జోసెఫ్ 49, టిటాస్ సిద్ధూ 3/37, దీప్తిశర్మ 2/21, రాధ 2/28).

బిజినెస్

ఎన్‌సీఎల్‌ఏటీలో ఈఐహెచ్‌కి చుక్కెదురు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన గోల్డెన్ జూబ్లీ హోటల్స్ విక్రయానికి అనుమతిస్తూ ఎన్‌సీఎల్‌టీ జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ ఈఐహెచ్ లిమిటెడ్ దాఖలు చేసిన అప్పీలును ఎన్‌సీఎల్‌ఏటీ కొట్టివేసింది. గోల్డెన్ జూబ్లీ హోటల్స్ సంస్థ హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌ను నిర్వహిస్తోంది. ఈ అప్పీలుపై తీర్పు చెప్పిన ఎన్‌సీఎల్‌ఏటీ ఈ హోటల్ కోసం సింగపూర్ సంస్థ ఒకటి దాఖలు చేసిన బిడ్‌ను అనుమతిస్తూ ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును ఎన్‌సీ ఎల్‌ఏటీ ధ్రువీకరించింది. సీఓసీ (కమిటీ ఆఫ్ క్రెడిటార్స్) మెజారిటీ నిర్ణయాన్ని ప్రశ్నించేందుకు లేదా దాన్ని మరోసారి పరిశీలించాలని కోరేందుకు ఎవరికీ హక్కు లేదని తేల్చి చెప్పింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	633	విశాఖపట్నం	620
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	101	విజయవాడ	104
వరంగల్	101	గుంటూరు	107
కరీంనగర్	101	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	93
కర్నూలు	101	నెల్లూరు	93
విశాఖపట్నం	108	అనంతపురం	93
గోదావరి	104		

క్యూఐపీల రికార్డు

11 నెలల్లో రూ. 1.21 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో నవంబరుతో ముగిసిన 11 నెల కాలంలో భారత కంపెనీలు క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) మార్గం ద్వారా సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి ఏకంగా రూ.1.21 లక్షల కోట్లు సమీకరించాయి. క్యూఐపీల ద్వారా వార్షిక నిధుల సమీకరణ రూ.లక్ష కోట్లు దాటడం ఇదే తొలిసారి అని ప్రైమ్ డేటాబేస్ వెల్లడించింది. గత ఏడాదిలో నమోదైన రూ.52,350 కోట్లతో పోలిస్తే, క్యూఐపీల ద్వారా నిధుల సేకరణ ఈ ఏడాది రెండింతలకు పైగా పెరిగింది. మార్కెట్లో మెరుగైన పరిస్థితులతో పాటు అధిక వేల్యుయేషన్లు ఇందుకు కలిసి వచ్చాయి. ప్రైమ్ డేటాబేస్ తాజా డేటా ప్రకారం.. ఈ ఏడాదిలో నవంబరు వరకు 82 కంపెనీలు క్యూఐపీల ద్వారా రూ.1,21,321 కోట్లు సమీకరించాయి. గత ఏడాదిలో ఇదే కాలానికి 35 ఇష్యూల ద్వారా రూ.38,220 కోట్ల సమీకరణ జరిగింది. లిస్టెడ్ కంపెనీలు, పెట్టుబడి ట్రస్టులు నియంత్రణ మండలికి ముందస్తుగా పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేకుండా త్వరితగతిన నిధులు సమీకరించేందుకున్న మార్గాల్లో క్యూఐపీ ఒకటి.

మైనింగ్ దిగ్గజం వేదాంత, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో ఈ ఏడాది క్యూఐపీల ద్వారా అత్యధిక నిధులు సమీకరించిన కంపెనీలుగా నిలిచాయి. ఈ రెండూ చెరో రూ.8,500 కోట్లు సేకరించాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.8,373 కోట్లు, వరుణ్ బెవరేజెస్ రూ.7,500 కోట్లతో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ రూ.6,438 కోట్లు, గోద్రేజ్ ప్రాపర్టీస్ రూ.6,000 కోట్లు, కేఈఐ ఇండస్ట్రీస్ రూ.2,000 కోట్లు పోగేశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ నెలలో టొరెంట్ పవర్, భారత్ ఫోర్జ్, సెన్కో గోల్డ్, సమ్మాన్ క్యాపిటల్ కూడా క్యూఐపీల ద్వారా రూ.8,000 కోట్లకు పైగా సేకరించాయి. ఏడాది చివరి నాటికి లెక్క మరింత పెరగనుంది.

మళ్లీ ఎఫ్‌పీఐల జోరు

గత రెండు నెలల్లో భారీగా అమ్మకాలు సాగించిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ).. ఈ నెలలో మళ్లీ కొనుగోళ్ల జోరు పెంచారు. గడిచిన రెండు వారాల్లో (డిసెంబరు 1 నుంచి 13 వరకు) ఎఫ్‌పీఐలు దేశీయ ఈక్విటీల్లో నికరంగా రూ.22,766 కోట్ల పెట్టుబడులు పెట్టారు. అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీరేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు ఇందుకు దోహదపడ్డాయి. నవంబరులో ఎఫ్‌పీఐలు నికరంగా రూ.21,612 కోట్ల నిధులు ఉపసంహరించుకున్నారు. అక్టోబరులోనైతే ఏకంగా రూ.94,017 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. మన మార్కెట్ నుంచి ఎఫ్‌పీఐలు ఏదైనా నెలలో ఉపసంహరించుకున్న పెట్టుబడుల్లో ఇదే అత్యధికం. ఈ సెప్టెంబరులో మాత్రం ఎఫ్‌పీఐలు నికర పెట్టుబడులు తొమ్మిది నెలల గరిష్ఠ స్థాయి రూ.57,724 కోట్లుగా నమోదయ్యాయి. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐల నికర పెట్టుబడులు మాత్రం రూ.7,747 కోట్లకు పరిమితమయ్యాయి. అక్టోబరు, నవంబరులో ఇన్వెస్ట్‌మెంట్లు భారీగా తరలిపోవడం ఇందుకు కారణం.

చెల్లింపుల్లో యూపీఐ కింగ్

జనవరి -నవంబరు మధ్య కాలంలో రూ.223 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: నవంబరుతో ముగిసిన 11 నెలల కాలంలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా రూ.223 లక్షల కోట్ల విలువైన 15,547 కోట్ల చెల్లింపుల లావాదేవీలు జరిగాయని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. దేశంలో ఆర్థిక లావాదేవీల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులకు ఇదే నిదర్శనమని పేర్కొంది. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఈ విషయాన్ని పోస్ట్ చేసింది. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) 2016లో యూపీఐ సేవలను అందుబాటులోకి తెచ్చింది. యూపీఐ చెల్లింపులను వేగవంతం, సురక్షితం, సులభతరం చేయడంతో పాటు వ్యక్తులు, చిరు వ్యాపారాలు, వర్తకుల ఆర్థిక సాధికారతను పెంచింది. భారతదేశం నగదు రహిత చెల్లింపుల ఆర్థిక వ్యవస్థగా మారేందుకు బాటలు వేసింది.

వివోతో డిక్సన్ టెక్ జాయింట్ వెంచర్

న్యూఢిల్లీ: స్మార్ట్ ఫోన్లు సహా ఎలక్ట్రానిక్ డివైస్‌ల తయారీ కోసం చైనా మొబైల్ కంపెనీ వివో, ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ డిక్సన్ టెక్నాలజీస్ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయనున్నాయి. రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో ఈ విషయం వెల్లడించారు. జాయింట్ వెంచర్‌లో డిక్సన్ టెక్ 51 శాతం వాటాలు కలిగి ఉంటుంది. మిగతా వాటాలు వివో చేతిలో ఉంటాయి. ఇందుకోసం ఉభయ సంస్థలు ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. అయితే డిక్సన్, వివో రెండూ ఒక కంపెనీలో మరోటి ఎలాంటి వాటా కలిగి ఉండదు. ఈ జాయింట్ వెంచర్ కంపెనీ ఇండియాలో వివో ఓఈఎం ఆర్డర్లను స్వీకరించడంతో పాటు ఇతర బ్రాండ్లకు చెందిన వివిధ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ఓఈఎం కాంట్రాక్టులు కూడా చేపడుతుంది. అయితే ఈ జాయింట్ వెంచర్ ఎప్పటి నుంచి వాణిజ్యపరమైన ఉత్పత్తిని ప్రారంభిస్తుందని గాని, దీనికి సంబంధించిన ఆర్థిక వివరాలు గాని ఆ ప్రకటనలో తెలియచేయలేదు.

25000 పైన బుల్లిష్

(డిసెంబరు 16-20 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్ట్రో టెక్నికల్

గత వారం నిఫ్టీ: 24769 (+91)

నిఫ్టీ గత వారం 24792-24180 పాయింట్ల మధ్యన కదలాడి 91 పాయింట్ల లాభంతో 24769 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24588, 24607, 24424, 24169 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైకి రావడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 25000 బ్రేక్‌డౌన్ స్థాయి : 24500
నిరోధ స్థాయిలు: 24970, 25070, 25170 (24870 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24570, 24470, 24370 (24670 దిగువన బేరిష్)

నిర్ణయాత్మక దిశ దొరికేనా...

ఈక్విటీ మార్కెట్ ఈ వారం రేంజ్ బౌండ్ నుంచి బుల్లిష్‌గా ట్రేడ్ కావచ్చు. అయితే నిర్ణయాత్మక దిశ మాత్రం ఏర్పడకపోవచ్చు. గత శుక్రవారం సూచీలు తీవ్ర ఆటుపోట్లకు గురయ్యాయి. భారీ నష్టాల నుంచి అనూహ్యంగా లాభాల్లోకి వచ్చాయి. అంతర్జాతీయంగా పరిస్థితులు మెరుగవుతుండడం, క్రూడాయిల్ ధరల్లో స్థిరత్వం, విదేశీ సంస్థాగత మదుపరులు తిరిగి వస్తుండడం ఇందుకు దోహదపడ్డ కీలకాంశాలు. క్రితం వారం కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, టూరిజం, మెటల్, రియల్టీ రంగాల షేర్లు రాణించాయి. మీడియా, ఎనర్జీ, పీఎస్‌యూ బ్యాంకులు, ఆయిల్ అండ్ గ్యాస్, ఫార్మా షేర్లు నష్టపోయాయి.

స్టాక్ రికమండేషన్స్

క్రిసిల్: ఈ రేటింగ్ కంపెనీ షేర్లు చక్కని మూమెంటమ్ కనబరుస్తున్నాయి. నిఫ్టీతో పోలిస్తే జోరుమీదున్నాయి. రిస్క్ రివార్డ్ అనుకూలంగా ఉంది. ఏడాదిన్నర నిరోధాన్ని అధిగమించడమే కాకుండా పై స్థాయిలో నిలదొక్కుకుంటున్నాయి. గత శుక్రవారం ఈ షేరు 5.27 శాతం లాభంతో రూ.5817 వద్ద ముగిసింది. రూ.6250/6300 టార్గెట్‌తో రూ.5800 శ్రేణిలో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.5720.

భారతీ ఎయిర్‌టెల్: ఆర్పూ పెరగడం, టెలికాం రంగంలో ఎఫ్‌పీఐలు పొజిషన్లు తీసుకుంటుండడంతో ఇన్వెస్టర్లు ఈ షేరుపై ఆసక్తి కనబరుస్తున్నారు. మూమెంటమ్, ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. చివరి 2 సెషన్లలోనే 8శాతం మేరకు పెరిగిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1750/1800 టార్గెట్‌తో రూ.1650 స్థాయిలో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.1610.

ఇండియన్ హోటల్స్: పెళ్లిళ్ల సీజన్ కావడం, ఈపీఎస్, అమ్మకాల వృద్ధిరేటు గణనీయంగా పెరగడంతో ఈ షేరు జోరుమీదుంది. నిఫ్టీతో పోల్చితే అత్యధిక రాబడి అందిస్తోంది. త్రైమాసిక ఫలితాలు వెలువడిన అనంతరం డెలివరీ వాల్యూమ్ విపరీతంగా పెరిగింది. గత శుక్రవారం 2.26 శాతం లాభంతో రూ.855 వద్ద ముగిసింది. రూ.980 టార్గెట్ ధరతో రూ.830 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.800.

భారత్ డైనమిక్ లిమిటెడ్: జూన్ త్రైమాసిక ఫలితాలు నిరాశావహంగా ఉండడంతో ప్రారంభమైన డౌన్ ట్రెండ్ సెప్టెంబరు ఫలితాల తర్వాత నిలిచిపోయింది. రూ.1000 వద్ద ఈ షేరు టర్న్ అరౌండ్ అయి రూ.1200 వద్ద నిరోధాన్ని అధిగమించింది. డిఫెన్స్ రంగం మళ్లీ పుంజుకోవడంతో ఈ షేర్లకు డిమాండ్ నెలకొంది. శుక్రవారం ఈ షేరు రూ.1260 వద్ద ముగిసింది. రూ.1450 టార్గెట్ ధరతో రూ.1200 వద్ద ప్రవేశించవచ్చు. స్టాప్‌లాస్ రూ.1140.

బజాజ్ ఫిన్‌సర్వ్: 40 సెషన్లుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయికి 17 శాతం దూరంలో ఉంది. డిసెంబరు నుంచి మళ్లీ మూమెంటమ్ పెరిగింది. రూ.1550 స్థాయిలో మద్దతు తీసుకుని వరుస లాభాల్లో ముగుస్తోంది. గత శుక్రవారం ముగింపు రూ.1679. ఇన్వెస్టర్లు రూ.1960 టార్గెట్‌తో రూ.1650 వద్ద పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.1600.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

నిరోధ స్థాయి 25000

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం తొలి నాలుగు రోజుల్లో 24,500 స్థాయిలో బలమైన కన్సాలిడేషన్ సాధించింది. శుక్రవారం ఒక దశలో 350 పాయింట్ల మేరకు ఇంట్రాడే రియాక్షన్ సాధించినా బలంగా కోలుకుని వారం మొత్తానికి 90 పాయింట్ల లాభంతో 24,770 వద్ద ముగిసింది. పుల్‌బ్యాక్ రియాక్షన్ అనంతరం మద్దతు స్థాయిలకు పైనే బలమైన రికవరీ సాధించి ట్రెండ్ పటిష్ఠంగా నిలబెట్టుకుంది. వరుసగా నాలుగు వారాలుగా అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 1500 పాయింట్ల మేరకు రిలీఫ్ ర్యాలీ సాధించింది. గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 290 పాయింట్ల మేరకు లాభపడి 59,000 సమీపంలో ఉంది. అయితే స్మాల్‌క్యాప్-100 సూచీ మాత్రం 85 పాయింట్ల మేరకు నష్టపోయింది. టెక్నికల్‌గా ప్రస్తుతానికి ట్రెండ్ సానుకూలంగానే ఉంది. అయితే శుక్రవారం అమెరికన్ మార్కెట్లో ఏర్పడిన బలహీనత కారణంగా ఈ వారం మరింత అప్రమత్త ట్రెండ్ సాధించవచ్చు. అలాగే నిఫ్టీ మానసిక అవధి 25,000 చేరువకు వస్తోంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం తదుపరి నిరోధం 24,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 25,000. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: సూచీకి మైనర్ మద్దతు స్థాయి 24,650. ప్రధాన మద్దతు స్థాయి 24,500. బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం ఈ స్థాయిల్లో నిలదొక్కుకుని తీరాలి. 24,500 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత శుక్రవార 1500 పాయింట్ల మేరకు రికవరీ సాధించి 53,850 వద్ద నిలకడగా ముగిసింది. జీవితకాల గరిష్ఠ స్థాయి 54,000కి చేరువవుతోంది. ప్రధాన నిరోధం 54,100. మరింత సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 54,500. బలహీనత ప్రదర్శించినా సానుకూలతను కొనసాగించేందుకు మద్దతు స్థాయి 53,000 వద్ద నిలదొక్కుకోవాలి.

పాటర్న్: గత వారం నిఫ్టీ 50, 100 డీఎంఏల వద్ద రికవరీ సాధించింది. 25000 వద్ద "అడ్డంగా ఏర్పడిన ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన నిరోధం ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ నిరోధాన్ని ఛేదించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,850, 24,940
మద్దతు	24,680, 24,600



గద్దర్ సాహిత్య పుస్తకాలను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు తదితరులు

కేసీఆర్‌కు అండగా గద్దర్

- తన పాటలతో ఉద్యమానికి ఊపు తెచ్చిన విప్లవ వీరుడు
- త్వరలో సిద్దిపేటలో గద్దర్ విగ్రహం: హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమానికి, కేసీఆర్‌కు గద్దర్ అండగా నిలబడ్డారని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఐదు దశాబ్దాల కాలంలో జరిగిన ప్రతి పోరాటంలో గద్దర్ తన వంతు పాత్ర పోషించి పోరాటయోధుడిగా, తన పాటలతో ఉద్యమాలకు ఊపు అందించిన వీరుడిగా నిలిచారని మెచ్చుకున్నారు. 'గద్దర్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో గద్దర్ సాహిత్య పుస్తకాలను ఆదివారం సిద్దిపేటలోని విపంచి కళా నిలయంలో హరీశ్‌రావు ఆవిష్కరించి మాట్లాడారు. విప్లవ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం.. ప్రతి దాంట్లో గద్దర్ న్యాయం వైపు నిలిచి అన్యాయాన్ని ప్రశ్నించారని కొనియాడారు. సామాన్య పదాలతో ప్రజల హృదయాలల్లోకి చేరే విధంగా గద్దరన్న పాటలు ఉంటాయని, మలిదశ ఉద్యమంలో ఆయనతో కలిసి పని చేయడం తాను అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. 'పొడుస్తున్న పొద్దుమీద' పాట తెలంగాణ ఉద్యమానికి ఊపు తెచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చాక జీహెచ్‌ఎంసీ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని గద్దర్ లెటర్ రాస్తే వారికి వెంటనే ఒక్క సంతకంతో జీతాలు పెంచి గద్దర్‌కు కేసీఆర్ ఎంతో గౌరవం ఇచ్చారని చెప్పారు. 'తూప్రాన్‌లో నీళ్లలేవు.. హల్దీ వాగులో నుంచి వాటిక చెరువుకు లిఫ్ట్ పెట్టాల'ని గద్దర్ కోరితే 8 నెలల్లో పూర్తి చేసి ఆయనతోనే ప్రారంభించామని గుర్తుచేశారు. త్వరలో సిద్దిపేటలో గద్దరన్న విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. గద్దర్ ఫౌండేషన్ పేరిట తన తండ్రి పోరాటాన్ని రేపటి తరానికి తెలియజేస్తున్న గద్దర్ తనయుడు సూర్యంను ఈ సందర్భంగా హరీశ్‌రావు అభినందించారు.



కొండపల్లి సీతారామయ్య రచనల్లోని 2 సంపుటాలను ఆవిష్కరిస్తున్న కృష్ణాబాయి, సుజాత,అల్లం నారాయణ, వీ శ్రీనివాస్, హర్ష ఠాకూర్ తదితరులు

విప్లవోద్యమ నిర్మాణానికి దిక్సూచి కేఎస్ రచనలు

- విరసం వ్యవస్థాపక సభ్యురాలు కృష్ణాబాయి
- కేఎస్ సంపూర్ణ రచనల్లో 2 సంపుటాల ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి సీతారామయ్య(కేఎస్) రచనలు విప్లవోద్యమ నిర్మాణానికి దిక్సూచిలా పని చేస్తాయని వక్తలు పేర్కొన్నారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానాన్ని ఆచరించడానికి, మన దేశ కాలమాన పరిస్థితులకు అన్వయించడానికి కేఎస్ రచనలు చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కిచెప్పారు. కేఎస్ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టు విప్లవ మహోపాధ్యాయుడు దివంగత కొండపల్లి సీతారామయ్య సంపూర్ణ రచనల్లోని 2 సంపుటాలను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యురాలు కృష్ణాబాయి మాట్లాడుతూ.. విప్లవోద్యమ నిర్మాణ పద్ధతులపై కొండపల్లి సీతారామయ్య స్పష్టమైన అవగాహన కలిగిన నాయకుడని, ప్రజాసంఘాల నిర్మాణంలో ఉక్కు మనిషిగా చారిత్రాత్మకమైన పాత్ర పోషించారని కొనియాడారు. కుల సమస్యపై కేఎస్ వ్యాసం చదువుతుంటే అంబేడ్కర్ రచనలు గుర్తొచ్చాయని ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత శ్లాఘించారు. తెలంగాణ ఉద్యమానికి దన్నుగా నిలిచింది కమ్యూనిస్టు పార్టీ లేనని, వారు పాల్గొనడం వల్లే ప్రత్యేక రాష్ట్రం సఫలీకృతమైందని అల్లం నారాయణ వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ఆత్మవిమర్శ అవసరాన్ని తెలియజేసిన అరుదైన మార్క్సిస్టు కొండపల్లి సీతారామయ్య అని స్వతంత్ర జర్నలిస్టు హర్ష ఠాకూర్ అన్నారు. కేఎస్ రచనలు ఇంగ్లిషులోకి అనువాదం కావాలని సూచించారు. కొండపల్లి సీతారామయ్య మారు పేర్లతోనే రచనలన్నీ చేశారని, లభ్యమైనవాటన్నింటినీ పది సంపుటాలుగా 'కేఎస్ మెమోరియల్ కమిటీ' నుంచి వెలువరిస్తున్నట్లు డాక్టర్ వి. శ్రీనివాస్ తెలిపారు.

స్లో స్పీడ్ కారిడార్!

ఔటర్ రింగ్ రోడ్‌పై టోల్ నిర్వహణ అస్తవ్యస్తం.. ప్లాజాల వద్ద భారీగా నిలుస్తున్న వాహనాలు

ఎగ్జిట్ రోడ్లు నిండిపోయి ఓఆర్ఆర్ పైవరకు చేరిక.. 'ఆంధ్రజ్యోతి' క్షేత్ర స్థాయి పరిశీలన

ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్).. విశ్వ నగరిగా ఎదుగుతున్న హైదరాబాద్‌కు గ్రోత్ కారిడార్..! నగరంపై ట్రాఫిక్ భారం పడకుండా చేపట్టిన భారీ నిర్మాణం..! వాహనాలు అత్యంత సాఫీగా వెళ్లేలా చూడడం దీని ఉద్దేశం..! అలాంటి ఓఆర్ఆర్‌పైనే తీవ్ర 'జామ్'ఝాటం..! టోల్‌ప్లాజాల నిర్వహణ అస్తవ్యస్తం.. ఫలితంగా ప్లాజాల వద్ద భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి..! ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు.





ఔటర్ రింగ్ రోడ్‌పై రెండో లైన్‌లో వెళ్తున్న భారీ వాహనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కంటే ముందున్నదని చెప్పే కర్ణాటక రాజధాని బెంగళూరును 'ట్రాఫికర్' ఎంత అప్రదిష్ఠ పాల్జేసిందో అందరూ చూశారు. సోషల్ మీడియాలోనూ దీనిపై అనేక వ్యంగ్య పోస్టులు, వీడియోలు వచ్చాయి. ట్రాఫిక్ కష్టాలను సాకుగా చూపుతూ పరిశ్రమలను బెంగళూరు నుంచి తరలించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఓఆర్ఆర్‌పై నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించకుంటే హైదరాబాద్‌కూ వచ్చే ఏడెనిమిదేళ్లలో ఇలాంటి అనుభవమే ఎదురవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అందుకని ప్రభుత్వం తక్షణం దృష్టిసారించిన అవసరం ఉంది.

సాఫీ కాదు.. సంకట పరిస్థితి

వాహనాలు సాఫీగా సాగిపోయేందుకు నిర్మించిన ఔటర్‌పైనే ట్రాఫిక్ 'జామ్'ఝాటం నెలకొంటోంది. నిర్వహణలో కనీస నిబంధనలు పాటించక పోవడంతో పరిస్థితి అస్తవ్యస్తం అవుతోంది. సాంకేతికతను అందిపుచ్చుకొని వాహనాలు కదిలేందుకు మెరుగైన చర్యలు చేపట్టడం లేదు. టోల్‌ప్లాజాల వద్ద ఒక్కో లైన్‌లో ఉండే బూమ్ బారియర్స్ పనిచేయడం లేదు. పైకి లేస్తే కిందికి రావడం లేదు. కిందికి వస్తే పైకి లేవడం లేదు. టోల్‌బూత్ సిబ్బంది వచ్చి వాటిని బలవంతంగా పక్కకు జరిపి వాహనాలను వదిలే పరిస్థితి నెలకొంది. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య ఔటర్‌పై 'ఆంధ్రజ్యోతి' చేసిన పరిశీలనలో ఇలాంటి లోపాలు స్పష్టంగా కనిపించాయి.

1, 2 లేన్లలోకి దూసుకొస్తున్న భారీ వాహనాలు

ఔటర్‌పైకి వచ్చే భారీ వాహనాలు గరిష్ఠంగా 80కిలో మీటర్ల వేగంతో ప్రయాణం చేస్తాయి. ఇవి ప్రయాణించేందుకు నిర్దేశించిన 3, 4 లేన్లలో గరిష్ఠ వేగం 80 కిలో మీటర్లు. కానీ, భారీ వాహనాలు 1, 2 లేన్లలోకి వచ్చేస్తున్నాయి. వీటిలో గరిష్ఠ వేగ పరిమితి 120 కిలోమీటర్లు. దీంతో అదే వేగంతో వెళ్లే కార్ల డ్రైవర్లు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఒకటి, రెండు లేన్లలోకి నెమ్మదిగా వెళ్లే భారీ వాహనాలు రావడంతో ఆందోళన చెందుతున్నారు. భారీ వాహనాలు 1, 2 లైన్లలోకి రాకూడదంటూ అవగాహన కల్పించేలా టోల్‌బూత్‌ల వద్ద బోర్డులు, చర్యలు చేపట్టడం లేదు. జరిమానాలు విధిస్తామనే హెచ్చరికలూ లేవు. ఇంటర్ ఛేంజ్‌ల వద్ద ఇతర రాష్ట్రాల నుంచి భారీ వాహనదారులు ఏ వైపు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో ఓ మార్గంలో వెళ్లిన తర్వాత తప్పుగా వెళ్తున్నామని భావించి వాహనాన్ని తిప్పుతున్నారు. ఇలా రాంగ్ రూట్‌లో వస్తున్నా హెచ్చరించేవారు కరువయ్యారు.

- ఔటర్ నిర్మాణ సమయంలోనే ఓవైపు ఆరు.. మరో వైపు ఆరు చొప్పున 12 టోల్‌బూత్‌లతో డిజైన్ చేశారు. ట్రాఫిక్ బాగా ఉన్నప్పుడు వాడేందుకు ఓవైపు మూడు.. మరోవైపు మూడు తాత్కాలిక బూత్‌లు కూడా ఉన్నాయి. కానీ, రద్దీ సందర్భంలోనూ వీటిని తెరవడం లేదు. పైగా 12 బూత్‌లలోనే ఒకటి, రెండు మూసేస్తున్నారు. ఇటీవల ఒక్కో లేన్‌లో 20 వరకు వాహనాలు ఉండగా.. 11వ లేన్ మూసేశారు. దీంతో మిగతా లైన్లలో వాహనాలు బారులు తీరుతున్నాయి. ఎల్లో లైన్ దాటిపోతున్నా పట్టించుకోవడం లేదు. సిబ్బంది పర్యవేక్షణ శూన్యం.

ఎల్లో లైన్ దాటినా.. ఉచితం లేదు

టోల్ వసూళ్ల కోసం ఏజెన్సీ ఏర్పాటు చేసిన సందర్భంలో హెచ్‌ఎండీఏ అధికారులు నిబంధనలు విధించారు. వాటి ప్రకారం టోల్‌ప్లాజాల వద్ద ఒక లైన్‌లో 20 వాహనాలకు మించి ఉంటే రుసుము తీసుకోకుండానే వదలాలి. ఈ నిబంధన అమలుకు టోల్‌ప్లాజాల వద్ద వంద మీటర్ల లోపే ఎల్లో లైన్లను గీశారు. ఇప్పుడు ఎక్కడా దీనిని పట్టించుకోవడం లేదు. ఔటర్‌ను 30 ఏళ్లకు ప్రైవేటుకు లీజుకిచ్చినా ఈ నిబంధన కొనసాగుతోంది. కానీ, అమలుకావడం లేదు. వాహనదారులకు అవగాహన కల్పించేందుకు ఈ నిబంధనలేవీ బోర్డు రూపంలో పెట్టలేదు.

- వందల వాహనాలున్నా టోల్ చెల్లించాకే వెళ్లాల్సిన పరిస్థితి. ఇక వాహన రాకపోకలతో కొన్ని ప్రాంతాల్లో ఎల్లో లైన్లు తుడుచుకుపోగా.. మరికొన్నిచోట్ల రోడ్ల రీ కార్పెటింగ్ చేసిన తర్వాత గీతలు గీయలేదు.

ఉదయం, సాయంత్రం ట్రాఫికర్

ఔటర్‌పై ఉదయం, సాయంత్రం శంషాబాద్, రాజేంద్రనగర్, కోకాపేట, టీజీపీఏ, నానక్‌రాంగూడ తదితర టోల్‌ప్లాజాల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ లవుతున్నాయి. ఈ వేళల్లో ఔటర్‌పైకి వచ్చేందుకు, ఎగ్జిట్ అయ్యేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- రాజేంద్రనగర్ ఎగ్జిట్ టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరి చివరకు ఔటర్‌పైకి చేరుతున్నాయి. ఔటర్‌పై నాలుగో లైన్‌లో బారులు తీరిన కానీ వెనుక నుంచి ఏ వాహనం వేగంగా దూసుకొస్తున్నదో తెలియక ఆందోళన చెందే పరిస్థితులున్నాయి.
- శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఔటర్ పైకి చేరుకునే వాహనాలు టోల్‌ప్లాజాల వద్ద సాంకేతిక సమస్యలతో నిలిచిపోయి.. చివరకు జాతీయ రహదారి 44పైకి కూడా చేరుతున్నాయి. పలు టోల్‌ప్లాజాల వద్ద ఔటర్ పైకి చేరుకునేందుకు, దిగిపోయేందుకు (ఎగ్జిట్) 15 నిమిషాలకు పైగా పడుతోంది. 158 కిలోమీటర్ల ఔటర్ పరిధిలో ప్రతి 16 కిలోమీటర్లకు పది అడ్వాన్స్ లైఫ్ సపోర్టు అంబులెన్స్‌లున్నాయి. సాధారణ వాహనాలతో పాటే ఇవి కూడా రద్దీలో చిక్కుకుంటున్నాయి. గత గురువారం రాత్రి నానక్‌రాంగూడ వద్ద 10వ టోల్ బూత్ నుంచి ఇతర వాహనాల వెనుకే ఓ ప్రముఖ ఆస్పత్రి అంబులెన్స్ చాలాసేపు ఆగిపోయింది.

సమయం: రాత్రి 8 గంటలు..! హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్‌పై ఓ వాహనం నార్సింగి వద్ద ఆగిపోయింది. డ్రైవర్ బండిని పక్కకు తీశాడు. పది నిమిషాలు ప్రయత్నించినా ఇతర వాహనదారులెవరూ ఆపలేదు. అత్యవసరంలో సాయం అందించే ఎస్‌వోఎస్‌కు (సేవ్ అవర్ సోల్) చేరుకుని బటన్ నొక్కాడు. 'సార్ నా వాహనం ఆగిపోయింది. సాయం చేయండి' అని కోరాడు. ఎస్‌వోఎస్‌లో మాత్రం.. 'సారీ అండి, టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి?' అని చెప్పి కట్ చేశారు. టోల్ ఫ్రీ ఎక్కడుందో తెలియక డ్రైవర్ మళ్లీ ఇతర వాహనాలను ప్రయత్నం చేశాడు. అప్పుడు ఔటర్ క్షేత్ర స్థాయి పరిశీలనలో ఉన్న 'ఆంధ్రజ్యోతి'.. అతడి ఇబ్బంది తెలుసుకుంది. ఓ మెకానిక్‌తో ఫోన్‌లో సంప్రదించి సమస్యను పరిష్కరించింది. ఎస్‌వోఎస్ కూడా చేతులెత్తేసిన పరిస్థితుల్లో.. ఔటర్‌పై గంటన్నరపైగా ఒక్క పెట్రోలింగ్ వాహనం లేదు. ఇవే కాదు.. టోల్ ప్లాజాల వద్ద తగిన సిబ్బంది లేరు. అత్యంత కీలకమైన నానక్‌రాంగూడ వంటి చాలాచోట్ల ఉదయం, రాత్రిళ్లు వందల మీటర్లకు మించి పెద్దఎత్తున వాహనాలు బారులు తీరుతున్నా.. సజావుగా, వేగంగా వెళ్లేందుకు చర్యలు చేపట్టడం లేదు.

కనిపించని పెట్రోలింగ్ వాహనాలు

నానక్‌రాంగూడ నుంచి శంషాబాద్ మార్గంలో 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో ఒక్క పెట్రోలింగ్ వాహనం కనిపించలేదు. ప్రమాదం జరిగితే క్షణాల్లోనే పెట్రోలింగ్ సిబ్బంది రావాలి. టోయింగ్ వాహనంతో లారీని తొలగించి ట్రాఫిక్‌ను సుగమం చేయాలి. ఏదైనా వాహనం మొరాయిస్తే ఇతర వాటికి అడ్డు రాకుండా పక్కకు జరపాలి. హెచ్చరిస్తూ బారికేడ్లను పెట్టాలి. కానీ ఎస్‌వోఎస్ ద్వారా సంప్రదించినా స్పందన లేదు. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌లవుతున్నాయి. ఔటర్‌పైకి మనుషులు రాకుండా కంచె ఏర్పాటు చేశారు. నార్సింగి వద్ద దానిని తొలగించి వస్తున్నారు. అక్కడే సరుకు రవాణా వాహనాలను ఎక్కుతున్నారు. పెట్రోలింగ్ సిబ్బందికి తెలిసే ఇది సాగుతున్నదనే ఆరోపణలున్నాయి.



పనిచేయని బూమ్ బారియర్స్‌తో నిలిచిన వాహనాలు

పనిచేయని బూమ్ బారియర్స్.. రద్దీకి తగ్గ సిబ్బంది కరువు

ఔటర్‌పై 130 వరకు టోల్‌ప్లాజాలుండగా.. బూమ్ బారియర్స్ చాలాచోట్ల సాంకేతిక సమస్యలతో పనిచేయడం లేదు. వాహనాలు రాకుంటే బూమ్ బారియర్స్ కిందకు ఉండడం, వస్తే ఫాస్టాగ్ ద్వారా పైకి లేవడం చేయాలి. కానీ, ఫాస్టాగ్ అమల్లోకి వచ్చాక గ్రీన్ లైన్ వచ్చినా బూమ్ బారియర్స్ పైకి లేవడం లేదు. దీంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. బూమ్ బారియర్స్‌ను టోల్ సిబ్బంది బలవంతంగా పక్కకు జరపాల్సిన పరిస్థితులున్నాయి. కాగా, ఫాస్టాగ్ లైన్ ఉన్నా.. ఔటర్‌పై ప్రతి టోల్ బూత్‌లో సిబ్బంది తప్పని సరిగా ఉండాలి. వారు వాహనాలను గమనించాలి. ఫాస్టాగ్‌లో ఏదైన సమస్య వస్తే వెంటనే పరిష్కారం చేయాలి. కానీ, ప్రస్తుతం సిబ్బంది కరువయ్యారు. టీజీపీఏ వద్ద ఔటర్ ఎక్కే క్రమంలో ఉన్న రెండు టోల్ బూత్‌లకు కలిసి ఒక్కరే ఉన్నారు. ఫాస్టాగ్ లైన్‌లోని బూత్‌లో అసలే లేరు. ఇదేవిధంగా ఔటర్‌పై అన్ని ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లలో ఇదే పరిస్థితి. రాత్రి సమయంలో కూడా ఒక్కరే ఉంటున్నారు. ఇక నానక్‌రాంగూడ వద్ద దాదాపు 10కి పైగా టోల్ బూత్‌లు ఉంటే ఇద్దరు, ముగ్గురే సిబ్బంది ఉంటున్నారు. ఫాస్టాగ్ లైన్‌లో సిబ్బందిని పెట్టడం లేదు. సమస్య వస్తే పరిష్కారం లేక వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి. సిబ్బందిని చాలా వరకు కుదించారని చెబుతున్నారు. గతంలో నానక్‌రాంగూడ వద్ద టోల్, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్లతో కలిసి ఒక్కో షిఫ్ట్‌కు 30మందిపైగా ఉండేవారు. ఇప్పుడు 15మంది కూడా లేరని ఓ ఉద్యోగి వాపోయారు.

నువ్వు జైలు జీవితం అనుభవించావని అందర్నీ జైలుకు పంపుతావా?

- రేవంత్‌పై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'బ్యాగు నిండా నోట్ల కట్టలతో పట్టుబడి జైలు జీవితం అనుభవించిన నీలాగే.. అందర్నీ జైలుకు పంపాలని అనుకుంటున్నావా రేవంత్ రెడ్డి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తమ సంస్థ కార్యకలాపాల గురించి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన పథకం ప్రభావాన్ని చెప్పినందుకు ఎల్ అండ్ టీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను జైలుకు పంపిస్తాననడం సీఎం స్థాయి వ్యక్తికి తగదని విమర్శించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన సంస్థల అధిపతులను జైలుకు పంపుతానని రేవంత్ రెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇది సరైంది కాదని కేటీఆర్ ఆదివారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం చేసిన వ్యాఖ్యలు దిగజారుతున్న ఆయన మానసిక స్థితిని తెలియజేస్తున్నాయని వ్యాఖ్యానించారు. 'ఇలాంటి నిర్లక్ష్య వ్యాఖ్యలతో పరిశ్రమలకు ఏ సందేశం పంపుతున్నారు? ఇదేనా రాహుల్ గాంధీ దేశంలో పెట్టుబడులను ఆకర్షించడానికి తమ పార్టీ ముఖ్యమంత్రులకు నేర్పించిన గొప్ప వ్యూహం?' అని నిలదీశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పురోగమించిన తెలంగాణ... అనుభవరాహిత్యం, అసమర్థత, అవినీతి కలగలసిన రేవంత్ రెడ్డి పాలనలో అన్ని రంగాల్లో తిరోగమిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి రవాణా శాఖ ఆదాయం ఒక ముఖ్యమైన సూచీ అని, ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాకుండా.. ఇతర భారీ వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు వృద్ధిని చూపిస్తాయన్నారు. కానీ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు తగ్గి, ఆదాయం తిరోగమనంలో ఉందన్నారు. పొరుగున ఉన్న అయిదు రాష్ట్రాల్లో ఈ ఏడాది రవాణా శాఖ ఆదాయంలో 8 శాతం నుంచి 32 శాతం వృద్ధి నమోదైతే... తెలంగాణలో గత ఏడాది కంటే తక్కువగా ఉండడం విఫల ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందన్నారు. పాలన గాలికొదిలేసి కక్ష సాధింపు చర్యలకే పూర్తి సమయం కేటాయిస్తే ఫలితాలు ఇలాకాక మరెలా ఉంటాయని కేటీఆర్ విమర్శించారు. కాగా, టీపీసీసీ అధ్యక్షుడు ప్రశ్నించాల్సింది మాజీ సీఎం కేసీఆర్‌ను కాదని, సీఎం రేవంత్‌రెడ్డి తప్పిదాలపై నిలదీయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ రేవంత్ రెడ్డికి రాసిన లేఖను కేసీఆర్‌కు పంపారనే అనుమానం కలుగుతోందన్నారు.

ఏపీ నుంచి సన్నాల అక్రమ రవాణా

(మొదటి పేజీ తరువాయి)

కోసం తరలించేయత్నం చేశారు. వీటిలో 31 లారీలను పౌరసరఫరాలశాఖ అధికారులు సరిహద్దు ప్రాంతాల్లోనే అడ్డుకొని, రాష్ట్రంలోకి అనుమతి లేదని తిప్పి పంపారు. అయితే ఆ అధికారులు రాకముందే.. మరో 60 లారీలు ముదిగొండ మండలంలోకి ప్రవేశించాయి. అక్కడ.. వల్లభి మార్కెటింగ్ చెక్‌పోస్టు వద్ద లారీకి రూ.5,800 చొప్పున మార్కెటింగ్ సెస్‌ను రాసి అనుమతించారు. ఆ లారీలు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు వెళుతుండగా నేలకొండపల్లి మండలం చెరువుమాధారం వద్ద కొందరు రైతులు అడ్డుకున్నారు. అక్రమంగా ధాన్యం తరలిస్తున్నట్లు అనుమానంతో 20లారీలను పోలీసులకు అప్పగించారు. దాంతో పోలీసులు అనుమతి లేకుండా వచ్చినందుకు లారీకి రూ.3వేల చొప్పున జరిమానా విధించి లారీలను వదిలేశారు. వాస్తవానికి విజయవాడ-హైదరాబాద్ జాతీయ ఉన్నా లారీలు అటువైపుగా వెళ్లకుండా ఖమ్మం జిల్లా ముదిగొండ, నేలకొంపడ పల్లి మండలాల మీదుగా కోదాడ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, ప్రాంతాలకు వెళుతున్నాయి. లారీలు ఒకేసారి కాకుండా పది లారీలు ఒక గ్రూప్‌గా రవాణా చేస్తున్నారు. రాత్రి వేళ, తెల్లవారుజామున ఈ అక్రమ రవాణా కొనసాగుతోంది. మిల్లర్ల పేరుతో కొందరు నకిలీ పత్రాలు సృష్టించి ధాన్యం వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఆంధ్రా నుంచి కొనుగోలు చేసిన సన్న ధాన్యాన్ని దళారులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి బోనస్ స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సన్నధాన్యం అక్రమ రవాణాపై ఖమ్మం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి చందన్ కుమార్ మాట్లాడుతూ ఏపీ ధాన్యాన్ని రాష్ట్రంలోకి అనుమతి లేని కారణంగా ఆదివారం జిల్లా సరిహద్దులో పట్టుకున్న లారీలను తిప్పి పంపించినట్లు తెలిపారు. అంత రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘాను మరింత ముమ్మరం చేశామని చెప్పారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆంధ్రా ధాన్యాన్ని రాష్ట్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మరోవైపు.. రాష్ట్రంలో నిరుపేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని రైల్వేస్టేషన్లు ఈ అక్రమ రవాణాకు అడ్డాగా మారాయి. ఆటోల ద్వారా మేడ్చల్, ఘట్‌కేసర్, చర్లపల్లి రైల్వేస్టేషన్లకు చేర్చుతున్నారు. బియ్యాన్ని ప్యాసింజర్ రైళ్ల ద్వారా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. రైల్లోనూ ఎవ్వరికీ అనుమానం రాకుండా బాత్రుమ్‌ల్లో, రైలు డబ్బాలో పైన బియ్యం సంచులను వేస్తున్నారు. ఒక వేళ ఎవరైనా చూస్తే రేషన్ బియ్యం సంచులతో తమకు సంబంధం లేనట్లుగా ప్రవర్తిస్తున్నారు. సాఫీగా తమ ప్రాంతానికి చేరితే అక్కడ వీరు సంచులను దింపుకొంటున్నారు. మధ్యలోనే తనిఖీల్లో విషయం బయటపడితే తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి కూడా ఆటోలో తీసుకువచ్చి రేషన్ బియ్యాన్ని కొందరు నాందేడుకు వెళ్లే రైల్లో తరలిస్తున్నారు. అధికారుల నిఘా కొరవడినంత కాలం వీరి దందా యథేచ్ఛగా సాగే అవకాశముంది.



ఖమ్మం జిల్లా చెరువుమాధారం వద్ద స్థానిక రైతులు అడ్డుకున్న ధాన్యం లారీలు

మీ పాలనలోనే రాష్ట్రం వెనకబడింది

- హామీలను మరిచి అవినీతికి పాల్పడ్డారు
- కేసీఆర్‌కు టీపీసీసీ చీఫ్ బహిరంగ లేఖ



హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం వెనుకబడిందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు.. అవాకులు చెవాకులు మాని ప్రభుత్వానికి సహకరించాలని హితవు పలికారు. ఈ మేరకు ఆదివారం బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. సెంటిమెంట్ పేరుతో రెండు దఫాలు అధికారం చేపట్టిన కేసీఆర్.. గడీల పాలన సాగించి ప్రజలకు కన్నీరు మిగిల్చారని విమర్శించారు. 'ఆనాడు దీక్ష పేరుతో కేసీఆర్ ఆడిన నాటకాలు యువత బలిదానాలకు కారణమయ్యాయి. పెట్రోల్ డబ్బా, అగ్గిపుల్లతో డ్రామా ఆడిన హరీశ్‌రావు.. అమాయక యువతను బలిదానాల వైపు ప్రోత్సహించారు? ఇంటికో ఉద్యోగమని యువతకు ఆశలు కల్పించిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చాక కుటుంబ సభ్యులకు రాజకీయ ఉపాధి కల్పించుకున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కాంగ్రెస్ 54 వేలకు పైగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసింది. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనూ లేనంత అవినీతికి కేసీఆర్.. ఆయన కుటుంబ సభ్యులు పాల్పడ్డారు. రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను రూ.7 లక్షల కోట్ల మేరకు అప్పుల్లో ముంచేశారు. పదేళ్ల అధికారంలో ఉండి.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహంపై విమర్శలు చేయడం.. బీఆర్ఎస్ దిగజారుడుతనానికి నిదర్శనం. అధికారంలో ఉన్న పదేళ్ల మీడియా సమావేశాల్లో కాకమ్మ కథలు చెప్పిన కేసీఆర్.. ఇప్పుడు ఎందుకు మౌనవ్రతం పాటిస్తున్నారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు' అని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా ఫాంహౌస్‌కు పరిమితం కాకుండా అసెంబ్లీకి వచ్చి.. రాష్ట్ర అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కేసీఆర్‌కు హితవు పలికారు. మంత్రిగా ఉన్నన్ని రోజులు సినిమాల ఆడియో ఫంక్షన్లకు తప్ప ఒక్కరోజైనా గురుకులాల సందర్శనకు వెళ్లారా అంటూ కేటీఆర్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ఓ ప్రకటనలో నిలదీశారు.

కొత్త కార్యవర్గం నియామకమెప్పుడు?

టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించి ఆదివారం నాటికి వంద రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా పార్టీ నేతలు గాంధీభవన్‌లో స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. అయితే ఇప్పటికీ పాత కార్యవర్గంతోనే మహేశ్ గౌడ్ పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. టీపీసీసీ కార్యవర్గం కూర్పుపై అటు అధిష్ఠానంతో.. ఇటు సీఎం, ముఖ్య నేతలతో పలు దఫాలుగా భేటీలు జరిగినా కొలిక్కి రాలేదు. స్థానిక ఎన్నికల్లో మంచి పనితీరు కనపరిచిన వారికే పార్టీ పదవులు దక్కుతాయంటూ అంతర్గత సమావేశాల్లో సీఎం, టీపీసీసీ చీఫ్ స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల తర్వాతనే కొత్త కార్యవర్గం ఉంటుందన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

బస్తీ, పల్లె దవాఖానల్లో ఆయుష్ వైద్యులదే హవా!

- తగ్గిపోతున్న ఎంబీబీఎస్ డాక్టర్లు
- 'ఆయుష్' వైపే డీఎంహెచ్‌వోల మొగ్గు
- వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బస్తీ, పల్లె దవాఖానల్లో ఎంబీబీఎస్ వైద్యుల సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. వారి స్థానాన్ని ఆయుష్ వైద్యులు, స్టాఫ్ నర్సులు ఆక్రమించేస్తున్నారు. అయితే, ఆయా దవాఖానల్లో ఆయుష్ వైద్యుల సంఖ్య పెరగడం వెనుక జిల్లా వైద్యాధికారుల హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ఆయుష్ వైద్యుడి దగ్గర లక్షల్లో డబ్బులు తీసుకుని దొడ్డిదారిన డీఎంహెచ్‌వోలు వారిని పల్లె, బస్తీ దవాఖానాల్లో నియమిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. దానికితోడు మెడికల్ ఆఫీసర్‌గా పిలవాల్సిన ఎంబీబీఎస్ వైద్యులను మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ)గా పేర్కొనడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లు తెలిసింది. వాస్తవానికి 2021లో బస్తీ, పల్లె దవాఖానల్లో మెడికల్ ఆఫీసర్ల(ఎంబీబీఎస్ డాక్టర్ల)నే నియమించాలని అప్పటి బీఆర్ఎస్ సర్కారు జీవో 558ను తీసుకొచ్చింది. దాంతో తొలి విడతలో వెయ్యి పోస్టులకు 700 మంది ఎంబీబీఎస్ వైద్యులు చేరారు. పల్లె దవాఖానాల సంఖ్య పెరగడంతో ఆ మరుసటి ఏడాదే సర్కారు మరో జీవో తీసుకొచ్చింది. దీని ప్రకారం ఒక వేళ ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో లేకున్నా, దరఖాస్తు చేయకున్నా... తదుపరి ప్రాధాన్యత కింద ఆయుష్ వైద్యులు, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన స్టాఫ్ నర్సులకు అవకాశం ఇవ్వాలని పేర్కొంది. ఆ జీవోలోని లొసుగులనే జిల్లా వైద్యాధికారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఖాళీగా ఉండే ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు ఎంబీబీఎస్ వైద్యులు దరఖాస్తు చేసుకుంటే... తదుపరి ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారు. దీంతో ఎంబీబీఎస్ వైద్యులు ఇతర ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారు. ఆ తర్వాత ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో లేరన్న సాకు చూపుతూ ఆయుష్ వైద్యులను డీఎంహెచ్‌వోలు నియమిస్తున్నారు. గౌరవ వేతనంతోపాటు వెయిటేజీ మార్కులు వస్తుండడంతో ఆ పోస్టుల కోసం డబ్బులు చెల్లించేందుకూ ఆయుష్ వైద్యులు ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదనుగా కొందరు డీఎంహెచ్‌వోలు ఒక్కో పోస్టుకు రూ.2-3 లక్షలు వసూలు చేస్తున్నట్లు ప్రజారోగ్య విభాగంలో పనిజేసే కొందరు వైద్యులు చెబుతున్నారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినినిస్తున్నాయి. నిజానికి మన దగ్గర చాలా మంది నిరుద్యోగ ఎంబీబీఎస్‌లు ఉన్నారు. వారికి ప్రైవేటులో కనీసం రూ.20-25వేల వేతనం కూడా రావడం లేదు. కాంట్రాక్ట్ ఎంఎల్‌హెచ్‌పీలకు సుమారుగా రూ.42వేల వేతనం అందుతుంది. అయితే, డీఎంహెచ్‌వోల కక్కుర్తి వల్లే ఎంబీబీఎస్‌లు ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులపై ఆసక్తి చూపడం లేదన్న వాదన వినిపిస్తోంది. ఈ ఏడాది మార్చి చివరి నాటికి మొత్తం ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల్లో కేవలం 10 శాతం మంది ఎంబీబీఎస్ వైద్యులే పని చేస్తుండగా, ఆయుష్ వైద్యులు 34శాతం, స్టాఫ్‌నర్సులు 36 శాతం, హోమియో వైద్యులు 4 శాతం మంది పని చేస్తున్నారు. మిగిలిన పోస్టులు ఇంకా ఖాళీగా ఉన్నాయి. ఇక, ఈ ఏడాది నవంబర్ మొదటి వారం నాటికి బస్తీ, పల్లె దవాఖానాల్లో ప నిచేసే ఎంబీబీఎస్ వైద్యుల శాతం 8కి పడిపోగా.. ఆయుష్ వైద్యుల శాతం 36కు, స్టాఫ్‌నర్సుల శాతం 38కి పెరిగింది. నిజానికి ఆయుష్ వైద్యులు అల్లోపతి వైద్యం చేయకూడదన్న నిబంధనలున్నాయి. కానీ బస్తీ, పల్లె దవాఖానాల్లోని ఆయుష్ వైద్యులు అల్లోపతి మెడిసిన్ రాస్తున్నారు. దీన్ని అటు వైద్య ఆరోగ్య శాఖ కానీ, ఇటు ప్రభుత్వం కానీ పట్టించుకోవడం లేదు.



పరిగి మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, వేదికపై మంత్రి సీతక్క, చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

వచ్చే నెలలో రైతులందరికీ రైతు భరోసా

- పంటల ఎగుమతి స్థాయికి రైతులు ఎదగాలి
- అన్ని రకాల పనిముట్లు రాయితీపై ఇస్తాం
- మహిళా రైతులకు 80 శాతం రాయితీపై డ్రోన్‌లు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

పరిగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో రైతులందరికీ రైతు భరోసా ఇస్తామని, గతంలో మాదిరిగా రైతులకు అన్ని రకాల పనిముట్లు రాయితీపై అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. తెలంగాణలోని పంటల సాగు దేశంలోనే రికార్డని, ఇక్కడ పండించిన పంటలను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి రైతులు ఎదగాలని అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీ పాలకవర్గాల ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి సీతక్క, చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాదిలో వ్యవసాయ రంగానికి రూ.50 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. వ్యవసాయ రంగంలో ఉన్న సంతృప్తి ఏ రంగంలో లేదన్నారు. చదువుకున్న వారు పంటలు సాగు చేస్తే ఉద్యోగాల కంటే ఎక్కువగా సంపాదిస్తారని తెలిపారు. పంటల సాగులో రసాయనాలు లేకుండా సాగు చేస్తే ప్రపంచ దేశాలే మనవైపు చూస్తాయన్నారు. మహిళా సంఘాల్లోని మహిళా రైతు సభ్యులకు 80 శాతం రాయితీపై డ్రోన్‌ల పంపిణీ చేస్తామని తెలిపారు. పంటలకు మద్దతు ధర కల్పించేందుకు రూ.10 వేల కోట్లు కేటాయించామన్నారు. దేశంలోనే రుణమాఫీలో తెలంగాణ రికార్డని, ఇప్పటి వరకు రూ.21 వేలకోట్లు రుణమాఫీ చేశామన్నారు. అలాగే మిగిలిన రైతులకు కూడా త్వరలో పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ, తెలంగాణలో రైతులే శాస్త్రవేత్తలుగా మారాలని సూచించారు. రైతులు పంటల మార్పిడి దిశగా పయనించాలని సూచించారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి యూపీ ప్రభుత్వ ఆహ్వానాన్ని అందిస్తున్న చంద్రశేఖర్ తివారి బృందం

కిషన్‌రెడ్డికి మహాకుంభమేళా ఆహ్వానపత్రిక

హైదరాబాద్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరగనున్న మహా కుంభమేళా ఆహ్వాన పత్రిక కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డికి అందింది. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి ప్రతినిధి బృందం కిషన్ రెడ్డికి యూపీ ప్రభుత్వ ఆహ్వాన పత్రికను అందజేసింది. 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ మహా కుంభమేళాకు వివిధ దేశాల నుంచి 30 కోట్ల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. కుంభమేళాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం యూపీ ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తూ కుంభమేళా కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. మహా కుంభమేళా సందర్భంగా 6 రోజుల స్నానాలను భక్తులు, సాధుసంతులు అత్యంత పవిత్రంగా భావిస్తారని తెలిపారు. కుంభమేళా ప్రారంభమయ్యే జనవరి 13(పౌర్ణమి)తో పాటు జనవరి 14(మకర సంక్రాంతి), 29(మౌని అమావాస్య), ఫిబ్రవరి 3(వసంత పంచమి), ఫిబ్రవరి 12(మాఘి పౌర్ణమి), ఫిబ్రవరి 26(మహా శివరాత్రి) ఇందులో ఉన్నాయని కిషన్‌రెడ్డి వివరించారు.

'దురద'పై బూరుగుపల్లిలో ఇంటింటి సర్వే

- నేడు ప్రత్యేక వైద్య శిబిరం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మోమిన్‌పేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం బూరుగుపల్లి గ్రామ ప్రజల దురద సమస్య పరిష్కారానికి యంత్రాంగం కదిలింది. బూరుగుపల్లి ప్రజలు నెల రోజులుగా దురద సమస్యతో బాధపడుతున్నారు. ఈ దురదలకు కారణం కూడా తెలియడం లేదు. ఈ సమస్యపై 'ఇదెక్కడి దురదరా బాబు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన కథనం వైద్యాధికారుల్లో కదలిక తెచ్చింది. దీంతో ఏఎన్ఎం సల్మాన్ బేగం, ఆశా వర్కర్ అంజమ్మ ఆదివారం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి బాధితుల వివరాలు సేకరించారు. ఇక, వైద్యాధికారులు సోమవారం ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు.

పంచాయతీరాజ్ శాఖలో డిప్యుటేషన్లు రద్దు

- వీటి కారణంగా ఉద్యోగుల్లో పెరుగుతున్న పనిభారం
- క్షేత్రస్థాయి పరిస్థితులను గుర్తించి ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోని ఉద్యోగులు, అధికారులకు డిప్యుటేషన్లను రద్దు చేస్తున్నట్లు ఆ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఆదివారం మెమో జారీచేశారు. శాఖాపరంగా సిబ్బంది కొరత, ఉన్న ఉద్యోగులు పలువురు డిప్యుటేషన్ల పేరిట ఇతరశాఖలు, విభాగాల్లో చేరడంతో పనిభారం పెరిగి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖలోని ఉద్యోగులు, వివిధస్థాయిల అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను గుర్తించిన రాష్ట్రప్రభుత్వం ఆ శాఖలో అసలు డిప్యుటేషన్లను అనుమతించకూడదని నిర్ణయించింది. అంతే కాకుండా డిప్యుటేషన్‌పై ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారికి మూడేళ్ల సర్వీసు పూర్తయితే కొనసాగించకూడదని నిశ్చయించింది. ప్రధానంగా పీఆర్ ఇంజనీరింగ్ విభాగంలోని ఉద్యోగులు, ఇతర విభాగాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తుండటంతో వివిధ పనుల పర్యవేక్షణకు ఆటంకం ఏర్పడుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలో డిప్యుటేషన్లను ప్రోత్సహించవద్దని, ఇతర శాఖల్లో పనిచేస్తున్న వారికి మూడేళ్ల గడువు పూర్తయితే వారిని కొనసాగించవద్దని ఉన్నతస్థాయి అధికారులు, అన్ని జిల్లాల విభాగాలను ఆ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: బీఈఈ

- ఇంధన పొదుపు కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం
- ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా

హైదరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కోవడానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బ్యూరోఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) పిలుపునిచ్చింది. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి.. తెలంగాణ రెడ్కో ఎండీ వి.అనిల్, రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిసందీప్ కుమార్ సుల్తానియాను కలిశారు. ఈ సందర్భంగా సుల్తానియా మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, హరిత ఇంధనం, ఇంధన సామర్థ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. పరిశ్రమలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యుత్తు సరఫరా చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. విద్యార్థులకు ఇంధన సంరక్షణను అలవాటుగా మార్చేందుకు బీఈఈ సాయంతో రాష్ట్ర ఇంధన శాఖ 165 ఇంధన క్లబ్బులను ఏర్పాటు చేసిందని చెప్పారు.

ఆదిలాబాద్ @4.7

(మొదటిపేజీ తరువాయి)

పొగమంచు కమ్ముకుంటుండటంతో రోడ్లపై ఎదురుగా వాహనాలు కనిపించడం లేదు. పల్లెల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దాచిన్నా చలిమంటల చుట్టూ చేరుతున్నారు. రాష్ట్రంలో శీతలగాలులు విజృంభిస్తున్నాయి. ఫలితంగా ఉష్ణోగ్రతలు బాగా పడిపోతున్నాయి. కాంక్రీటు జంగిల్ అయిన హైదరాబాద్‌లోనూ చలి బాగా పెరిగింది. పటాన్‌చెరులో 8.8 డిగ్రీలు, రాజేంద్రనగర్‌లో 11 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 10డిగ్రీల లోపే నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 4.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇదే జిల్లా భీమాపూర్‌లో 6.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిర్మల్ జిల్లా మమ్డాలో 6.6 డిగ్రీలు, ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో 6.7, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 6.8, కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో 7.6, నిజామాబాద్ జిల్లా కోటగిరిలో 7.7, మెదక్ జిల్లా శివంపేట, జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో 8, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 8.2, సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో 8.6, సిద్దిపేట జిల్లా అక్బర్‌పేటలో 8.6, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో 8.9, పెద్దపల్లి జిల్లా జూలపల్లిలో 9.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ కేంద్రం పేర్కొంది ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో సోమవారం శీతలగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలో వచ్చే 2 రోజుల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. రాగల రెండు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-4 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉపరితల గాలులు గంటకు 6-8 కి.మీ వేగంతో ఈశాన్య దిశగా వీస్తాయని పేర్కొంది.



ధరణి స్థానంలో 'భూమాత'

(మొదటిపేజీ తరువాయి)

తీసుకువస్తున్నారు. ప్రస్తుతం ధరణిలో 33 మాడ్యూల్స్ ఉన్నాయి. ఒక్కో సమస్యకు ఒక్కో మాడ్యూల్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే.. దరఖాస్తు సమయంలో సమస్య ఒకటై ఉండి, మాడ్యూల్‌లో మరో దానిని ఎంపిక చేస్తే.. ఆ దరఖాస్తునే తిరస్కరిస్తున్నారు. దీంతో కొత్త చట్టంలో ఏ మాడ్యూల్‌లో దరఖాస్తు చేసినా సమస్యను పరిష్కరించడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు అధికారిదే బాధ్యతగా నిర్ణయించబోతున్నారు. భూ సమస్యల పరిష్కారానికి సింగిల్ విండో వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ధరణిలో సమస్య పరిష్కారం కాకపోతే.. సదరు రైతు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇలాంటి రైతులు కోర్టులకు వెళ్లాల్సి ఉంది. అయితే.. కోర్టుకు వెళితే సమస్య పరిష్కారం కావడానికి అనేక ఏళ్లు పడుతోంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త చట్టంలో భాగంగా భూమాతలో పరిష్కారం కాని సమస్యపై అప్పీలుకు వెళ్లడానికి వీలుగా ప్రత్యేక ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అధికారుల స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే.. ఈ ట్రైబ్యునళ్లను ఆశ్రయించడానికి అవకాశం ఉంటుంది. ఇక ఎటువంటి డాక్యుమెంట్లు లేని గ్రామకంఠం వంటి భూములకు విలువ తెచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇలాంటి భూములను రిజిస్ట్రేషన్ చేసేలా, వాటికి బ్యాంకు రుణాలు ఇచ్చేలా కొత్త చట్టంలో రూపకల్పన చేస్తున్నారు. దీంతోపాటు సాదా బైనామా భూములకు కూడా పరిష్కారం చూపే విధంగా కొత్త చట్టంలో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. వీఆర్వో వ్యవస్థను కూడా అమలు పరచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వారిని ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై మంత్రివర్గంలో చర్చించిన తర్వాత విధి విధానాలు రూపొందించే అవకాశం ఉంది.

నేడు మంత్రివర్గ సమావేశం

రాష్ట్ర మంత్రివర్గం సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. మధ్యాహ్నం 2గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నారు.



సీఎం రేవంత్‌ను ఆయన నివాసంలో కలిసిన టీటీడీ జేఈవో వెంకయ్య చౌదరి

ముఖ్యంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే ఆర్‌వోఆర్ చట్ట సవరణ బిల్లును క్యాబినెట్ ఆమోదించే అవకాశం ఉంది. అలాగే.. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును, యూనివర్సిటీల బిల్లును కూడా ఆమోదించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీటితోపాటు వీఆర్వోల వ్యవస్థ, జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్ విచారణ అంశాలపై చర్చించే అవకాశం ఉంది.

ఉక్కుమనిషి పటేల్‌కు ముఖ్యమంత్రి నివాళి

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి ఉప ప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి అర్పించారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు. అనంతరం మంత్రి కొండా సురేఖ దంపతులు సీఎంతో చర్చలు జరిపారు. కాంగ్రెస్‌లో చేరే సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమకు ఒక ఎమ్మెల్సీ సీటును కేటాయించాల్సిందిగా వారు కోరినట్లు తెలిసింది. వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇంకా ఏడాది గడువున్నా.. ముందస్తుగానే సీఎంను కలిసి సీటును కోరడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) జేఈవో వెంకయ్య చౌదరి సీఎం రేవంత్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

నేడు అసెంబ్లీలో సంతాపాలు, టూరిజం పాలసీపై చర్చ

- అజెండా ఖరారుపై బీఏసీ భేటీ

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం ఉదయం పది గంటలకు సభ తిరిగి ప్రారంభం కానుంది. తొలుత మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి జ్యోతీదేవి, ఊకె అబ్బయ్య, డి.రాంచంద్రరెడ్డిల మరణం పట్ల శాసనసభ సంతాపాన్ని ప్రకటించనుంది. అనంతరం ప్రశ్నోత్తరాల సమయం చేపట్టనున్నారు. అవి ముగిసిన తర్వాత తెలంగాణ టూరిజం పాలసీపై స్వల్పకాలిక చర్చ ఉంటుంది. అనంతరం తెలంగాణ యువ భారత వ్యాయామ విద్య, క్రీడా విశ్వవిద్యాలయ బిల్లును, తెలంగాణ విశ్వ విద్యాలయాల సవరణ బిల్లులను సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రతిపాదించనున్నారు. ఇటు.. శాసనమండలిలో మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేన్‌రెడ్డికి సంతాపం తెలిపి.. అనంతరం తెలంగాణ టూరిజం పాలసీపై స్వల్పకాలిక చర్చ చేపడతారు. ఇక అసెంబ్లీని ఎన్ని రోజులు నిర్వహించాలి, ఏయే అంశాలపై చర్చ చేపట్టాలి.. తదితర అంశాలకు సంబంధించి అజెండాను ఖరారు చేసేందుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బీఏసీ కూడా సోమవారం భేటీ కానుంది. శీతాకాల సమావేశాలు ఐదు నుంచి ఏడు పనిదినాల పాటు కొనసాగే అవకాశమున్నట్లు అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి.

ఊళ్లలో సేవలన్నీ వారితోనే!

- ధ్రువపత్రాల జారీ నుంచి పరిపాలన వరకు..
- గ్రామ రెవెన్యూ సిబ్బందికే బాధ్యతలు
- వారికి ఏ హోదా ఇవ్వాలనేదానిపై కసరత్తు

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో రెవెన్యూ సిబ్బంది నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో గ్రామ రెవెన్యూ అధికారు (వీఆర్వో)లు 36 రకాల సేవలు అందించేవారు. గ్రామస్థాయిలో రెవెన్యూ, సంక్షేమం, అభివృద్ధి, సాధారణ పరిపాలనకు సంబంధించి అన్ని రకాల ప్రభుత్వ సేవలకు రెవెన్యూ సిబ్బందిని వినియోగించుకోవాలని సర్కారు భావిస్తోంది. గతంలో తొలగించిన వారి నుంచే సమర్థులను ఎంపిక చేయాలని యోచిస్తోంది. గ్రామ స్థాయిలో పనిచేసే ఉద్యోగికి ఏం పేరు పెట్టాలనేదానిపై 20కిపైగా ప్రతిపాదనలు వచ్చాయి. వీఆర్వో స్థానంలో జూనియర్ రెవెన్యూ ఆఫీసర్ (జేఆర్వో) లేదా విలేజ్ రెవెన్యూ సెక్రటరీ అని సీసీఎల్ఏ నుంచి ప్రతిపాదించారు. అయితే ఆఫీసర్ కాకుండా ఏ హోదా ఇవ్వాలనే చర్చ అధికారుల్లో జరుగుతోంది. దీంతో రకరాల పేర్లను పరిశీలిస్తున్నారు. డిగ్రీ అర్హత ఉండి జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌తో సమానంగా ఉండేలా చూడాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో వీఆర్వోలు 5195 మంది ఉండేవారు. వీఆర్ఏలతో కలిపి మొత్తం 25,750 మంది దాకా పనిచేసేవారు. 10,954 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న సిబ్బందిని గత ప్రభుత్వం 2022లో తొలగించింది. వారిలో తగిన అర్హతలున్నవారినే విధుల్లోకి తీసుకోవాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. పాతవారికి కూడా పరీక్ష పెట్టి, సమర్థులకే అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. కానీ, పాత వారికి పరీక్ష పెట్టి, తీసుకోవాలనే ప్రభుత్వ ప్రతిపాదన మీద వీఆర్వో, వీఆర్ఏ సంఘాల నుంచి కొన్ని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తమకు పరీక్ష పెట్టాల్సిన అవసరం లేదని వాదిస్తున్నారు. ఉన్న వారిలోనే డిగ్రీ అర్హతతో తీసుకోవాలంటే 10,954 రెవెన్యూ గ్రామాలకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే పాత వారిలో పట్టభద్రులు 7 వేలకు మించరని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన అన్ని గ్రామాలకు సిబ్బంది కావాలంటే విద్యార్హతలో సడలింపు ఇస్తారా, లేక పాత వారి సర్వీసును ప్రాతిపదికగా చేసుకుని అవకాశం ఇస్తారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. కొత్తగా బాధ్యతలు స్వీకరించే గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బందికి నిర్దిష్టమైన జాబ్‌చార్ట్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. సీసీఎల్ఏ నుంచి వెళ్లిన ప్రతిపాదనల్లో వీరిని గ్రామస్థాయిలో అన్ని సేవలకూ వినియోగించుకోవాలని సూచించినట్లు తెలిసింది. కులధ్రువీకరణ పత్రాల జారీ, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల రక్షణ, భూ సమస్యలపై క్షేత్రస్థాయి విచారణ వంటి బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది.

ముఖ గుర్తింపు హాజరు

ఐఏఎస్‌లకు వర్తించదా?

- వారికి మినహాయింపుపై కింది స్థాయి ఉద్యోగుల్లో అసంతృప్తి

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో ఈ నెల 12నుంచి ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం 10:30 గంటలలోపు విధులకు హాజరవుతున్నారు. అయితే కింది స్థాయి ఉద్యోగులకు దీనిని తప్పనిసరి చేసి ఐఏఎస్‌లకు మినహాయింపు ఇవ్వడంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానం వల్ల కొన్ని ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయని కొందరు అధికారులు చెబుతున్నారు. ఉదయం 10:30 గంటలకు వచ్చిన ఉద్యోగి సాయంత్రం 5గంటల తర్వాత కార్యాలయంలో ఉండి పని చేయమంటే తమ సమయం అయిపోయిందని వెళ్లిపోయే అవకాశం ఉంటుందంటున్నారు. కొందరు ఐఏఎస్ అధికారులు మధ్యాహ్నం 2గంటల తర్వాత కార్యాలయానికి వస్తుండటం, మరికొందరు రాత్రి 8, 9 గంటల వరకు కార్యాలయంలోనే ఉంటుండటంతో వారి కోసం అదనంగా 2, 3గంటలు సచివాలయంలో ఉండాల్సిన పరిస్థితి ఉంటుండడంపై కొందరు ఉద్యోగుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందనే వాదనలు ఉన్నాయి. సమయపాలన పాటించాలని ప్రభుత్వం ఒత్తిడి చేసినప్పుడు అదనపు సమయం కార్యాలయంలో ఉండాల్సిన అవసరం తమకు లేదనే ధోరణిలో కొందరు ఉద్యోగులు మాట్లాడుతున్నారు. సచివాలయంలో శాఖాధిపతి నుంచి కింది స్థాయి వరకు అందరికీ ముఖ గుర్తింపు హాజరును వర్తింపజేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

15 రోజుల్లో సర్వే పూర్తి.. ఇల్లు మంజూరు!

500లోపు దరఖాస్తులున్న గ్రామాల్లో అమలు.. దరఖాస్తులు ఎక్కువ ఉంటే మరొకరికి 'లాగిన్'

- సర్వే త్వరగా పూర్తయ్యేలా ప్రణాళిక
- ఇంటర్‌నెట్ సమస్య ఉన్న చోట్ల ఆఫ్‌లైన్‌లో సర్వే
- కలెక్టర్లకు సర్కారు కీలక సూచనలు
- లబ్ధిదారుల కోసం గ్రీవెన్స్ సెల్



హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏదైనా గ్రామంలో 500 కంటే తక్కువ దరఖాస్తులు ఉంటే.. 15 రోజుల్లోనే సర్వే పూర్తి చేయాలని, అర్హులుగా గుర్తించిన వారికి వెంటనే ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సర్వేతో సంబధం లేకుండా సర్వే పూర్తయిన గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేయాలని కలెక్టర్లకు సూచించింది. వాస్తవానికి గత ఏడాది డిసెంబరులో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 80.54లక్షల దరఖాస్తులు వచ్చిన విషయం తెలిసిందే. మొదటి దశలో సొంతస్థలం ఉన్న వారికి రూ.5లక్షలు ఇవ్వనుండగా.. రెండో దశలో స్థలం లేని వారికి స్థలమిచ్చి, రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని అందించేలా పథకాన్ని రూపొందించారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 4.50లక్షల ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ప్రస్తుతం గ్రామాల్లో దరఖాస్తుల పరిశీలన(సర్వే) కొనసాగుతోంది. అయితే, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో ఎలా వ్యవహరించాలి? లబ్ధిదారుల గుర్తింపు నుంచి ఇంటి మంజూరు వరకు తీసుకోవాల్సిన చర్యలేంటి? అన్న అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం పలు సూచనలు చేసింది. పెద్ద గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాల్లో దరఖాస్తులు ఎక్కువగా ఉంటే.. మొబైల్ యాప్‌లో అదనంగా మరొక లాగిన్‌ను ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని ఆదేశించింది. తద్వారా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంది.

ఆఫ్‌లైన్‌లోనూ వివరాల సేకరణ

ప్రస్తుతం గ్రామాల్లో దరఖాస్తుల పరిశీలనను మొబైల్ యాప్‌లో ఆన్‌లైన్ విధానం ద్వారా నిర్వహిస్తున్నారు. దరఖాస్తుదారుల వద్దకు అధికారులు వెళ్లి ఫొటోలు తీసుకుంటున్నారు. సొంతస్థలం ఉన్న వారిని అదే స్థలం దగ్గర ఉంచి ఫొటో తీస్తుండగా, స్థలం లేని వారి వివరాలను కూడా యాప్‌లో పొందుపరుస్తున్నారు. అయితే, ఈ ప్రక్రియలో మారుమూల గ్రామాలు, గిరిజన తండాలు, ఆదివాసీ ఆవాసాలు ఉన్నచోట ఇంటర్‌నెట్ లేకపోవడం సమస్యగా మారింది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం యాప్‌లో ఆఫ్‌లైన్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇంటర్‌నెట్ సమస్య ఉన్న ప్రాంతాల్లో మొదట దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తారు. అనంతరం ఆ వివరాలను అధికారులు మొబైల్ యాప్‌లో పొందుపర్చే వెసులుబాటు కల్పించింది. ఆన్‌లైన్‌లో నమోదు చేసే దరఖాస్తుదారు, వారి స్థలం వివరాలన్నింటినీ జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించింది.

పీఎంఏవైతో అనుసంధానం

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కేంద్రం అమలుచేసే ప్రధానమంత్రి ఆవాస యోజన(పీఎంఏవై)తో అనుసంధానించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో దరఖాస్తుల వివరాలన్నింటినీ కేంద్రం సూచించే యాప్‌లోనూ పొందుపర్చాలని, ఇందుకోసం అదనంగా అవసరమైన ఫొటోలను కూడా ముందుగానే తీసుకోవాలని అధికారులకు సూచించింది. సర్వేతోపాటు పథకం అమలును మండల స్థాయిలో ఉన్న అధికారి పర్యవేక్షించనుండగా.. ప్రతి నలుగురు సర్వేయర్లకు ప్రత్యేక అధికారిని నియమించింది. కాగా. దరఖాస్తుదారులు లేదా లబ్ధిదారుల అనుమానాలు నివృత్తి చేసేందుకు గ్రీవెన్స్ సెల్‌తోపాటు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సర్కారు భావిస్తోంది.

వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అప్పులపై బీఆర్ఎస్ నేతలు ప్రజలను పక్కదారి పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా రెసిడెన్షియల్ హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు పెంచామని, దీనివల్ల ప్రభుత్వంపై రూ.541 కోట్ల భారం పడిందని అన్నారు. అయినా ప్రభుత్వ హాస్టళ్లు బాగా లేవంటూ బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా యూనివర్సిటీ చేస్తున్న విషప్రచారాలను రాష్ట్ర ప్రజలు నమ్మరని అన్నారు.



ఖమ్మంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

అప్పులు తీర్చడానికి ఇబ్బందిపడుతున్నాం..

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.72,658 కోట్ల అప్పులు ఉండగా.. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల కాలంలో ఆ అప్పు రూ.7లక్షల 11వేల 911 కోట్లకు పెరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ఆ అప్పులు తీర్చడానికి, వడ్డీలు కట్టడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. ఇప్పటివరకు రూ.66,282 కోట్ల అసలు, వడ్డీలను తమ ప్రభుత్వం చెల్లించిందన్నారు. దీనిపై చర్చకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. బీఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఫీజు రీయింబర్స్‌మెంట్, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.40,154 కోట్లు చెల్లించకుండా బకాయిలు పెట్టారని వెల్లడించారు. వీటిని కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే చెల్లించిందని తెలిపారు. ఈ విషయాలపై కేసీఆర్, కేటీఆర్‌లకు దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రావాలన్నారు. 2014లో అప్పటి ప్రభుత్వం అప్పులు, వడ్డీలకు కేవలం రూ.6,400 కోట్లు మాత్రమే చెల్లించే పరిస్థితి ఉండగా, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.66,782 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితికి రాష్ట్రం దిగజారిందని విమర్శించారు. ఇందుకు బీఆర్ఎస్ పాలనే కారణమని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసం, అప్పులపైనా అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేసి ప్రజలకు వాస్తవాలు వివరిస్తామని తెలిపారు.

రైతుల కోసం 50,953 కోట్లు ఖర్చు చేశాం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని భట్టివిక్రమార్క చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. రుణమాఫీతో పాటు రైతుభరోసాకు రూ.7,625 కోట్లు, రైతుబీమాకు రూ.1,514 కోట్లు, ఆయిల్‌పామ్ సాగుకు రూ.40 కోట్లు, డ్రిప్ ఇరిగేషన్ కోసం రూ.55 కోట్లు, విత్తనాల కోసం రూ.36 కోట్లు, పంపుసెట్లు, విద్యుత్తు బిల్లుల చెల్లింపునకు రూ.11,270 కోట్లు, ఇరిగేషన్ పనులకు రూ.9,795 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. మొత్తంగా ఈ ఏడాది రైతుల కోసం రూ.50,953 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇవే కాకుండా వర్షాలు, వరదలతో పంటనష్టం జరిగిన చోట ఎకరాకు రూ.10 వేల చొప్పున చెల్లించామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. దీనిద్వారా రైతులు ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అధికంగా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, వరంగల్‌లో విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నామని, హైదరాబాద్‌లో ఫ్యూచర్‌సిటీ, రీజినల్ రింగ్‌రోడ్, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, మూసీనది ప్రక్షాళన, ఇండస్ట్రియల్ హౌజింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేఆర్ నారాయణన్ కూడా కులవివక్ష బాధితుడే!

- మాజీ రాష్ట్రపతి ఓఎస్డీ ఎస్ఎన్ సాహు వెల్లడి
- దేశంలో కులగణన అవసరం ఉందని వ్యాఖ్య
- ముగిసిన మానవ హక్కుల వేదిక మహాసభలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ కూడా కులవివక్ష బాధితుడేనని సామాజిక విశ్లేషకుడు, ఆయన వద్ద ఓఎస్డీగా పనిచేసిన ఎస్ఎన్ సాహు పేర్కొన్నారు. అనంతపురంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగురాష్ట్రాల మానవ హక్కుల వేదిక 10వ మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ మహాసభల్లో ఎస్ఎన్ సాహు మాట్లాడుతూ సమాజంలో కులవివక్ష తీవ్రస్థాయిలో ఉందన్నారు. ప్రభుత్వంలో పైస్థాయిలో ఉన్నవారిలోనూ కులవివక్ష బాధితులున్నారని, మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ కూడా ఇటువంటి వివక్ష బాధితుడేనని చెప్పారు. కుల వ్యవస్థ అనేది ఒక వ్యాధి అనీ, ఇది ఏ స్థాయిలో ఉందో తెలుసుకోడానికి కులగణన అవసరమని పేర్కొన్నారు. 'ప్రతి ప్రభుత్వం పశుగణన చేస్తోంది. అలాంటపుడు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కులగణన చేపట్టలేరా? ఈ మాత్రం అడిగే హక్కు కూడా లేదా?' అని ప్రశ్నించారు. అనంతరం మానవహక్కుల వేదిక ప్రచురణలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక ఏపీ అధ్యక్షుడు జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శి రాజేశ్, తెలంగాణ అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల బాధితులకు లోక్అదాలత్‌లో ఊరట

- రూ.33 కోట్లు తిరిగి అందజేత

హైదరాబాద్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్అదాలత్‌లో సైబర్ నేరాల బాధితులకు న్యాయం జరిగినట్టు అధికార వర్గాలు తెలిపాయి. గత నెల 28న ప్రారంభమైన లోక్అదాలత్ కార్యక్రమం శనివారం ముగిసింది. మొత్తం 1.57 లక్షల కేసులను రాజీ మార్గంలో పరిష్కారమయ్యేలా చూశారు. సైబర్ నేరాలకు బలయి డబ్బు పోగొట్టుకున్న 4,893 మందికి రూ. 33 కోట్లు తిరిగి అందజేశారు. మోసం కారణంగా చేతులు మారిన డబ్బును వెనక్కి తెప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు నిరంతరం పనిచేశారు. ఫిర్యాదు అందిన వెంటనే బ్యాంకర్లతో మాట్లాడి నిందితుల ఖాతాల్లోని సొమ్మును స్తంభింపజేశారు. తరువాత విచారణ జరిపి సొమ్ము వసూలు చేశారు. బాధితులకు సుమారు 60 శాతం మేర డబ్బు అందింది. ఒక్క సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులే రూ.12 కోట్లను తిరిగి ఇప్పించారు. ఈ విషయంలో విశేషంగా కృషి చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖా గోయల్‌ను డీజీపీ రవి గుప్తా అభినందించారు. లోక్అదాలత్‌లో మోటార్ వాహనాల చట్టానికి సంబంధించిన 59,438 కేసులను పరిష్కరించారు.

విమానాశ్రయంలో పర్యాటక సమాచార కేంద్రం

హైదరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించేందుకు దేశ, విదేశాల నుంచి విమానాల్లో వచ్చే యాత్రికుల కోసం శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పర్యాటక సంస్థ సమాచార, రిజర్వేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే పర్యాటక సంస్థ బషీర్‌బాగ్, బేగంపేట టూరిజం ప్యాలెస్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ యాత్రినివాస్, శిల్పారామంతో పాటు ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో సమాచార, రిజర్వేషన్ కేంద్రాలను నిర్వహిస్తోంది. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కాచిగూడ, గోల్కొండ ఫోర్ట్, కుతుబ్‌షాహి టోంబ్స్ ప్రాంతాల్లో ఏర్పాటైన కేంద్రాల ద్వారా పర్యాటకులకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు ఆయా ప్రాంతాలకు వెళ్లదలిచిన యాత్రిలకు ప్రత్యేకంగా రవాణా సౌకర్యాన్ని సమకూర్చుతోంది.



జస్టిస్ రమణ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు

అహోబిలంలో జస్టిస్ ఎన్వీ రమణ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహ స్వామిని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా ఎగువ అహోబిలం చేరుకున్న ఎన్వీ రమణ దంపతులకు వేద పండితులు, మఠం అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహ స్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దిగువ అహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామిని జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిధిలో శాస్త్రోక్తంగా నిర్వహించిన మహా సుదర్శనహోమంలో వారు పాల్గొన్నారు.

అక్రమ ఆస్తులన్నీ బినామీ పేర్లపైనే!

- ఏఈఈ నిఖేశ్ కుమార్ నుంచి వివరాలు సేకరించిన ఏసీబీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) నిఖేష్ కుమార్.. తన అక్రమ ఆస్తులన్నీ బినామీల పేర్లపైనే ఉంచినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. తన స్నేహితులు, దగ్గరి బంధువులను బినామీలుగా పెట్టినట్లు సమాచారం. నిఖేష్ కుమార్‌ను నాలుగు రోజులు కస్టడీకి తీసుకున్న ఏసీబీ అధికారులు.. ఆస్తుల చిట్టాపై ఆరా తీసి పలు ఆధారాలు సేకరించారు. ఇందులోభాగంగానే హైదరాబాద్‌లోని పలు బ్యాంకులతోపాటు జహీరాబాద్‌లోని ఓ బ్యాంక్ లాకర్‌లోనూ నిఖేశ్‌కుమార్ తన బినామీ ఆస్తుల పత్రాలు దాచి ఉంచినట్టు గుర్తించినట్లు సమాచారం. ఇటీవల ఏఈఈ నిఖేష్ కుమార్ ఇంటితో పాటు ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లలో మొత్తం 19 చోట్ల సోదాలు నిర్వహించిన ఏసీబీ.. పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అనంతరం నిఖేష్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిఖేష్ ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో రూ.100 కోట్లు పైనే ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అయితే నిఖేష్ అక్రమాస్తులపై పూర్తిస్థాయిలో విచారణ ప్రారంభించిన ఏసీబీ.. ఆయన్ను నాలుగు రోజుల పాటు (గురువారం నుంచి ఆదివారం వరకు) కస్టడీలోకి తీసుకొని విచారించింది. విచారణ పూర్తయిన అనంతరం నిఖేష్‌కుమార్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి ఏబీబీ న్యాయమూర్తి ఎదట హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. నిఖేష్ కుమార్ 2013లో ఉద్యోగంలో చేరగా, పదేళ్లలోనే రూ.100 కోట్లకు పైగా ఆస్తులను కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలుస్తోంది.

సీపీఎస్ ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా ఉదావత్ లచ్చిరాం

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం(టీఎస్‌సీపీ ఎస్ఈయూ) రాష్ట్ర కార్యదర్శిగా ఉదావత్ లచ్చిరాం నియమితులయ్యారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామెరభీమనపల్లి ఎంపీపీ ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న లచ్చిరాం కొన్నేళ్లుగా సీపీఎస్ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం కోసం జరుగుతున్న పోరాటాన్ని మరింత ఉధృతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కోరుతూ.. ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా లచ్చిరాంను నియమిస్తూ టీఎస్‌సీపీ ఎస్ఈయూ ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్ లేఖను అందజేశారు.

కడెం అడవుల్లో అరుదైన పచ్చపిట్ట !



ఎర్రటి కళ్లకు చుట్టూ కాటుక పెట్టినట్లు.. ముక్కుకు గులాబీ రంగు వేసినట్లు.. నలుపు, పసుపు పచ్చని రంగులను కలబోసుకుని ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ అరుదైన పక్షి పేరు 'గోల్డెన్ ఓరియోల్'. తెలంగాణ ప్రాంతంలో 'పచ్చపిట్ట', ఏపీలో వంగపండు'గా పిలిచే ఈ పక్షి.. సకల జీవ జాతులకు నిలయమైన నిర్మల్ జిల్లా కడెం ప్రాంతంలోని కవ్వాల్ అభయారణ్యంలో కనువిందు చేస్తోంది. మనిషి అలికిడి వింటేనే ఆమడ దూరం పారిపోయే దీనికి బిడియం ఎక్కువని, సాధారణంగా ఏ కెమెరాలకు చిక్కదని నిపుణులు చెబుతారు. వన్యప్రాణి ప్రేమికుడు ఆదిలాబాద్‌కు చెందిన వైల్డ్ లైఫ్ ఫొటో గ్రాఫర్ లింగంపల్లి కృష్ణ దీన్ని తన కెమెరాలో బంధించాడు. శీతాకాలంలో దట్టమైన అడవుల్లో నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఈ గోల్డెన్ ఓరియోల్ దర్శనమిస్తుందని కృష్ణ చెబుతున్నారు.

- ఖానాపూర్, ఆంధ్రజ్యోతి

భద్రాద్రి జిల్లాలో పెద్దపులి సంచారం

కొత్తగూడెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో రెండు రోజులుగా పెద్దపులి సంచరిస్తోంది. కరకగూడెం మండలంలోని రఘునాథపాలెం గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం పెద్దపులి అరుపులు వినిపంచడంతో గ్రామస్థులు అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. వారు అక్కడకు చేరుకుని పెద్దపులి పాదముద్రలను గుర్తించారు. పెద్దపులి సంచారంపై కరకగూడెం అటవీ రేంజర్ ఉపేందర్ వివరణ కోరగా డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు బీట్ (ఎద) సమయంలో ఆడపులి కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి పెద్దపులి ఈ ప్రాంతానికి వస్తుందని తెలిపారు. ఇది ఎటువంటి హానిచేయదని, అడవిలోకి వెళ్లే పశువులపై దాడిచేసి చంపి ఆ పరిసరాల్లోనే సంచరిస్తుందని చెప్పారు. పశువులు మృతి చెందితే వాటి యజమానులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇస్తుందని చెప్పారు.



పెద్దపులి పాదముద్రలు

46 శాతం అభ్యర్థుల హాజరు

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు .. పేపర్-1తో పోలిస్తే పేపర్-2 తేలిక!

- జనగామలో అధికారుల నిర్లక్ష్యంతో అవకాశం కోల్పోయిన గిరిజన అభ్యర్థిని
- నేటితో ముగియనున్న పరీక్షలు

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం రెండు పేపర్లకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. పేపర్-1కు 46.75 శాతం, పేపర్-2కు 46.30 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. అధికారులు పలు కేంద్రాల్లో అలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించలేదు. కొన్నిచోట్ల అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా పోలీసులు తమ వాహనంలో తీసుకెళ్లి ఔదార్యం చాటుకున్నారు. జనగామలో ఓ గిరిజన అభ్యర్థినిని ముందు పరీక్షా కేంద్రంలోకి అనుమతించిన అధికారులు.. తర్వాత ఆమెది పక్కన ఉన్న కేంద్రమని గుర్తించడం.. అప్పటికే సమయం దాటిపోవడంతో ఆమె పరీక్ష రాసే అవకాశం కోల్పోయింది. వికారాబాద్‌లో ఓ అభ్యర్థి లోదుస్తుల్లో సెల్‌ఫోన్ పెట్టుకుని వచ్చి పట్టుబడ్డాడు. సంగారెడ్డిలో ఓ కేంద్రంలో సెల్‌ఫోన్లు, లగేజీ భద్రపరచడానికి సిబ్బంది డబ్బులు వసూలు చేయడంతో అభ్యర్థులు వాగ్వాదానికి దిగారు. కాగా, ఉదయం నిర్వహించిన పేపర్-1 జనరల్ స్టడీస్ కొంత కఠినంగా ఉందని అభ్యర్థులు చెబుతున్నారు. ఈ పేపర్‌లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలు, సినీ రంగం, అంతర్జాతీయ అంశాలు, భౌతిక, రసాయన శాస్త్రాలు, రీజనింగ్, ఇంగ్లిషు గ్రామర్ నుంచి ప్రశ్నలు ఇచ్చారు. మధ్యాహ్నం జరిగిన పేపర్-2లో నిజాం నవాబుల కాలం, జోగిని వ్యవస్థ, సికింద్రాబాద్ ఉజ్జయిని ఆలయం, జాతీయ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కమిటీలు, రిజర్వేషన్లు, రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్ అధికారాలు, తెలంగాణ జిల్లాలు, మహిళా రిజర్వేషన్ వంటి అంశాలపై ప్రశ్నలు ఇచ్చారు. పేపర్-1తో పోలిస్తే పేపర్-2 కొంత సులభంగా ఉందంటున్నారు. సోమవారం మరో రెండు పేపర్ల పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్రంలో సుమారు 783 గ్రూపు-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. అధికారులు 1368 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం సూచించారు. హైదరాబాద్ బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఫలితాలను త్వరలోనే వెల్లడిస్తామని, గ్రూపు 3 కంటే గ్రూపు 2కు ఎక్కువ మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

లోదుస్తుల్లో సెల్‌ఫోన్‌తో పట్టుబడిన అభ్యర్థి

వికారాబాద్: వికారాబాద్ శ్రీసాయి కాలేజ్ ఆఫ్ డెంటల్ సర్జరీ పరీక్షా కేంద్రంలో ఓ అభ్యర్థి పేపర్-2 పరీక్షకు లోదుస్తుల్లో ఫోల్డెడ్ మొబైల్ పెట్టుకుని వెళ్లాడు. అతని కదలికలపై అనుమానం వచ్చిన చీఫ్ సూపరింటెండెంట్ తనిఖీ చేయడంతో సెల్‌ఫోన్ పట్టుబడింది. అతడిని పోలీసులకు అప్పగించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఇతర అధికారులు చేరుకుని విచారణ నిర్వహించారు. తనిఖీ చేసిన తర్వాతే అభ్యర్థులను లోపలికి అనుమతిస్తున్నా ఈ ఘటన చోటుచేసుకోవడాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు.

సెల్‌ఫోన్‌కు రూ.50, లగేజ్‌కు రూ.100!

సంగారెడ్డి రూరల్: సంగారెడ్డి శివారులోని ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాల సిబ్బంది లగేజ్ డిపాజిట్‌కు డబ్బులు వసూలు చేయడంతో గ్రూప్ 2 అభ్యర్థులు వాగ్వాదానికి దిగారు. సెల్‌ఫోన్‌కు రూ.50, లగేజీకి రూ.100 నుంచి 200 చొప్పున వసూలు చేసినట్టు అభ్యర్థులు ఆరోపించారు. డబ్బులిస్తేనే లోనికి పంపిస్తామని సిబ్బంది చెప్పడం.. పరీక్ష సమయం దగ్గర పడుతుండడంతో చేసేదేమీ లేకపోయిందన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఈ కేంద్రాన్ని సందర్శించి కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యర్థుల నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేయాలని ఆదేశించారు. ఈ కేంద్రంలో 1,182 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు.



పోలీసుల ఔదార్యం

హైదరాబాద్ సిటీ/రంగారెడ్డి అర్బన్: పోలీసులు మానవతా దృక్పథంతో అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా సాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఓ అభ్యర్థిని పరీక్షా కేంద్రానికి వెళ్లడానికి కొన్ని నిమిషాలే ఉండడంతో ఆందోళన చెందుతూ స్థానిక దేవి గ్రాండ్ ప్రాంతంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌ను వేడుకోవడంతో ఆయన పెట్రోలింగ్ వాహనంలో ఆమెను పరీక్షా కేంద్రం వద్దకు తీసుకెళ్లారు. అలాగే ఇబ్రహీంపట్నంలో బస్సు దిగి ఇబ్బందులు పడుతున్న ఆపరేషన్ అయిన మహిళా అభ్యర్థిని గమనించిన ఏసీపీ కేపీవీ రాజు తన వాహనంలో వినోబా నగర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు.



పరీక్ష కేంద్రం ఎదుట బిడ్డతో అభ్యర్థిని సునీత నిరసన

అధికారుల నిర్లక్ష్యమే ఆమెకు శాపం

- ముందు అనుమతించి.. తర్వాత పరీక్షా కేంద్రం అది కాదన్నారు
- పరీక్ష రాసే అవకాశం కోల్పోయిన జనగామ గిరిజన అభ్యర్థిని

జనగామ కల్చరల్: జనగామ జిల్లా కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యంతో ఓ గిరిజన అభ్యర్థిని పరీక్ష రాసే అవకాశం కోల్పోయింది. కొడకండ్ల మండలం వాస్యా తండాకు చెందిన భూక్యా సునీత అనే బాలింత ఆదివారం జనగామలో పక్కపక్కనే ఉన్న రెండు పరీక్షా కేంద్రాల్లో ఒకటైన సెయింట్ మేరీస్‌కు అరగంట ముందుగానే వెళ్లింది. అధికారులు గేటు దగ్గర హాల్ టికెట్ పరిశీలించి లోపలికి అనుమతించారు. ఓఎంఆర్ షీటు బయోమెట్రిక్ సమయంలో ఆమె పరీక్షా కేంద్రం అది కాదని, పక్కనే ఉన్న సాన్ మారియా పాఠశాలగా గుర్తించారు. వెంటనే అక్కడకు వెళ్లినా సమయం దాటిపోవడంతో అధికారులు అనుమతించలేదు. జరిగిన విషయం చెప్పినా ససేమిరా అన్నారు. దాంతో ఆమె తన చిన్నపాపతో పరీక్షా కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేసింది. ఇటీవల పోటీ పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకల నేపథ్యంలో టీజీపీఎస్సీ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. నిబంధనల పేరుతో అధికారులు అతిగా ప్రవర్తించి సమస్యలు సృష్టించారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మహిళల మంగళసూత్రాలతో సహా ఆభరణాలు, అభ్యర్థులు బూట్లు, చేతి కంకణాలు తొలగించాలనడం, దివ్యాంగుల వాహనాలను పరీక్షా కేంద్రానికి 100 మీటర్ల దూరంగా పెట్టాలనడంతో ఇబ్బందులకు గురయ్యామని వారు తెలిపారు.

ముగ్గురిని నరికేశారు!

- కాకినాడ జిల్లా వేట్లపాలెంలో దారుణం
- శ్లాబ్ వేస్తుండగా కత్తులు, గొడ్డళ్లతో దాడి
- స్థలం ఆక్రమించి ఇల్లు కడుతున్నారని ఆరోపణ

సామర్లకోట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి దారుణం జరిగింది. ఇంటి నిర్మాణం విషయమై రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కత్తిపోట్లకు గురై దుర్మరణం చెందారు. మరో ఏడుగురు తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సామర్లకోటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుకగల దళిత చెరువు అనే ప్రాంతంలో కార్థాల పండు అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టాడు. అయితే తమ స్థలంలో కొంత కొంత ఆక్రమించి నిర్మాణం చేపట్టారంటూ బచ్చల వర్గీయులు అటు పంచాయతీకి, ఇటు గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా ఈ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నిర్మాణంలో భాగంగా శ్లాబ్ వేస్తుండగా కార్థాల వర్గీయులపై బచ్చల కుటుంబీకులు ఒక్కసారిగా కత్తులు, గొడ్డళ్లతో దాడి చేశారు. వీరిలో కార్థాల ప్రకాశరావు(55) తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో ఐదుగురిని సామర్లకోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ కార్థాల చంద్రరావు(60) మృతి చెందాడు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించిన కార్థాల ఏసుబాబు(45) కూడా మృతి చెందాడు. కార్థాల పండు, కార్థాల దావీదు, కార్థాల బాబీతోపాటు మరో నలుగురు తీవ్ర గాయాలతో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సామర్లకోట సీఐ శ్రీకృష్ణభగవాన్ సందర్శించారు.

గుండెను పరీక్షించలేని ఉస్మానియా

పెద్దాస్పత్రిలో పని చేయని ఈసీజీ యంత్రాలు.. మొత్తం 14 యంత్రాల్లో 13 మొరాయింపు

- నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- దవాఖానలో రోజుకు కనీసం 450 పరీక్షలు
- ప్రస్తుతం ఆస్పత్రి మొత్తానికి ఒక్క యంత్రమే దిక్కు

మంగళ్‌హాట్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పెద్దాసుపత్రిగా పేరొందిన ఉస్మానియా వైద్యశాల గుండె పనితీరును పరీక్షించలేని స్థితికి చేరింది. ఆస్పత్రిలోని ఈసీజీ(ఎలక్ట్రో కార్డియో గ్రామ్) యంత్రాలు కొద్ది నెలలుగా పని చేయడం లేదు. మొత్తం 14 ఈసీజీ యంత్రాల్లో 13 యంత్రాలు వేర్వేరు కారణాలతో మూలకు చేరగా.. ఒకేఒక్కటి పని చేస్తోంది. ఆస్పత్రి మొత్తానికి ప్రస్తుతం ఆ యంత్రమే దిక్కు అయింది. ఏడాదిగా ఈసీజీ యంత్రాల సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సకాలంలో వైద్యం అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

పేరుకే 14 ఈసీజీ యంత్రాలు

గుండె సంబంధిత సమస్యలు, రక్తపోటు, మధుమేహం, మూర్ఛ వంటి సమస్యలతో బాధపడుతున్న వారి గుండె పని తీరును తెలుసుకునేందుకు వైద్యులు ఈసీజీ పరీక్ష సిఫారసు చేస్తుంటారు. అలాగే, ఎవరైనా రోగికి శస్త్ర చికిత్స చేసే ముందు కూడా ఈసీజీ తప్పనిసరి. ఈసీజీ నివేదిక ఆధారంగానే వైద్యులు చికిత్స విషయంలో నిర్ణయం తీసుకుంటుంటారు. ఇంత కీలకమైన ఈ పరీక్షను చేసేందుకు ఉస్మానియాలో 14 ఈసీజీ యంత్రాలు ఉన్నాయి. ఔట్ పేషంట్, ఇన్ పేషంట్, ఐసీయూ, శస్త్రచికిత్సల ముందు కలిపి ఉస్మానియా వైద్యులు రోజూ 450 మందికిపైగా రోగులకు ఈసీజీ సిఫారసు చేస్తుంటారు. కానీ ఉన్న 14 యంత్రాల్లో 4 గతేడాది చెడిపోయాయి. 10 యంత్రాలు విభాగాలుగా ఓపీలో రెండు, ఐపీలో రెండు, వేర్వేరు అత్యవసర విభాగాల్లో ఆరింటిని పెట్టి రోగులకు పరీక్షలు చేసేవారు. అయితే, మిడ్రా, అలెన్ అనే కంపెనీలకు చెందిన నాలుగు ఈసీజీ యంత్రాలు, ఈడెన్ కంపెనీకి చెందిన మరో యంత్రం 4 నెలల క్రితం పాడైపోయాయి. ఆ తర్వాత నెల మరో రెండు ఈసీజీ యంత్రాలు కేబుళ్లలో సమస్యతో పని చేయడం మానేశాయి. దీంతో ఆయా యంత్రాలకు మరమ్మతులు చేయించాలని కోరుతూ ఈసీజీ విభాగం నుంచి సెప్టెంబరు 13న సూపరింటెండెంట్‌కు లేఖ వెళ్లింది. కానీ ఎలాంటి స్పందన లేదు. ఇక, అలెడ్ కంపెనీకి చెందిన రెండు యంత్రాలు గత వారం పాడైపోయాయి. దీంతో డిసెంబరు 4న ఈసీజీ విభాగం సిబ్బంది ఉన్నతాధికారులకు మళ్లీ లేఖ రాశారు. స్పందించిన ఉన్నతాధికారులు.. సదరు కంపెనీ ప్రతినిధుల ఫోన్ నెంబర్లను ఇచ్చి వారితో మాట్లాడుకోవాలని సలహా ఇచ్చారు. చివరకు మిగిలిన ఒక్క ఈసీజీ యంత్రాన్నే ప్రస్తుతం వినియోగిస్తున్నారు.



తాళం వేసిన ఈసీజీ గది ముందు వేచి ఉన్న రోగులు

ఈసీజీ గది వద్ద రోగుల పడిగాపులు

ఆస్పత్రి మొత్తానికి ప్రస్తుతం ఒకేఒక్క ఈసీజీ యంత్రం ఉండడంతో ఓపీ భవనంలోని ఈసీజీ రూమ్ 113 వద్ద వారం రోజులుగా రద్దీ పెరిగిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం దాకా రోగులు తమ వంతు కోసం అక్కడ పడిగాపులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం గమనార్హం. కాగా, ఈ విషయమై ఉస్మానియా రేడియాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ నదీమ్ వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ వివరణ కోరగా.. ఆరు, ఏడు యంత్రాలు పనిచేస్తున్నాయని, పాడైన యంత్రాలను బాగుచేయిస్తున్నామని చెప్పారు.

యంత్రం లేదని గదికి తాళం వేశారు

మా అబ్బాయికి మూర్ఛ రావడంతో ఉస్మానియాకు తీసుకొచ్చా. ఈసీజీ చేయించమని డాక్టర్ చెప్పారు. ఉదయం నుంచి గంటల తరబడి ఈసీజీ గది వద్దే ఉన్నాం. యంత్రం లేదని గదికి తాళం వేశారు. ఎవరిని అడిగినా సిబ్బంది వస్తారు ఈసీజీ చేస్తారనే సమాధానమే చెప్పారు

- రిహాన (ఓ రోగి తల్లి)



అరుణోదయ 50 వసంతాల వేడుకల్లో పాటలు ఆలపిస్తున్న కళాకారులు

సంస్కృతిపై దాడిని ప్రతిఘటించేందుకే అరుణోదయ పోరాటం

రాంనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అత్యంత ప్రాచీనమైన మన సంస్కృతిపై బ్రాహ్మణీయ భావజాలం, ఫాసిజం పేరుతో ప్రస్తుతం జరుగుతోన్న దాడిని ప్రతిఘటించేందుకే అరుణోదయ వంటి సంస్థలు పనిచేస్తున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ 50 వసంతాల ముగింపు కార్యక్రమం సుధాకర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 'ప్రజా సాంస్కృతిక ఉద్యమంలో ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై అంబటి నాగయ్య కీలకోపన్యాసం చేశారు. సామ్రాజ్యవాద సాంస్కృతిక దాడిని నివారించడం ఎలా? అనే అంశంపై ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు ఉపన్యసించారు. అనంతరం అరుణోదయ వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క బృందం పలు గీతాలతో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ముంబయి రాము పవన్(నిశాంత్ నాట్యమంచు) అరుణోదయం సావనీర్‌ను ఆవిష్కరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.